
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5
శ్రీ పొట్టిశ్రీరాములు నెల్లూరు
జిల్లా వార్తలు
బుధవారం 12 మార్చి 2025



కేంద్ర పథకానికి రెండు హాస్టళ్ల ఎంపిక

నెల్లూరు (హరనాథపురం) మార్చి 11 (ఆంధ్రజ్యోతి) : ప్రధాన మంత్రి అనుసుచిత్స్ జాతి అభ్యుదయ పథకానికి జిల్లాలో రెండు హాస్టళ్లు ఎంపికైనట్లు సోషల్ వెల్ఫేర్ డిప్యూటీ డైరెక్టర్ శోభారాణి తెలిపారు. మంగళవారం ఆమె విలేక రులతో మాట్లాడుతూ ఆ జాబితాలో కందుకూరు, మనుబోలు బాలికల హాస్టళ్లు ఉన్నాయన్నారు. ఈ పథకం ద్వారా ఒక్కొక్క హాస్టల్‌కు రూ.3.30కోట్లు మంజూరయ్యాయని ఆ నిధులతో హాస్టళ్ల ఆధునికీకరణ, భవనాలు, వంటశాలు, ప్రహరీతోపాటు విద్యార్థులకు అవసరమయ్యే మెరుగైన మౌలిక వసతులు కల్పించనున్నట్లు తెలిపారు.

దొరికితేనే దొంగలు!

ఫిబ్రవరి 22వ తేదీన వెంకటాచలం టోల్‌ప్లాజా వద్ద సీసీఎస్ పోలీసులు ఆకస్మిక తనిఖీలు చేశారు. చెన్నై నుంచి నెల్లూరుకు ఓ కారులో అక్రమంగా తరలిస్తున్న 42 కేజీల వెండిని గుర్తించారు. చెన్నైలో తక్కువ ధరకు కొనుగోలు చేసి నెల్లూరులో విక్రయిస్తున్నట్లు తేలింది. నగరంలోని ఓ ప్రముఖ జ్యూవెల్లరీ షాపు యజమానులు ఈ తప్పుడు పనికి పాల్పడినట్లు పోలీసులు గుర్తించారు. పట్టుబడిన వెండి విలువ రూ.40 లక్షల వరకూ ఉంటుందని అంచనా.

మార్చి 11వ తేదీన వెంకటాచలం టోల్‌ప్లాజా వద్దనే విజిలెన్స్ అధికారులు తనిఖీలు చేపట్టారు. ఓ కారులో 4.18 కేజీల బంగారం దొరికింది. ఈ బంగారాన్ని చెన్నైలో తక్కువ ధరకు బిల్లులు లేకుండా కొనుగోలు చేసి దానిని అక్రమంగా నెల్లూరులోని ఓ ప్రముఖ జ్యూవెల్లరీ షాపునకు తరలిస్తున్నట్లు గుర్తించారు. ఈ బంగారం విలువ రూ.3.37 కోట్లుగా లెక్కించారు. నిబంధనల ప్రకారం ఈ బంగారాన్ని కొనుగోలు చేసి ఉంటే ప్రభుత్వానికి రూ.10 లక్షలపైగా జీఎస్టీ చెల్లించాలి.





- జిల్లాలో జోరుగా 'జీరో' వ్యాపారం
- అక్రమ మార్గంలో బంగారం, వెండి దిగుమతి
- చెన్నైలో తక్కువకు కొనుగోళ్లు.. ఇక్కడ మార్కెట్ ధరకు విక్రయం
- ఏటా రూ.కోట్ల పన్నులు ఎగనామం
- సమాచారం అందితేనే కదులుతున్న విజిలెన్స్
- మామూళ్ల మత్తే ఇందుకు కారణమా!?
- స్టేట్ ట్యాక్స్, జీఎస్టీ అధికారుల తీరుపై విమర్శలు

ముడు వారాల వ్యవధిలో నమోదైన కేసులివి. ఇక వెలుగులోకి రాని కేసులు ఎన్ని ఉన్నాయో చెప్పలేం. ఓ వైపు విజిలెన్స్ అధికారులు దాడులు చేసి ఆభరణాలు పట్టుకుంటున్నా అక్రమార్కుల్లో ఏమాత్రం జంకూ బెంకూ కనిపించడం లేదు. పోలీసులు కూడా సమాచారం అందితేనే దాడులు చేస్తున్నారు. నిత్యం చెన్నై నుంచి నెల్లూరుకు రూ.కోట్లు విలువైన బంగారం, వెండి ఆభరణాల రవాణా జరుగుతూనే ఉంది. జిల్లాలో నిత్యం రూ.కోట్లలో బంగారం వ్యాపారం జరుగుతోంది. అందులో బిల్లులతో అమ్మే బంగారం ఎంత ఉంటుందో.. బిల్లులు లేకుండా అమ్మే బంగారం కూడా అంతేస్థాయిలో ఉంటుందన్న ప్రచారముంది. దీనిమూలంగా ప్రభుత్వానికి పన్నుల రూపంలో రావాల్సిన ఆదాయం రోజుకు రూ.లక్షల్లో పక్కదారి పడుతున్నట్లు అర్థమవుతోంది.

● చెన్నై నుంచి రవాణా ఇలా..

జిల్లాలోని వ్యాపారులంతా దాదాపుగా చెన్నై నుంచే బంగారాన్ని కొనుగోలు చేసి తెచ్చుకుంటుంటారు. ఇందులో బిల్లుల ద్వారా ఎంత బంగారం దిగుమతి అవుతుంటుందో బిల్లులు లేకుండా కూడా అంతే బంగారం తెప్పించుకుంటారు. బంగారం పుష్కలంగా లభ్యమయ్యే కువైట్ వంటి దేశాల నుంచి చెన్నైకు విమానాల ద్వారా బంగారం స్మగ్లింగ్ జరుగుతూ ఉంటుంది. అలా దిగుమతి అయిన బంగారాన్ని నమ్మకస్థులకు విక్రయిస్తుంటారు. జిల్లాలోని కొంతమంది ముఠాగా ఏర్పడి చెన్నై నుంచి అక్రమ మార్గంలో నెల్లూరుకు బంగారం దిగుమతి చేసుకుంటున్నారు. జిల్లాలో వాణిజ్య కేంద్రాలైన నెల్లూరు, కావలికి చెందిన కొంతమంది వ్యాపారులు అత్యాశకు పోయి బిల్లులు లేని ఈ దొంగ బంగారాన్ని తెచ్చుకుంటున్నారు. ఇక్కడ నుంచే రాష్ట్రవ్యాప్తంగా ఆభరణాలను సరఫరా చేస్తున్నట్లు సమాచారం. బిల్లులు లేకుండా కేజీ బంగారాన్ని కొనుగోలు చేస్తే సుమారు రూ.3 లక్షల వరకు మిగులుతుందని సమాచారం. ఒక వ్యాపారి ఒకసారి చెన్నై నుంచి కనీసం కేజీకి తగ్గకుండా ఆభరణాలు తెచ్చుకుంటారని తెలుస్తోంది. కొంతమంది బడా వ్యాపారులు ఒకేసారి రూ.2 కోట్లకుపైగా సరుకును కూడా కొనుగోలు చేస్తారని సమాచారం. ఇలా బిల్లులు లేకుండా జీరో దందా మూలంగా ప్రభుత్వానికి ఏటా రూ.కోట్లలో ఆదాయానికి గండిపడుతోంది. ఎక్కువగా రైళ్లలోనే ఈ రవాణా జరుగుతోంది. కావలి, నెల్లూరుకు చెందిన కొంతమంది సామాన్య వ్యక్తుల్లా రైళ్లలో చెన్నైకు వెళతారు. అక్కడ బంగారం కొని తిరిగి సాయంత్రానికి రైళ్లలోనే వచ్చేస్తారు. అయితే, ఇటీవల రైళ్లలో తనిఖీలు ఎక్కువగా జరుగుతుండటంతో ఇప్పుడు జీరో వ్యాపారులు బస్సులు, కార్లు వంటి వాహనాలను ఎంచుకుని, రవాణా చేస్తున్నారు. ఈ క్రమంలో అధికారులకు పక్కా సమాచారం అందినప్పుడే వీరి అక్రమ వ్యాపారం వెలుగులోకి వస్తోంది.



టోల్‌ప్లాజా వద్ద బంగారం ఉన్న కారును ఆపుతున్న విజిలెన్స్ బృందం

● పర్యవేక్షణ ఏదీ?

జిల్లాలో కొన్నేళ్ల నుంచి బంగారం జీరో బిజినెస్ జరుగుతుందన్నది బహిరంగ రహస్యం. పోలీసులే కాకుండా అనేక సార్లు డైరెక్టరేట్ ఆఫ్ రెవెన్యూ ఇంటెలిజెన్స్ (డీఆర్ఐ) అధికారులు, రైల్వే పోలీసులు పట్టుకున్న సందర్భాలు ఉన్నాయి. అయినా దొంగ వ్యాపారం మాత్రం ఆగడం లేదు. బంగారం దుకాణాల్లో కూడా చాలా వరకూ బిల్లులు లేకుండానే అమ్మకాలు జరుగుతుంటాయి. నెల్లూరు నగరంలోని చిన్న బజారు, పెద్ద బజారు ప్రాంతాలకు వెళితే చాలా దుకాణాల్లో బిల్లులు ఇవ్వరు. కొన్నిచోట్ల 'ఎస్టిమేషన్' పేరుతో ఉన్న బిల్లులు మాత్రం ఇస్తున్నారు. ఈ దుకాణాల్లో ఆకస్మికంగా దాడులు జరిపితే అనేక అక్రమ వ్యవహారాలు వెలుగులోకి వస్తాయి. కానీ స్టేట్ ట్యాక్స్, జీఎస్టీ అధికారులు ఎప్పుడూ ఆ దిశగా ఆలోచన చేయడం లేదు. ప్రతి నెలా జిల్లాలో కొన్ని రూ.వందల కోట్ల బంగారం వ్యాపారం జరుగుతున్నా ఆ స్థాయిలో ప్రభుత్వానికి పన్నులు చెల్లిస్తున్నారా!? లేదా!? అన్నది పరిశీలిస్తే జీరో దందా బట్టబయలవుతుంది. కానీ జీరో బిజినెస్ చేసే వ్యాపారులు సిండికేట్‌గా మారి అధికారులు దాడులకు రాకుండా ప్రతి నెలా మామూళ్లు అందిస్తారన్న ఆరోపణలు ఉన్నాయి.

- నెల్లూరు, (ఆంధ్రజ్యోతి)



వెంకటాచలం టోల్‌ప్లాజా వద్ద పట్టుబడిన బంగారాన్ని తూకం వేస్తున్న విజిలెన్స్ అధికారులు

ఇక 3 రోజులే గడువు.. సర్వే పూర్తయ్యింది 83 శాతం

- మిగిలిన లక్ష్యం పూర్తికి కసరత్తు
- 15తో ముగియనున్న ఎంఎస్‌ఎంఈల సర్వే
- సర్వే సపోర్టు యాప్‌లోకి సమాచారం

8

రంజాన్ వేళలు

ఇఫ్తార్ (బుధవారం) : 6.24
సహరి (గురువారం) : 5.03

అధికారం చేతిలో ఉంది.. ఇక అడిగేవారు ఎవరుంటారని గత వైసీపీ హయాంలో అప్పటి పాలకులు పేట్రేగిపోయారు. ప్రభుత్వ భూములను యథేచ్ఛగా కబ్జా చేయడమేకాదు.. వాటికి పట్టాలు సృష్టించి కాసులు ఇచ్చిన వారికి పంపిణీ చేసేశారు. రెవెన్యూ శాఖలో కొంతమంది అధికారులు కూడా వారికి వత్తాసు పలకడంతో అనర్హులకూ ప్రభుత్వ భూములను కట్టబెట్టారు. ఈ వ్యవహారంపై అప్పట్లో ప్రజలు ఫిర్యాదు చేసినా ఎవరూ పట్టించుకోలేదు. అయితే, ప్రస్తుత కూటమి ప్రభుత్వమైనా ఈ భూబాగోతంపై విచారించి, పేదలకు న్యాయం చేయాలనే డిమాండ్ వ్యక్తమవుతోంది.

వైసీపీ నేతల భూదాహం

- గత ప్రభుత్వంలో యథేచ్ఛగా ఆక్రమణలు
- వాగు, వంక, కొండపోరంబోకు భూములకు పట్టాలు
- పన్ను చెల్లింపుదారులకూ భూ కేటాయింపులు
- మాజీ మంత్రి కాకాణి కనుసన్నల్లో రెవెన్యూ అధికారులు
- ఇప్పటికే ఇద్దరు తహసీల్దార్ల సస్పెన్షన్
- పూర్తిస్థాయిలో విచారణకు ప్రజల డిమాండ్

పొదలకూరు, మార్చి 11 (ఆంధ్రజ్యోతి) : వైసీపీ జిల్లా అధ్యక్షుడు, మాజీ మంత్రి కాకాణి కాకాని గోవర్ధన్‌రెడ్డి సొంత మండలమైన పొదలకూరులో వైసీపీ నేతలు గత ఐదేళ్లలో వందల ఎకరాల ప్రభుత్వ భూములను ఆక్రమించారు. కొందరు రెవెన్యూ అధికారుల సహకారంతో అడ్డగోలుగా ఆన్‌లైన్‌లో పేర్లు ఎక్కించి రూ.కోట్లు వెనకేసుకున్నారు. 2019, ఆగస్టు నుంచి 2021, ఆగస్టు వరకు పొదలకూరు తహసీల్దారుగా పనిచేసిన స్వాతి పలు భూ అక్రమాలకు పాల్పడి, విచారణలో నిగ్గు తేలడంతో సస్పెన్షన్‌కు గురయ్యారు. 2023, జూన్ నుంచి 2024 జూన్ వరకు వివిధ భూ కుంభకోణాలు జరిగాయి. ఇక్కడ పనిచేసిన రెవెన్యూ అధికారి సహకారంతో ప్రభుత్వ భూములను సబ్ డివిజన్ చేసినట్లు ఆన్‌లైన్‌లో చూపి ప్రైవేటు వ్యక్తుల పేర్లు నమోదు చేశారు. ఈ క్రమంలో కొందరికి డీకే పట్టాలు ఇచ్చినట్లు రికార్డుల్లో చూపారు. సాక్షాత్తు రెవెన్యూ అధికారులే ధనాశతో ప్రభుత్వ భూములను ప్రైవేటుపరం చేశారు.

● ఎన్‌ఆర్‌ఐలకూ ధారాదత్తం

సర్వే నెంబరు 561, 562, 559, 330, 292 నెంబర్లలో గతంలో ఎస్సీ, ఎస్టీలకు పీవోటీ చట్టం ప్రకారం ప్రభుత్వం పట్టాలను అందజేసి ఉన్నా, ప్రస్తుత భూపంపిణీలో ఎన్‌ఆర్‌ఐ (నాన్ రెసిడెంట్ ఇండియన్)లకు భూ పంపిణీలో పేర్లను చేర్చి వారి పేరున పట్టాలు మంజూరు చేశారు. అలాగే 554-2, 554-3, 537-7, 544-2, 545-3, 545-4, 330, 535, 333-4, 363, 389-3 కాకుండా స్థానికేతరులైన వారికి పీవోటీ చట్టానికి విరుద్ధంగా ఎస్సీ, ఎస్టీ, బీసీలకు కేటాయించిన భూములను భూస్వాములకు ధారాదత్తం చేశారు. అలాగే బత్తులపల్లి గ్రామ పరిధిలో సర్వే నెం.249-1-1, 252, 151-1250-2లలో సుమారు ఎ25.00 సెంట్లు భూమి ఎప్పటి నుంచో వాటిని గ్రామంలోని ఇతర భూములకు వెళ్లేందుకు దారులుగా ఉన్నాయి. ఆ భూములను సైతం పట్టాలను పంపిణీ చేశారు. భూములను యథా స్థితిలో ఉంచాలని గ్రామస్థులు కోరుతున్నారు. అలాగే గ్రామంలో చాలామంది స్థానికేతరులకు, గ్రామంలోని ఒకే కుటుంబానికి చెందిన వారు అర్హులు కాకున్నా అసైన్‌మెంట్ నిబంధనలకు వ్యతిరేకంగా ఎక్కువ మొత్తంలో భూమిని పంపిణీ చేసివున్నారు. ఊట్లపాలెం, కొత్తకం బాలపల్లి గ్రామ సర్వే నెంబరు 93, 112, 113, 115, 115-4లో సుమారు ఎ.52.00 సెంట్లు భూమిలో సుమారు రూ.33.00 సెంట్ల భూమిలో కండలేరు జలాశయ ముంపు ప్రజలకు ఇళ్ల స్థలాలను కేటాయించారు. అయితే ప్రస్తుతం భూపంపిణీలోని మిగిలిన గ్రామ కంఠం భూమిని వైసీపీ కార్యకర్తలకు పట్టాల పంపిణీకి సిద్ధం చేవారు.

నేదురుపల్లి మజరా యర్రబల్లి గ్రామ సర్వే నెంబరు 814లో కొండ అయినా పట్టాను కేటాయించారు. సర్వే నెంబరు 159లో ఎ.16.34 సెంట్లు సాగుకు పనికిరాని భూమిని ఇద్దరు పన్ను చెల్లింపుదారులకు పట్టాలను కేటాయించారు. మరుపూరులో నివాసం లేనివారికి ధనికులకు, ఆదాయపు పన్ను చెల్లింపుదారులకు నకిలీ ఆధార్, రేషన్ కార్డులను సృష్టించి, తమకు ఇష్టం వచ్చినట్లు పట్టా భూములిచ్చారు. ఏఆర్‌పీ జాబితాలో పేర్లు లేకున్నా మరుపూరులో దొంగ పట్టాలు సుమారు 60 వరకు ముడుపులు తీసుకుని పట్టా కాగితం ఇచ్చి ఉన్నారనే అభియోగాలు ఉన్నాయి. కూటమి ప్రభుత్వం వీటిని పరిశీలించి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.



మరుపూరులో నిబంధనలకు విరుద్ధంగా భూమి సాగు చేసుకుంటున్న వైసీపీ నేత

లోపభూయిష్టంగా భూ పంపిణీ

మండలంలోని వావింటపర్తి, మరుపూరు, ప్రభగిరిపట్నం గ్రామాల్లో ఎక్కువగా భూఆక్రమణలు జరిగాయి. గత ప్రభుత్వం మండలంలో చేపట్టిన భూపంపిణీ లోపభూయిష్టంగా, తప్పులతడకగా ఉంది. అంతేగాక ఒకే వర్గానికి పూర్తి ప్రాధాన్యతను ఇచ్చిందనే విమర్శలు ఉన్నాయి. ధనార్జనే ధ్యేయంగా అర్హులకు అన్యాయం చేస్తూ, నిబంధనలకు విరుద్ధంగా కొండ, వాగు, మేత పోరంబోకు భూములను ధారాదత్తం చేశారు. ప్రభగిరిపట్నం గ్రామ సర్వే నెం.117, 58లలోని 60 ఎకరాల్లో ఉన్న కొండను సాగులో ఉన్నట్లు చూపుతూ చేతివాటం ప్రదర్శించారు. అలాగే వావింటపర్తిలో సర్వే నెంబరు 234లో ఎ11.38సెంట్లు కాలువ (వాగు), సర్వే నెం.219లో ఎ7.50సెంట్లు మేత బీడు (మేత పోరంబోకు), సర్వే నెం.215లో ఎ.21.25 సెంట్లు మేత బీడు (మేతపోరంబోకు), తరతరాల నుంచి వదిలి వేసిన భూములను సైతం సాగులో ఉన్నట్లు చూపుతూ వాటిలో కూడా భూపంపిణీ చేశారు.

రామావతారంలో హనుమంతుడిపై ప్రసన్నుడు







ఉదయం సూర్యప్రభ, రాత్రి హంస వాహనంపై కొలువదీరిన శ్రీరంగనాథుడు

● హనుమంతుడిపై ప్రసన్నుడు..

బిట్రగుంట : బిలకూట క్షేత్రంలో మంగళవారం రాత్రి శ్రీవారు రామావతారంలో ప్రసన్న వేంకటేశ్వరస్వామి హనుమంతుడిపై కొలువుదీరి విహరించారు. భక్తులు గోవింద నామస్మరణలు చేస్తూ స్వామివారికి కాయా కర్పూర హారతి ఇచ్చి దర్శించుకున్నారు. నారద మహాముని విగ్రహం వద్ద ప్రత్యేక పూలాలంకరణ, బిలకూటక్షేత్రం విద్యుద్దీపాలతో శోభిల్లింది. కావలి ఎమ్మెల్యే కావ్య కృష్ణారెడ్డి టీడీపీ నేతలతో కలిసి శ్రీవారిని దర్శించుకున్నారు.ఆలయ ఈవో రాధాకృష్ణ తదితరులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

సూర్య, హంసలపై రంగనాథుడి విహారం

నెల్లూరు (సాంస్కృతికం, ఆంధ్రజ్యోతి) : నగరంలోని తల్పగిరి రంగనాథస్వామి బ్రహ్మోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. భక్తులు భారీ సంఖ్యలో తరలివచ్చి స్వామి, అమ్మవార్లను దర్శించుకున్నారు. ఉదయం సూర్యప్రభ వాహనంపై స్వామివారు కనువిందు చేశారు. ఈ సందర్భంగా విశేష పూజలు, పూలంగిసేవలు జరిగాయి. రాత్రి హంస వాహనంపై కొలువుదీరిన స్వామివారి భక్తులను కటాక్షిస్తూ విహరించారు. ఉత్సవాలు సందర్భంగా సాంస్కృతిక ప్రదర్శనలు అలరించాయి. ఆలయ ఈవో ఆళ్ల శ్రీనివాసరెడ్డి, ధర్మకర్తలు, అర్చకులు సిబ్బంది పాల్గొన్నారు.

ఎన్నికల ప్రక్రియ బలోపేతానికి చర్చకు ఆహ్వానం

కలెక్టర్ ఆనంద్

నెల్లూరు (హరనాథపురం), మార్చి 11 (ఆంధ్రజ్యోతి) : ఎన్నికల ప్రక్రియను బలోపేతం చేసేందుకు పార్టీల అధ్యక్షులు, సీనియర్ నేతలను ఎన్నికల సంఘం చర్చకు ఆహ్వానించిందని కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి ఓ ఆనంద్ ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఎటువంటి పరిష్కారం లభించని సమస్యలపై భారత ఎన్నికల సంఘం ఏప్రిల్ 30 నాటికి అన్ని జాతీయ, రాష్ట్ర రాజకీయ పార్టీల నుంచి సూచనలు కోరిందని, ఈ మేరకు ఈసీ మంగళవారం రాజకీయ పార్టీలకు వ్యక్తిగతంగా ఒక లేఖను పంపిందని తెలిపారు. పార్టీ అధ్యక్షులు, పార్టీ సీనియర్ సభ్యులతో చర్చించేందుకు కూడా అవకాశం ఇచ్చిందన్నారు. పార్టీ సభ్యులతో పరస్పర అనుకూల సమయానికి సమావేశం ఏర్పాటు చేసి, ఎన్నికల ప్రక్రియను చట్టబద్ధమైన మార్గంలో మరింత బలోపేతం చేయాలనే లక్ష్యంతో ఈ నిర్ణయం తీసుకుందని పేర్కొన్నారు. గత వారం జరిగిన ఈసీఐ సమా వేశంలో ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేష్‌కుమార్ అన్ని రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల్లోని సీఈఓలు, డీఈవోలు, ఈఆర్‌వోలకు రాజకీయ పార్టీలతో తరచుగా సమావేశాలు నిర్వహించాలని సూచించారని తెలిపారు. ఈ సమావేశాల్లో అందిన సూచనలను ఇప్పటికే అమలులో ఉన్న చట్టపరమైన వ్యవస్థలో పరిష్కరించి, తీసుకున్న చర్యల నివేదికను ఈ నెల 31 నాటికి ఎన్నికల సంఘానికి సమర్పించాలని ఎన్నికల సంఘం ఆదేశించిందని తెలిపారు. ఈ వికేంద్రీకృత చర్చా విధానాన్ని సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ కోరారు.

పక్కాగృహ లబ్ధిదారులకు అదనపు సాయం

సంగం, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ లేఅవుట్‌ల్లో వివిధ దశల్లో ఆగిపోయిన పక్కాగృహాలను పూర్తి చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం అదనపు సాయం చేయనున్నదని గృహనిర్మాణా శాఖ ఈఈ మోహన్‌రావు పేర్కొన్నారు. మంగళవారం ఆయన ఇన్‌చార్జి డీఈఈతో కలిసి సంగం, దువ్వూరు తదితర గ్రామాల్లో అర్ధంతరంగా ఆగిన పక్కాగృహాల నిర్మాణాలు, నాణ్యతను పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ ఆగిన ఇళ్ల పూర్తికి ఎస్సీ, బీసీ, చేనేత కార్మికులకు రూ.50 వేలు, ఎస్టీలకు రూ. 75 వేలు, ఆదివాసీ గిరిజనులకు రూ. లక్ష చొప్పున ప్రభుత్వం అదనంగా సాయం అందచేస్తుందని తెలిపారు. వీటిని మే 31న నాటికి పూర్తి చేయాలన్నారు. 2.0 కింద పక్కాగృహాలకు ప్రతిపాదనలు కోరడంతో జిల్లాలో 52 వేల దరఖాస్తులు వచ్చాయని తెలిపారు. కార్యక్రమంలో వర్క్‌ఇన్‌స్పెక్టర్, సచివాలయ ఇంజనీరింగ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.


దువ్వూరులో లబ్ధిదారులతో మాట్లాడుతున్న ఈఈ మోహన్‌రావు

సిమెంట్ రోడ్డు పనుల ప్రారంభం

సంగం, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తలుపూరుపాడులో సర్పంచి షేక్ నాజున్నీ మంగళవారం సిమెంట్ రోడ్డు పనులను ప్రారంభించారు. ఇటీవల మంత్రి ఆనం సహకారంలో గ్రామంలో సిమెంట్ రోడ్డు పనులకు రూ. 10 లక్షలు మంజూరయ్యాయి. ఈ నిధులతో ఎస్సీ, ఎస్సీ కాలనీలో సిమెంట్ రోడ్డు పనులను చేస్తున్నారు. కార్యక్రమంలో సంగం సాగునీటి సంఘం అధ్యక్షుడు షేక్ బాబు, గ్రామస్థులు పాల్గొన్నారు.


సిమెంట్ రోడ్డు పనులు ప్రారంభిస్తున్న సర్పంచి నాజున్నీ

వివాదాస్పద భూమిపై తహసీల్దారు విచారణ

సంగం, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): స్థానిక తహసీల్దారు కార్యాలయంలో మంగళవారం వివాద భూమిపై తహసీల్దారు సోమ్లానాయక్ అధ్యక్షతన రెవెన్యూ కోర్టు విచారణ జరిగింది. మండలంలోని అనసూయనగర్‌లో భూమిపై వెంకట రమణయ్యకు గ్రామస్థుల మధ్య వివాదం నెలకొనింది. దీంతో రెవెన్యూ అధికారులు హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేశారు. వివాద భూమికి పాసుపుస్తకం ఇప్పించాలని రైతు హైకోర్టును ఆశ్రయించారు. విచారించిన హైకోర్టు తహసీల్దారును రెవెన్యూ కోర్టు నిర్వహించాలని ఆదేశిచ్చింది. ఈ మేరకు ఆయన రెవెన్యూ కోర్టు నిర్వహించారు. రైతు తరఫున హైకోర్టు లాయర్ హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో అనసూయనగర్ గ్రామస్థులు, వీఆర్వో శోభన్‌బాబు, ఆర్ఐ పాల్గొన్నారు.


రెవెన్యూ కోర్టు నిర్వహిస్తున్న తహసీల్దారు సోమ్లా నాయక్

కలువాయి స్టేషన్‌ను తనిఖీ చేసిన ఎస్పీ

కలువాయి, మార్చి 11(ఆంధ్రజ్యోతి): స్థానిక పోలీస్‌స్టేషన్‌ను మంగళవారం ఎస్పీ జీ.కృష్ణకాంత్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. రికార్డుల పరిశీలన అనంతరం కేసుల పురోగతిపై సిబ్బందితో సమీక్షించారు. శాంతి,భద్రతల పరిరక్షణపై సూచనలిచ్చారు. ఆయన వెంట రాపూరు సీఐ సత్యనారాయణ, కలువాయి ఎస్ఐ సుమన్ తదితరులు ఉన్నారు.


రాపూరు సీఐ సత్యనారాయణతో మాట్లాడుతున్న ఎస్పీ కృష్ణకాంత్

విద్యార్థినికి చేయూత

వరికుంటపాడు(ఉదయగిరి రూరల్), మార్చి 11 (ఆంధ్రజ్యోతి): మండలంలోని విరువూరు ఉన్నత పాఠశాలలో 8వ తరగతి చదువుతున్న విద్యార్థిని ఈర్ల వెంకటస్వప్నకు మంగళవారం మానవత స్వచ్ఛంద సేవాసంస్థ ఆధ్వర్యంలో రూ.10,500ల నగదును అందజేశారు. ఉదయగిరి మండలం వెంకట్రావుపల్లికి చెందిన ఆ విద్యార్థినికి తల్లిదండ్రులు లేకపోవడంతో మండలంలోని గొల్లపల్లిలో బంధువుల సంరక్షణలో ఉంటూ చదువుతోంది. ఆర్థిక పరిస్థితిని గమనించిన సంస్థ కన్వీనర్ వెంకటేశ్వరరెడ్డి, కోశాధికారి రమేష్ పాఠశాలకు చేరుకుని నగదును అందజేశారు. ఈ కార్యక్రమంలో తిరుపతరెడ్డి, నాగేశ్వరరావు, మాల్యాద్రి, తదితరులు పాల్గొన్నారు.


విద్యార్థినికి నగదు అందజేస్తున్న సంస్థ సభ్యులు

చెట్ల నరికివేత పరిశీలన

వరికుంటపాడు(ఉదయగిరి రూరల్), మార్చి 11(ఆంధ్రజ్యోతి): మండలంలోని నక్కలగండి రిజర్వాయర్ పరిసరాల్లో విలువైన కలపను, అక్రమంగా తరలిస్తుండడంతో మంగళవారం పలు పత్రికల్లో కథనాలు వచ్చాయి. స్పందించిన వింజమూరు జలవనరుల శాఖ డీఈ రమణరావు రిజర్వాయర్ వద్దకు చేరుకుని పరిశీలన చేశారు. చెట్లు నరికివేసిన విషయం తనకు దృష్టికి రాగానే పోలీసులకు ఫిర్యాదు చేశామన్నారు. గుర్తుతెలియని వ్యక్తులు వేప, తుమ్మ, కర్రతుమ్మ చెట్లను నరికి తరలించినట్లు ఆయన నిర్ధారించారు. త్వరలోనే విచారణ చేపట్టి బాధ్యులపై చర్యలు చేపట్టేలా ఉన్నతాధికారులకు నివేదికలు అందచేస్తామన్నారు. అనంతరం తిమ్మారెడ్డిపల్లి వద్ద చేపడుతున్న నీటికొలను నిర్మాణ పనులను పరిశీలించారు. ఆయన వెంట ఏఈ అంకులయ్య, సిబ్బంది తదితరులున్నారు.


చెట్లు నరికిన ప్రాంతాన్ని పరిశీలిస్తున్న డీఈ రమణరావు



ప్రమాదకరంగా విద్యుత్ తీగలు

అనంతసాగరం మార్చి 11 (ఆఆంధ్ర జ్యోతి: మండలంలోని ఆమనిచిరువెళ్ల చెరువు వద్ద విద్యుత్ తీగలు కిందకు వేలా డుతున్నాయి. దీంతో ప్రమాదం పొంచి ఉం ది. గాలి వీచిన సమయంలో విద్యుత్ తీ గలు రాసుకుంటున్నాయని స్థానికులు తెలి పారు. ప్రమాదాలు జరక్కముందే వాటిని విద్యుత్ అధికారులు సరిచేయాలని వారు కోరుతున్నారు.

'గోకులం' బిల్లులు ఎప్పుడిస్తారు!?

● లబ్ధిదారుల ఎదురుచూపు

మర్రిపాడు, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): పశువులు జీవాలు, కోళ్లకు నీటివసతి కల్పించటానికి మినీ గోకులం షెడ్ల నిర్మాణాలకు పాలకులు పచ్చజెండా ఊపారు. దీంతో నిర్మాణ పనులు వేగంగా సాగాయి. అయితే బిల్లుల చెల్లింపుల్లో జాప్యం నెలకొంది. ఆత్మకూరు నియోజకవర్గంలోని చేజర్లకు 51, మర్రిపాడుకు 44, అనంతసాగరానికి 59, ఏఎస్‌పేటకు 36, ఆత్మకూరుకు 46, సంగంకు 56 గోకులం షెడ్లు మంజూరయ్యాయి. ఆ తర్వాత కొందరు ఆసక్తి చూపకపోవటంతో కొన్ని రద్దయ్యాయి. మరికొన్ని వివిధ దశల్లో ఉన్నాయి. వేగంగా పనులు పూర్తి చేసి బిల్లులకోసం ఉపాధి హామీ కార్యాలయాల చుట్టూ రైతులు తిరుగుతున్నారు. పశువుల షెడ్డు నిర్మాణానికి యూనిట్ వ్యయాన్ని రూ.1.15లక్షల నుంచి రూ.2.30 లక్షల వరకు కేటాయించారు. అందులో 90శాతం రాయితీ, 10శాతం లబ్ధిదారుల వాటా చెల్లించాలి. మేకలు, గొర్రెలు, కోళ్ల పెంపకం దారుల దారులకు 70శాతం రాయితీ ఇస్తున్నారు. సంక్రాంతి నాటికి అన్నీ పూర్తి చేయాలని లక్ష్యాన్ని నిర్ధేశించినా, పూర్తి చేయలేకపోయారు. ఉపాధి పథకంలో బిల్లులు చెల్లించాలని నిర్ణయించారు. అయితే బిల్లులు చెల్లింపుల్లో జాప్యం జరుగుతోంది. ఇప్పటికైనా బిల్లులు చెల్లించాలని రైతులు కోరుతున్నారు.

త్వరలో చెల్లిస్తాం : ఏపీవో నారాయణ

గోకులం షెడ్ల బిల్లులను త్వరలో చెల్లిస్తాం. ఇప్పటికే బిల్లులు పెట్టాం. త్వరలోనే రానున్నాయి. రాగానే రైతులకు అందచేస్తాం. మండలానికి 44 షెడ్లు మంజూరయ్యాయి. అందులో 42 పూర్తయ్యాయి.


పెగళ్లపాడులో నిర్మించిన గోకులం షెడ్డు

ధాన్యం అమ్మిన 24 గంటల్లో నగదు జమ : డ్వామా పీడీ

చేజర్ల, మార్చి11 (ఆంధ్రజ్యోతి): కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం విక్రయించిన రైతులకు వారి ఖాతాల్లో 24 గంటలల్లో నగదు జమ వేస్తామని మండల ప్రత్యేక అధికారి, డీఆర్‌డీఏ పీడీ నాగరాజకుమారి తెలిపారు. మంగళవారం మండలంలోని గొల్లపల్లి వద్ద ధాన్యం కొనుగోలు కేంద్రాల ద్వారా మిల్లుకు తరలిస్తున్న ట్రక్ షీట్‌ను పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ కలెక్టర్, జేసీల ఆదేశాల మేరకు కొనుగోలు కేంద్రాలను పరిశీలిస్తున్నట్లు తెలిపారు. గతంలో వచ్చిన గోనె సంచుల సమస్య, మిల్లు మ్యాపింగ్, మిల్లు గ్యారెంటీలు, లారీల సమస్యలు లేకుండా రైతులు సులభంగా ధాన్యం విక్రయించుకునేలా ప్రభుత్వం చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో తహసీల్దారు బీ.మురళీ, ఎంపీడీవో విజయలలిత, ఏపీఎం సుజన, స్థానిక నాయకుడు ఉడతా హజరత్తయ్య తదితరులు పాల్గొన్నారు.

● కొనుగోలు కేంద్రాల్లోనే ధాన్యం విక్రయించాలి

ఏఎస్ పేట,మార్చి11(ఆంధ్రజ్యోతి): రైతులు పండించిన ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాల్లోనే మద్దతు ధరకు విక్రయించాలని పంచాయతీరాజ్ ఎస్ఈ, ప్రత్యేకాధికారి పీ. అశోక్‌కుమార్ తెలిపారు.మంగళవారం ఆయన మండలంలోని శ్రీకొలను రైతు సేవా కేంద్రంలో ఏర్పాటు చేసిన కోనుగొలు కేంద్రాన్ని పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ ప్రభుత్వం ఏ గ్రేడ్ రకం ధాన్యం పుట్టికి రూ. 19,720లు, సాధారణరకం పుట్టి రూ.19,550కు కొనుగోలు చేస్తున్నదని తెలిపారు. ధాన్యం అమ్మాక త్వరగానే నగదు రైతుల ఖాతాల్లో జమ అవుతుందన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో ప్రసన్నకుమారి, ఎంఈవో చిరంజీవి,ఎస్ఈవో రమేష్,వీఏఏ తులసి పాల్గొన్నారు.


చేజర్ల : గొల్లపల్లి వద్ద ట్రక్‌షీట్‌ను పరిశీలిస్తున్న డీఆర్‌డీఏ పీడీ నాగరాజకుమారి

అంగన్‌వాడీలకు శిక్షణ

ఉదయగిరి, మార్చి 11(ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రైవేటు జూనియర్ కళాశాలలో సోమవారం మండలంలోని అంగన్‌వాడీలకు పోషణ్‌బీ పఢాయిబీ కార్యక్రమంలో భాగంగా మంగళవారం శిక్షణ ఇచ్చారు. రిసోర్సుపర్సన్‌లు ఆర్.సుబ్బరత్నమ్మ, సీహెచ్ రమణమ్మ మాట్లాడుతూ అంగన్‌వాడీ కేంద్రాలకు వచ్చే 3-6 ఏళ్లలోపు చిన్నారులకు ఆటపాటల ద్వారా విద్యాబుద్ధులు నేర్పించాలన్నారు. బాలింతలు, గర్భిణులు, చిన్నారులకు పౌష్టికాహారం అందించాలన్నారు.

పోషణ్ బీ పఢాయి బీపై శిక్షణ

సీతారామపురం, మార్చి 11 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలోని జడ్పీ ఉన్నత పాఠశాలలో అంగన్‌వాడీ సూపర్‌వైజరు రత్నమ్మ ఆధ్వర్యంలో మంగళవారం పోషణ్ బీ పఢాయి బీపై శిక్షణ నిర్వహించారు. కార్యక్రమంలో ఉదయగిరి సీడీపీవో సునీత, కావలి సూపర్‌వైజర్ వాణి పాల్గొన్నారు. ఈ సందర్భంగా సునీత మాట్లాడుతూ మూడు రోజులపాటు శిక్షణ ఉంటుందన్నారు.శిక్షణలో నేర్చుకున్న అంశాలను అంగన్‌వాడీ కేంద్రాల్లో తెలియచెప్పాలన్నారు.


సీతారామపురం : శిక్షణలో మాట్లాడుతున్న సీడీపీవో సునీత

మామిడి తోటల పరిశీలన

కలువాయి, మార్చి 11(ఆంధ్రజ్యోతి): మండలంలోని చింతలాత్మకూరులో ఉన్న మామిడి తోటలను మంగళవారం మండల ఉద్యానవనశాఖ అధికారి మిథిల పరిశీలించారు. పూతలో నల్లతామర, తేనెమంచు పురుగును గుర్తించి, నివారణ చర్యలను రైతులకు వివరించారు. తామరపురుగు రసం పీల్చి వేయడం వల్ల పూత రాలడం, కాయలపై రాతి మంగు ఏర్పడి నాణ్యత తగ్గిపోతుందని ఆమె తెలిపారు. ఇందుకు నివారణ చర్యలు చేపట్టాలని ఆమె రైతులకు తెలియచేశారు.

రాజకీయ పార్టీలతో రేపు సమావేశం

ఉదయగిరి, మార్చి 11(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ఎన్నికల అధికారి ఆదేశాల మేరకు ఉదయగిరి నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి కే. వెంకటరెడ్డి ఆధ్వర్యంలో ఓటర్ల జాబితాలో చేర్పులు, మార్పులపై రాజకీయ పార్టీల ప్రతినిధులతో గురువారం తహసీల్దారు కార్యాలయంలో సమావేశం నిర్వహించనున్నట్లు తహసీల్దారు సుభద్ర మంగళవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గంలోని ఎనిమిది మండలాలకు చెందిన రాజకీయ పార్టీల ప్రతినిధులు పాల్గొనాలని ఆమె తెలిపారు.

మోదీ ఆశీస్సులతోనే జగన్‌కు 3వేల సార్లు బెయిల్

● కేంద్ర మాజీ మంత్రి చింతా మోహన్

నెల్లూరు (సాంస్కృతికం)/కావలి, మార్చి 11 (ఆంధ్రజ్యోతి) : సీబీఐ కేసుల్లో మాజీ ముఖ్యమంత్రి వైఎస్.జగన్మోహన్‌రెడ్డి ప్రధాని నరేంద్ర మోదీతోనే 3వేలసార్లు బెయిల్ వచ్చిందని కేంద్ర మాజీ మంత్రి, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత చింతా మోహన్ విమర్శించారు. మంగళవారం నెల్లూరు, కావలిలో ఆయన విలేకరులతో మాట్లాడారు. చంద్రబాబును జగన్‌లను సైకిల్‌కి రెండు చక్రాలు చేసుకుని ప్రధాని మోదీ సవారీ చేస్తున్నారంటూ వ్యాఖ్యానించారు. పార్లమెంటులో నియోజకవర్గాల పునర్విభజన చర్చలో తమిళనాడు ఆత్మగౌరవం దెబ్బతీసేలా, ఒడిశాకు చెందిన బీజేపీ మంత్రి ధర్మేంద్రప్రసాద్ మాట్లాడిన మాటలను తాను ఖండిస్తున్నట్లు చెప్పారు. దేశంలోని నిరుద్యోగ యువతను పట్టించుకోకుండా ప్రధాని మోదీ నోరు తెరిస్తే ట్రంప్ టైగర్‌ల గురించి మాట్లాడుతున్నారని తెలిపారు. బీజేపీ ప్రభుత్వంలో ధరలు ఆకాశానికి ఎగబాకాయని, రోజురోజుకు పన్నులు పెంచుతున్నారని అన్నారు. రాష్ట్రానికి 15 ఏళ్లుగా సీఎంగా ఉన్న చంద్రబాబు నాయుడు నెల్లూరు, కావలి అభివృద్ధికి రూ.500 కోట్లు ఇవ్వాలని కోరారు. మద్యం, పెట్రోలు, డీజిల్ అమ్మకాలపై వచ్చే పన్నులతో చంద్రబాబు పరిపాలన సాగిస్తున్నారని తెలిపారు. 2027లో జమిలీ ఎన్నికలు రావటం తథ్యమని, ఇటు కేంద్ర, అటు రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి తీసుకురావటం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు.

భక్తిశ్రద్ధలతో పోలేరమ్మకు చద్ది


పోలేరమ్మకు చద్ది తీసుకెళుతున్న భక్తులు


సంగం, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కోలగట్లలో మంగళవారం పోలేరమ్మకు భక్తులు భక్తిశ్రద్ధలతో చద్ది ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వారు ఇళ్ల నుంచి చద్ది తీసుకుని ర్యాలీగా అమ్మవారి వేపమాను వద్దకు వచ్చి సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. కార్యక్రమంలో అధికసంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

రోడ్డుపై ప్లాస్టిక్ వ్యర్థాలు వేస్తే చర్యలు


హోటళ్ల నిర్వాహకులకు అవగాహన కల్పిస్తున్న ఈవోపీఆర్డీ భార్గవి

సీతారామపురం, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): స్వచ్ఛాంధ్ర- స్వర్ణాంధ్ర కార్యక్రమంలో భాగంగా గ్రామ పంచాయతీలో ఈవోపీఆర్డీ భార్గవి ఆధ్వర్యంలో మంగళవారం ఎంపీడీవో కార్యాలయం వద్ద నుంచి బస్టాండ్ సెంటర్ వరకు ప్లకార్డులతో ర్యాలీ నిర్వహించారు. అక్కడ ప్రతి షాపు వారికి కరపత్రాలు పంపిణీ చేసి కార్యక్రమంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ హోటల్స్, కూల్‌డ్రింక్స్ షాపుల వారు ప్లాస్టిక్ ప్లేట్లు, గ్లాసలను రోడ్లపై వేస్తే వారి లైసెన్స్ రద్దు చేస్తామన్నారు. కార్యక్రమంలో కార్యదర్శులు రాంనాథరెడ్డి , షఫీ, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల్లో 'పొలం పిలుస్తోంది'


మొక్కజొన్నను పరిశీలిస్తున్న మండల వ్యవసాయాధికారి చెన్నారెడ్డి

సీతారామపురం,మార్చి 11 (ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలోని బాలాయపల్లి, అయ్యవారిపల్లి గ్రామాల్లో మండల వ్యవసాయాధికారి పీ. చెన్నారెడ్డి అధ్యక్షతన మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. సాగులో ఉన్న మొక్కజొన్నను పరిశీ లించారు. పైరులో పేనుబంక, పొగాకులద్దెపురుగు ఉన్నట్లు గుర్తించి, నివారణ చర్యలు సూచించారు.అయ్యవారిపల్లి గ్రామసభలో ఆయన మాట్లాడుతూ ధాన్యం మద్దతు ధర, తేమశాతం గురించి రైతులకు వివరించారు. కార్యక్రమంలో వీఏఏలు స్వప్న,నరేంద్ర, శ్వేత, తదితరులు పాల్గొన్నారు.

C.R.I.M.E N.E.W.S

కౌలు రైతు ఆత్మహత్యాయత్నం


పొలంలో పురుగు మందు తాగిన ప్రసాద్‌రెడ్డిని వైద్యశాలకు తరలిస్తున్న స్థానికులు, రైతులు

కావలి రూరల్, మార్చి 11(ఆంధ్రజ్యోతి): పొలం విషయమై తలెత్తిన వివాదంతో తీవ్ర మనస్తాపానికి గురైన ఓ కౌలు రైతు పురుగు మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. కావలి మండలం తాళ్లపాళెంలో మంగళవారం ఈ ఘటన చోటు చేసుకుంది. స్థానికుల వివరాల మేరకు... తాళ్లపాళెంకు చెందిన ప్రసాద్‌రెడ్డి తన బావ చలంచర్ల విజయ్‌కుమార్ రెడ్డికి చెందిన 10 ఎకరాల పొలాన్ని కౌలుకు తీసుకుని వరి సాగు చేశాడు. అదే పొలం విషయమై గత 15 సంవత్సరాలుగా గ్రామానికి చెందిన వైసీపీ నాయకుడు పుచ్చలపల్లి సుధీర్‌రెడ్డి కుటుంబ సభ్యులకు, విజయ్‌కుమార్ రెడ్డికి మధ్య వివాదం జరుగుతోంది. ఇరువర్గాలు న్యాయస్థానాన్ని కూడా ఆశ్రయించి ఉన్నారు. ఈ క్రమంలో కౌలు రైతు ప్రసాద్ రెడ్డి యంత్రం ద్వారా వరి పైరు కోయిస్తుండగా సుధీర్ రెడ్డి కుమారుడు అభిషేక్ రెడ్డి, వారి కుటుంబ సభ్యులు అడ్డుకుని వివాదానికి దిగారు. దీంతో మనస్తాపానికి గురైన ప్రసాద్ రెడ్డి పురుగులమందుతాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. అక్కడే ఉన్న సహచర రైతులు, కుటుంబ సభ్యులు 108కు సమాచారం అందించడంతో అంబులెన్స్‌లో ఆయన్ను కావలి ఏరియా వైద్యశాలకు తరలించారు. ఆ తర్వాత మెరుగైన వైద్యం కోసం పట్టణంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తీసుకెళ్లారు. ఈ ఘటనపై విచారిస్తున్నట్లు కావలి రూరల్ పోలీసులు తెలిపారు.

వృద్ధుడి అదృశ్యంపై ఫిర్యాదు

నెల్లూరు(క్రైం), మార్చి 11 (ఆంధ్రజ్యోతి): ఓ వృద్ధుడి అదృశ్యంపై చిన్నబజారు పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసుల సమాచారం మేరకు... నెల్లూరులోని తిప్పరాజువారి వీధిలో అశోక్ కుటుంబం నివసిస్తోంది. ఆయన తండ్రి జయంత్‌లాల్ తరచూ ఇంటి నుంచి వెళ్లిపోయి కొద్ది రోజుల తర్వాత తిరిగి వచ్చేవారు. అలాగే ఈ నెల 8న బయటకు వెళ్లి తిరిగి రాలేదు. దీంతో అశోక్ సోమవారం రాత్రి చిన్నబజారు పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు వృద్ధుడి ఆచూకీ కోసం గాలిస్తున్నారు.

భార్యను వేధిస్తున్న భర్తపై కేసు

నెల్లూరు(క్రైం), మార్చి 11 (ఆంధ్రజ్యోతి): వివాహితను వేధింపులకు గురిచేస్తున్న భర్త, అత్తింటి వారిపై చిన్నబజారు పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసుల సమాచారం మేరకు.. నెల్లూరులోని గాంధీనగర్‌కు చెందిన సుమయకు ఖుద్దూస్‌నగర్‌కు చెందిన రసూల్‌తో రెండున్నరేళ్ల కిందట వివాహం జరిగింది. వారికి ఒక కుమారుడున్నాడు. కొద్ది రోజులు వారి కాపురం సంతోషంగా సాగింది. రసూల్ పని చేయడం మానేసి భార్యను పుట్టింటి నుంచి డబ్బు తీసుకురావాలని వేధించడం ప్రారంభించాడు. ఆ వేధింపులు తాళలేక సుమయ ఆత్మహత్యకు యత్నించింది. దిశా పోలీసులకు ఫిర్యాదు చేయగా వారు కౌన్సెలింగ్ నిర్వహించినా భర్తలో మార్పు రాలేదు. ఈ నేపథ్యంలో ఆమె ఈ నెల 6న పుట్టింటికి వెళ్లిపోయింది. మంగళవారం పోలీసులకు ఫిర్యాదు చేయగా వారు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

పామూరుపల్లి ఆలయంలో చోరీ

వరికుంటపాడు (ఉదయగిరి రూరల్), మార్చి 11(ఆంధ్రజ్యోతి): మండలంలోని పామూరుపల్లిలో ఉన్న సుబ్బరాయుడు ఆలయంలో చోరీ జరిగినట్లు మంగళవారం గ్రామస్థులు గుర్తించారు. ఆలయ అర్చకులు సోమవారం సాయంత్రం రోజులాగే పూజలు నిర్వహించి తాళాలు వేసుకొని వెళ్లారు. మంగళవారం ఉదయం అటుగా వెళ్లిన స్థానికులు ప్రధానగేటు తాళాలు పగలగొట్టి ఉండడాన్ని గమనించి లోపలికి వెళ్లారు. వరండాలోని హుండీని పగలగొట్టి నగదు దోచుకెళ్లినట్లు గుర్తించారు. ఈ విషయమై పోలీసులకు ఎలాంటి ఫిర్యాదు అందలేదు.


ధ్వంసం చేసిన హుండీ

వీవోఏ అక్రమ వసూళ్లపై విచారణ

● ప్రక్రియ కొనసాగుతుండగా రాజీనామా

సంగం, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): స్థానిక వెలుగు కార్యాలయంలో వీవో ఏగా పనిచేస్తున్న మహిళ పట్టణంలోని పొదుపు సంఘాల నుంచి అక్రమ వసూళ్లకు పాల్పడ్డారని వచ్చిన ఆరోపణలపై డీఆర్‌డీఏ డీపీఎం కామాక్షి మంగళవారం బహిరంగం విచారణ చేపట్టారు. ఇటీవల సంగం చెక్‌పోస్టు కాలనీకి చెందిన ఓ పొదుపు సంఘం సభ్యులు వీవోఏ అక్రమ వసూలు చేస్తున్నారని, ఇవ్వకపోతే సంఘానికి బ్యాంకు రుణం ఇప్పించనని బెదిరిస్తున్నారని కలెక్టరేట్ గ్రీవెన్స్‌లో ఫిర్యాదు చేశారు. దీంతో కలెక్టర్ విచారణకు ఆదేశించారు. విచారణ అధికారి డీఆర్‌డీఏ డీపీఎం తొలుత వెలుగు ఏపీఎంను, సిబ్బందిని అడిగి వివరాలు సేకరించారు. అనంతరం పొదుపు సంఘాల లీడర్లతో సమావేశం నిర్వహించి బహిరంగం విచారణ జరిపారు. ఈ క్రమంలో ఫిర్యాదుదారులు లీడర్లను కాదు.. గ్రూపు సభ్యుల వద్దకు వెళ్లి విచారించాలని కోరారు. విచారణాధికారి అందుకు సిద్ధం కాగా, ఈలోపు అక్కడే ఉన్న వీవోఏ రాజీనామా చేశారు. దీంతో విచారణ ముగించారు. ఏపీఎం రవిశంకర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.


ఏపీఎంను అడిగి వివరాలు తెలుసుకుంటున్న డీపీఎం కామాక్షి

సీఎంఆర్ అయినా.. పుట్టికి 950 కేజీలు ఇవ్వాల్సిందే!

● రైతులకు తెగేసి చెబుతున్న మిల్లర్లు
● గట్టిగా మాట్లాడితే బీజీ అయిపోయిందని బుకాయింపు
● ధాన్యం విక్రయాల కోసం అన్నదాతల అవస్థలు

బుచ్చిరెడ్డిపాళెం, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): 'సీఎంఆర్ అయినా సరే పుట్టికి 950 కేజీల ధాన్యం ఇస్తేనే మద్దతు ధర రూ.19,720తో కొనుగోలు చేస్తాం. లేకుంటే లేదు.' ఇలా మిల్లర్లు రైతులకు తెగేసి చెబుతున్నారు. ట్రక్కు షీట్లు, హమాలీ, రవాణా చార్జీలు ఇన్ని ఇచ్చి కూడా అదనంగా ధాన్యం ఎందుకివ్వాలని రైతులు ప్రశ్నిస్తే తమకు బ్యాంకు గ్యారెంటీ అయిపోయిందనీ, వచ్చిన తరువాత రండి చూస్తామంటూ నిర్లక్ష్యంగా సమాధానం ఇస్తున్నారు. దీంతో దిక్కుతోచని రైతులు తహసీల్దారు, కోఆపరేటివ్ సొసైటీ, సివిల్ సప్లయిస్ అధికారులను ఆశ్రయిస్తున్నారు. అధికారులు అడిగినా మిల్లర్లు అలాంటి సమాధానాలే ఇస్తున్నారు. ఈ పరిస్థితి బుచ్చి మండలంలోని మినగల్లుకు చెందిన కే.సురేష్‌రెడ్డి అనే రైతుకు ఎదురైంది. అప్పటికే ఆయనకు చెందిన 30 ఎకరాల భూమిలో వరికోతకు ధాన్యం కొనుగోలు కేంద్రం నుంచి షెడ్యూలు కూడా ఇచ్చివుంది. చివరకు తన సమస్యను తహీల్దారు వెంకటేశ్వర్లుకు తెలియడంతో ఆయన నెల్లూరులోని ఓ మిల్లరుకు సిఫారసు చేశారు. దీంతో మంగళవారం మధ్యాహ్నం నుంచి రైతు సురేష్‌రెడ్డి వరికోత ప్రారంభించాడు.

కుటుంబాలకు పింఛనే ఆదరువు

- వృద్ధులు, వితంతు, దివ్యాంగులకు ఆ నగదే ఆధారం
- మండలంలో 7,512 మందికి లబ్ధి

అల్లూరు, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): పింఛన్ నగదు నిరుపేద కుటుంబాల్లో వెలుగులు నింపుతోంది. సామాన్యంగా వృద్ధులు, వికలాంగులు ఎవరినైనా రూ.100అప్పు అడిగినా వారివైపు నిర్లక్ష్యంగా చూస్తారు. ఇలాంటి పరిస్థితుల్లో ఉన్న వారికి పింఛన్ ద్వారా ప్రతినెలా రూ.4వేలు ఇస్తూ వారిలో ఆత్మస్థైర్యంను నింపుతుంది. ఒకరిని అడిగే అవసరం లేకుండా తమ ఖర్చులకు చంద్రబాబు, పవన్‌కల్యాణ్‌లు ఇస్తున్నాడంటూ వారు ధీమాను వ్యక్తం చేస్తున్నారు. మండ లంలో మొత్తం పింఛన్లు 7,512 పింఛన్లు ఉన్నాయి. వీరికి ప్రతినెలా రూ.3,04,47,500కోట్లు పింపిణీ చేస్తున్నారు. ఇంతటి బృహత్తర పథకాన్ని ప్రవేశపెట్టి వృద్ధులు, వికలాంగులు, వితంతువులు, చేనేత కార్మికులు, కల్లుగీత కార్మికులకు భరోసాను కల్పిస్తున్న కూటమి ప్రభుత్వానికి ప్రశంసల జల్లులు కురిపిస్తున్నారు లబ్ధిదారులు.

● కూటమి ప్రభుత్వ హయాంలోనే పెంపు..

గతంలో టీడీపీ ప్రభుత్వం ఉన్నప్పుడే రూ1000 ఉన్న పింఛను ఒక్కసారిగా రూ.2 వేలు పెరిగింది. తిరిగి కూటమి అధికారం చేపట్టిన వెంటనే గేతేడాది ఏప్రిల్ నుంచి ఒక్కసారిగా రూ4వేలు పెంచుతూ పంపిణీ చేపట్టడంతో వారి ఆనందానికి అవధులు లేకుండా పోయాయి.


పింఛను పంపిణీ చేస్తున్న సచివాలయ సిబ్బంది(ఫైల్)

పేదలకు అండగా..



గతంలో టీడీపీ ప్రభుత్వం లోనే పింఛన్ రూ1000 పెంచారు. మరలా 2019లోనే రూ.2 వేలుకు పెంచారు. మరలా 2024లో కూటమి ప్రభుత్వం ఆధ్వర్యంలో రూ.4 వేలు పెంపి పేదలకు అండగా నిలిచింది. ఏవిధంగా చూసినా టీడీపీ హయాంలోనే పింఛన్లు భారీస్థాయిలో పెంచి వృద్ధులు, వికలాంగులు, వితంతువుల జీవితాలకు భరోసాను కల్పించింది.

- అరగల రమణయ్య, సింగపేట, అల్లూరు మండలం

● రూ.4వేలతోనే కుటుంబపోషణ



15 ఏళ్ల క్రితమే భర్త విడిపోయా. అప్పటి నుంచి తల్లితో కలిసి జీవిస్తున్నా. రూ.4వేల పిం ఛన్‌తోనే తల్లిని పోషిస్తున్నా. ఆదరువు చూపిస్తున్న ప్రభుత్వానికి కృతజ్ఞతలు.

- షేక్ ఆబిద, గాంధీ కాలనీ, అల్లూరు

పేదల సమస్యలు తెలుసు



కూటమి ప్రభుత్వంలోని పెద్దలకు పేదల సమస్యలు బాగా తెలుసు. అందుకే పేదలు పడుతున్న కష్టాలను కొంత మేర తీర్చాలనే సదుద్దేశంతో పింఛన్‌ను రూ.4వేలు పెంచారు. ప్రతినెలా ఒకటో తేదీ నిఖచ్చిగా ఇస్తున్నారు.

- షేక్ నజీర్ బాషా, మైనార్టీ నాయకుడు, అల్లూరు

న్యూస్ బాక్స్

ఈవో వైఖరిపై ఉభయకర్తల అసంతృప్తి

బిట్రగుంట, మార్చి 11 (ఆంధ్రజ్యోతి) : కొండబిట్రగుంటలోని ప్రసన్న వేంకటేశ్వర స్వామి ఆలయ ఈవో రాధాకృష్ణతీరుపై ఉభయకర్తలు అసంతృప్తి వ్యక్తం చేశారు. సోమవారం రాత్రి జరిగిన ధ్వజారోహణం, శేష వాహన సేవ ఉభయకర్తలకు ఎటువంటి సమాచారం ఇవ్వకుండా తమ ఉభయంలో మరొకరిని చేర్చడంపై ఆవేదన చెందారు. ఉభయకర్తలు పుట్టంరెడ్డి క్రిష్టారెడ్డి, పుట్టంరెడ్డి రామచంద్రారెడ్డి మాట్లాడుతూ తాము 1960 నుంచి తాము ఉభయకర్తలుగా వ్యవహరిస్తున్నామని, అయితే, తమను అవమానించే విధంగా ఉభయానికి మరొకరి పేర్లను చేర్చినట్లు తెలిపారు. ఈ విషయాన్ని దేవదాయశాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి దృష్టికి తీసుకెళ్లినట్లు చెప్పారు.

కొనుగోలు కేంద్రాలను వినియోగించుకోండి


రైతులకు అవగాహన కలిగిస్తున్న వ్యవసాయాధికారి

కలిగిరి, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): వరి సాగుచేసిన రైతులు రైతుసేవా కేంద్రాల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని వ్యవసాయాధికారి ఎం.సురేష్‌బాబు తెలిపారు. మంగళవారం చినఅన్నలూరు, తెల్లపాడు, గంగిరెడ్డిపాలెం, రైతుసేవాకేంద్రాల్లోని రైతులకు ఈ విషయమై అవగాహన కల్పించారు.వరిసాగుచేసి ఈ-క్రాప్‌లో పంట నమోదు చేసుకొని, ఈకేవైసీ పూర్తి చేసుకున్న రైతులు రైతుసేవా కేంద్రాల్లోని సిబ్బందిని సంప్రదించాలని కోరారు. ధాన్యం అమ్మిన 24 గంటల్లో రైతు ఖాతాల్లో ధాన్యం సొమ్మును జమ అవుతుందన్నారు. కార్యక్రమంలో వీఏఏ, వీహెచ్‌లు ప్రసాద్, రమేష్, మానస, రైతులు పాల్గొన్నారు.

తలసేమియా వ్యాధిపై అవగాహన



రక్తగ్రూప్ పరీక్షలను నిర్వహిస్తున్న రెడ్‌క్రాస్ మెడికల్ సిబ్బంది

కావలి, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): రెడ్‌క్రాస్ వైద్యాధికారి రమ్య స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో రెడ్‌క్రాస్ ఆధ్వ ర్యంలో మంగళవారం విద్యార్థులకు ఉచిత రక్తగ్రూపు నిర్ధారణ పరీక్షలు, తలసేమియా వ్యాధిపై నిర్వహించిన అవగాహన సదస్సులో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. విద్యార్థుల్లో రక్తలేమి లక్షణాలు కనిపిస్తే ఉపాధ్యాయులు తమకు సమాచారం ఇవ్వాలని వారికి ఉచిత వైద్యపరీక్షలు నిర్వహిస్తామన్నారు. తలసేమియా, హీమోఫిలియా వ్యాధి ఉన్నవారిని గుర్తించి ఉచితంగా చికిత్స అందిస్తామన్నారు. అనంతరం 140మందికి రక్తగ్రూప్ పరీక్షలు నిర్వహించి గుర్తింపు కార్డులను అందజేశారు. కార్యక్రమంలో తలసేమియా డేకేర్ సెంటర్ కన్వీనర్ హరినారపరెడ్డి, జేవీవీ కార్యదర్శి హరినాథ్, జిల్లా పరిషత్ ఉన్నతపాఠశాల ప్రధానోపాధ్యాయురాలు నీరజ, ఆరోగ్య కార్యకర్తలు, రెడ్‌క్రాస్ సిబ్బంది పాల్గొన్నారు.

చలో పిఠాపురం వాల్‌పోస్టర్ల ఆవిష్కరణ


వాల్‌పోస్టర్లను ఆవిష్కరిస్తున్న సిద్దు తదితరులు

కావలి టౌన్, మార్చి11 (ఆంధ్రజ్యోతి): జనసేన అధినేత ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ పిలుపు మేరకు చలో పిఠాపురంకు తరలిరావాలని జనసేన నియోజకవర్గ నాయకులు సిద్ధు పిలుపునిచ్చారు. మంగళవారం బ్రిడ్జి కూడలిలో సిద్దు ఆధ్వ ర్యంలో జరిగిన కార్యక్రమంలో జనసేన నాయకులు పవన్‌కల్యాణ్ అభిమాన సంఘ నాయకులతో కలిసి ఈనెల 14న పిఠాపురంలో జరగనున్న జనసేన ఆవిర్భావ దినోత్సవ కార్యక్రమానికి సంబంధించిన వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించి మాట్లాడారు. ఆవిర్భావ దినోత్సవంను తొలిసారి అధికార భాగస్వామ్యంతో పండగ వాతావరణంలో ప్రతిష్ఠాత్మకంగా వేడుకలు జరుగుతాయన్నారు. ఈ నెల 13న రాత్రి 8-30గంటలకు బ్రిడ్జి సెంటర్‌లో ఉచిత బస్సు, భోజన సౌకర్యం కల్పించినట్లు తెలిపారు. కార్యక్రమంలో రూరల్ పార్టీ మండల అధ్యక్షుడు తిరుపతిస్వామి, బోగోలు మండల ప్రధాన కార్యదర్శి చంటి, చేవూరు నాయబ్, మనోజ్, హరీష్, ప్రవీణ్, సాయి తదితరులు పాల్గొన్నారు.

ఇలా అయితే పనులకు రాలేం!

- ఆరువారాలుగా అందని ఉపాధి వేతనాలు ● ఆవేదనలో కూలీలు

వలేటివారిపాలెం, మార్చి 11(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఉపాధిహామీ పథకం పనులకు వెళ్తున్న కూలీలకు ఆరు వారాల నుంచి వేతనాలు అందడం లేదు. వీటికోసం కూలీలు ఎదురు చూస్తున్నారు. 21గ్రామ పంచాయతీల్లో సుమారు 2,500 మంది కి పైగానే కూలీలు పనులకు వెళ్తున్నారు. ఏరోజు కా రోజు పనికి వెళ్తే కానీ పూట గడవని కూలీలకు 6-7వారాల నుంచి వేతనాలు రాకపోవడంతో ఆర్థిక ఇబ్బందులు పడుతున్నారు. చిల్లర దుకాణాల్లో అప్పులకు సరుకులు తెచ్చుకొని కుటుంబాలను నెట్టుకొస్తున్నారు. ఇన్ని వారాల నుంచి కూలీ డబ్బు లు ఇవ్వకపోతే మాకు పూట గడిచేది ఎలా అని ప్రశ్నిస్తున్నారు. ఇలా అయితే మేము పనుల కు రాలేమని వ్యవసాయ పనులకు వెళ్తామని చెబు తున్నారు. ఉపాధి కూలీ డబ్బులు పడ్డాయా లేదా అని కూలీలు ప్రతిరోజూ బ్యాంకుల చుట్టూ తిరుగుతున్నారు. సంబంధిత అధికారులు స్పందించి వేత నాలను విడుదల చేయాలని కోరుతున్నారు.

ఎదురుచూస్తున్నాం..



ఉపాధి కూలీ డబ్బులు ఎప్పుడు వస్తాయా అని ఎదురు చూస్తున్నాం. ప్రతిరోజూ ఉపాధి కూలీ డబ్బులు కోసం బ్యాంకు చుట్టూ తిరుగుతున్నాం. ఇప్పటికైనా అధికారులు స్పందించి వేతనాలు చెల్లించేలా చర్యలు తీసుకోవాలి.

- సంపతి తిరుపతయ్య, ఉప్పలపాడు

పూట గడవటం లేదు



ఆరువారాల నుంచి ఉపాధి పనులకు వెళ్తున్నా. ఇప్పటి వరకూ పైసా కూడా కూలీ డబ్బులు చెల్లించలేదు. ఇలా అయితే మాకు పూట గడవడం కష్టంగా ఉంది. సరుకుల కోసం చిల్లర దుకాణంలో అప్పులు తెచ్చుకొని పూట గడుపుకుంటున్నాం.

- పమిడి కేశవులు ఉప్పలపాడు


ఉప్పలపాడులో ఉపాధి పనులు చేస్తున్న కూలీలు

రాయితీలను సద్వినియోగం చేసుకోండి

- దినేష్‌కుమార్, ఏఈ కలిగిరి



కలిగిరి, మార్చి 11 (ఆంధ్రజ్యోతి):విద్యుత్ వినియోగదారులకు ఈ నెల 1వ తేదీ నుంచి 31వ తేదీ వరకు అడిషనల్ లోడ్‌పై 50శాతం, పీఎం సూర్యఘర్ పథకానికి రూ.78వేల వరకు ప్రభుత్వం రాయితీ ఇస్తుందని వీటిని సద్వినియోగం చేసుకోవాలని ట్రాన్స్ కో ఏఈ దినేష్‌కుమార్ తెలిపారు.

ఈరోజు

? ప్రభుత్వం విద్యుత్ రాయితీలను అందిస్తుందా.

! గృహ అవసరాల వినియోగదారులకు 1కిలో వాట్ అడిషనల్‌లోడ్‌పై 50శాతం అంటే రూ.1000, పీఎం సూర్యఘర్ పథకానికి 3కిలోవాట్లకు రూ.78 వేల వరకు రాయితీ వస్తుంది.

? సూర్యఘర్ పథకానికి ఎన్ని దరఖాస్తులు అందాయి.

! మండలలో ఈ పథకానికి 59మంది దరఖాస్తు చేసుకున్నారు. ఇప్పటివరకు 18 మందికి కనెక్షన్లు ఇచ్చాం.

? ఎస్సీ, ఎస్టీ కాలనీల్లో ఈ పథకం అమలు అవుతుందా.

! ఎస్సీ, ఎస్టీ కాలనీల్లో లబ్ధిదారులకు సంబంధించిన మొబైల్ నెంబరు, ఆధార్, ఎలక్ట్రిసిటీ బిల్‌కు అనుసంధానం చేయడం, ఇంటిపైకప్పుపై సౌర ఫలకలు బిగించేందుకు వివరాలు సేకరించాం.

? స్మార్ట్ మీటర్లు బిగించడం జరుగుతుందా.

! పట్టణంలో కమర్షియల్ కింద 489కనెక్షన్లలో ఇప్పటివరకు 218 సర్వీసులకు స్మార్ట్ మీటర్లను బిగించడం పూర్తయ్యింది.

? వ్యవసాయానికి ఎన్నిగంటలు సరఫరా చేస్తున్నారు.

! వ్యసాయానికి 9గంతలు నిరంతరంగా విద్యుత్‌ను సరఫరా చేస్తున్నాం. మరమ్మతుల పనులు ఉంటే తప్ప అన్ని వేళలో సరఫరాలో ఇబ్బందులు లేకుండా చూస్తాం.

స్థానికులకు 75శాతం ఉద్యోగాలివ్వాలి

- ఎంఎస్‌ఎంఈలపై మండలిలో మాట్లాడిన ఎమ్మెల్సీ తూమాటి

కందుకూరు, మార్చి 11(ఆంధ్రజ్యోతి): సూక్ష్మ, మధ్యతరహా పరిశ్రమల అభివృద్ధి, స్థానిక యువతకు ఉపాధి కల్పనల అంశంపై ఎమ్మెల్సీ తూమాటి మాధవరావు మంగళవారం మండలిలో మాట్లాడారు. ముఖ్యంగా ఎంఎస్‌ఎంఈలో కూడా స్థానిక నిరుద్యోగ యువతీయువకులకు 75శాతం ఉద్యోగాలు ఇవ్వాలనే నిబంధనలను కఠినంగా పారిశ్రామికవేత్తలు అమలు చేసేలా చర్యలు తీసుకోవాలని ఆయన విజ్ఞప్తి చేశారు. అనేక పరిశ్రమలలో స్థానిక యువతకు ఉద్యోగాలు ఇవ్వకుండా నైపుణ్యం పేరుతో బయటి నుంచి తెచ్చుకుంటున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. రామాయపట్నం పోర్టు పనులు ఆలస్యమైతే పరిశ్రమల రాక కూడా ఆలస్యం అవటం, కొన్ని పరిశ్రమలు ఇతర ప్రాంతాలకు తరలివెళ్లటం లాంటి ప్రమాదాలు పొంచి ఉంటాయని తెలిపారు. ఈ సమస్యతో వెనుకబడిన కందుకూరు ప్రాంతానికి అన్యాయం జరుగుతుందని మాధవరావు చెప్పారు. ఈ పరిస్థితిరాకుండా రామాయపట్నం పోర్టు పనులు త్వరితగతిన పూర్తయ్యేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు.


శాసనమండలిలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ తూమాటి మాధవరావు

స్తంభించిన ట్రాఫిక్


ఉదయగిరి బ్రిడ్జిపై నిలిచిన వాహనాలు

కావలి, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఉదయగిరి ఓవర్‌బ్రిడ్జిపై మంగళవారం ఉదయం 9గంటల ప్రాంతంలో జేబీ నర్సింగ్ కళాశాలకు చెందిన బస్సు డీజిల్ ఆయిల్ అయిపోవడంతో వం తెనపై మధ్యలో నిలిచిపోయింది. అరగంట సేపు ట్రాఫిక్ స్తంభించిపోయింది. పరీక్షలకు, విద్యాలయాలకు వెళ్లే సమయం కావటంతో ట్రాఫిక్‌లో చిక్కుకున్న విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. బస్సు డ్రైవర్ ఆయిల్ అయిపోవస్తుందని చెపుతున్నా వారి యాజమాన్యం పట్టించుకోక పోవటంతో ఈ సమస్య నెలకొందని సమాచారం. ఆగిపోయిన బస్సుకు మరో డ్రైవర్ వచ్చి ఆయిల్ తెచ్చి ఇచ్చి తిరిగి దానిని అక్కడ నుంచి కదిలించారు. అనంతరం స్తంభించిన ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించేందుకు పోలీస్‌లకు సుమారు అరగంట సమయం పట్టింది. దీంతో పరీక్షలు, విద్యాలయాలకు వెళ్లే విద్యార్థులు ఊపిరి పీల్చుకున్నారు.

విద్యుత్ సమస్యలకు తక్షణ పరిష్కారం

సీజీఆర్ఎఫ్ చైర్మన్ విక్టర్ ఇమ్మానుయేల్

కందుకూరు, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ వినియోగదారుల సమస్యలను అక్కడికక్కడే పరిష్కరించటమే లక్ష్యంగా నిర్వహిస్తున్న అదాలత్‌లను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సీజీఆర్ఎఫ్ చైర్మన్ విక్టర్ ఇమ్మానుయేల్ కోరారు. స్థానిక తిరుమల ఫంక్షన్‌హాలులో మంగళవారం నిర్వహించిన విద్యుత్ వినియోగదారుల అదాలత్ నిర్వహించారు. సీజీఆర్ఎఫ్ చైర్మన్ విక్టర్ ఇమ్మానుయేల్, విద్యుత్‌శాఖ ఎస్ఈ కట్టా వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో డివిజన్ పరిధిలోని అధికారులంతా పాల్గొన్నారు. ఈ సందర్భంగా విక్టర్ ఇమ్మానుయేల్ మాట్లాడారు. డివిజన్‌లోని వివిధ మండలాల నుంచి 12మంది వినియోగదా రులు తమ సమస్యలను తెలుపగా వాటిలో 9 సమస్యలను అక్కడి కక్కడే పరిష్కరించామన్నారు. మిగిలిన మూడు సమస్యలకు లైన్‌వర్క్‌తో అనుబంధమై ఉన్నందున 15రోజుల్లో పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఈఈ మల్లెల నాగేశ్వరరావు, డీఈఈలు, ఏఈలు, సిబ్బంది పాల్గొన్నారు.


మాట్లాడుతున్న సీజీఆర్ఎఫ్ చైర్మన్ విక్టర్ ఇమ్మానుయేల్

హంస వాహనపై శ్రీవారు

కావలి టౌన్, మార్చి11 (ఆంధ్రజ్యోతి): స్థానిక కచ్చేరి మిట్టలో వెలసిన వేంకటేశ్వర స్వామి ఆలయ బ్రహ్మోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో జరుగుతున్న ఉత్సవాల్లో ప్రధాన అర్చకులు బుర్రా శేషాచార్యులు అర్చక బృందం ప్రత్యేక పూజలు చేపడుతున్నారు. అందులో భాగంగా మంగళవారం ఉదయం హోమం, స్నపన ప్రత్యేక పూజలు చేశారు. రాత్రి శ్రీ వారు హంస వాహనంపై విహరిస్తూ భక్తులకు దర్శనమి చ్చారు. భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. కార్యక్రమం లో ఆలయ కమిటీ పెద్దలు అన్నవరం సత్యనారాయణ, తిరివీధి బ్రహ్మయ్య, తిరివీధి ప్రసాద్, అన్నవరం హనుమకుమార్ తదితరులు పాల్గొన్నారు.


హంస వాహనంపై శ్రీవారి చిద్విలాసం

ఆకస్మిక తనిఖీ

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్


గుడ్లు తూకం వేస్తున్న ఆర్‌జేడీ జయలక్ష్మి, పీడీ సుశీలదేవి

వలేటివారిపాలెం, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఉప్పలపాడు, చుండి గ్రామాల్లోని అంగన్‌వాడీ కేంద్రాలను మంగళవారం ఆర్‌జేడీ ఎస్.జయలక్ష్మీ, పీడీ సుశీలదేవి సీడీపీఓ శర్మిష్టతో కలిసి ఆకస్మికంగా తనిఖీ చేశారు. కేంద్రాలకు చిన సైజు గుడ్లు సరఫరా అని ఆంధ్రజ్యోతిలో వచ్చిన కథనానికి వారు స్పందించారు. ఆయా అంగన్‌వాడీ కేంద్రాల్లోని రిజిస్టర్లు, గుడ్లు, బాలామృతం, స్టాక్‌ను పరిశీలించారు. గుడ్లు తూకం వేశారు. చిన్న సైజు గడ్లు సరఫరా అయితే వెంటనే తెలియజేయాలని సూచించారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ సునీత తదితరలు పాల్గొన్నారు.

యూనిక్ నెంబర్‌ను నమోదు చేసుకోవాలి


మామిడితోటలను పరిశీలిస్తున్న ఉద్యాన శాఖ అధికారి షేక్ షహీల్

కందుకూరు, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): ఇకముందు రైతులకోసం ప్రభుత్వం అమలుచేసే అన్నిరకాల పథకాలు అందాలు (అన్నదాత సుఖీభవ, పంటల బీమా, ఇన్‌పుడ్ సబ్సిడీ) తదితర పథకాలు అందాలంటే ప్రతి రైతు విధిగా రైతు విశిష్టసంఖ్య (యూనిక్ నెంబరు)ను పొంది ఉండాలని మండల వ్యవసాయాధికారి వి.రాము తెలిపారు. పొలంపిలుస్తోంది కార్యక్ర మంలో భాగంగా పలుకూరు, మహదేవపురంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మా ట్లాడారు. యూనిక్ నెంబరు లేకుంటే రైతులు తీవ్రంగా నష్టపోయే అవకాశం ఉందన్నారు. అర్హులైన ప్రతి రైతు గ్రామ సచివాలయంలో పట్టాదారు పాసుపుస్తకం, ఆధార్ కార్డు తీసుకెళ్లి నెంబరును నమోదుచేయించు కోవాలని కోరారు. అలాగే అన్ని రైతుసేవాకేంద్రాల్లో ఆయా గ్రామాలలో సాగుచేసిన పంటలు, విస్తీర్ణం వివరాలు పొందుపరిచామని ఆ జాబితాను పరిశీలించి సాగుచేసిన పంటలు నమోదు కాకుంటే సరి చేయించుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఉద్యానసహాయకులు ఐ.బ్రహ్మణి, మహదేవపు రం వ్యవసాయ సహాయకులు షేక్ నశీర్‌బాషా, పశువైద్యసహాకులు కేవీ చైతన్య, నార్నె రోశయ్య, స్వర్ణ పున్నయ్య తదితరులు పాల్గొన్నారు.


● వలేటివారిపాలెం (ఆంధ్రజ్యోతి): ప్రతి రైతుకు యూనిక్ నెంబర్‌ను నమోదు చేసుకోవాలని డివిజన్ వ్యవసాయ సహాయ సహయకురాలు పి.అనసూయ తెలిపారు. కళవళ్లలో నిర్వహించిన పొలం పిలుస్తోందిలో పాల్గొని శనగ పంటను పరిశీలించారు. కార్యక్రమంలో ఏఓ హేమంత్‌భరత్‌కుమార్ పాల్గొన్నారు.

పోట్లూరు, చెమిడిదెపాడులో..

గుడ్లూరు (ఆంధ్రజ్యోతి): మండలంలోని పోట్లూరు, చెమిడిదెపాడు మంగళవా రం నిర్వహించిన పొలం పిలుస్తోంది కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి రవికుమార్ పాల్గొన్నారు. వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చేందుకు వ్యవసాయ రంగంలో వచ్చే మార్పులు, మెళకువలు పాటించాలన్నారు. ఇలా చేస్తే అధిక దిగుబడులు పొందుతారని రైతులకు సూచించారు. తెగుళ్ల ప్రారంభదశలోనే ఉన్నపుడు తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఈ సీజన్‌కు సంబంధించి ఈ-పంట నమోదు చేయించుకున్న ప్రతి రైతు, తప్పనిసరిగా ఈకేవైసీ చేయించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో గ్రామ వ్యవసాయ సహాయకులు రఘు, శైలజ తదితరులు ఉన్నారు.

యాజమాన్య పద్ధతులు పాటించాలి

● కలిగిరి(ఆంధ్రజ్యోతి): మామిడి తోటల్లో యాజమాన్య పద్ధతులు పాటిస్తే దిగుబడులు ఉంటాయని వింజమూరు ఉద్యాన అధికారి షేక్ షహీల్ తెలిపారు. పోలంపాడులోని మామిడితోటలను ఆయన సందర్శించి తామరపురుగు నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. తోటల్లో గుబురుగా మరియు అడ్డంగా పెరిగిన కొమ్మల్ని కత్తిరించి గాలి వెలుతురు తగిలేలా చూడాలన్నారు. చెట్టు క్రింద లోతుగా దున్ని ప్రతిచెట్టుకు నాలుగుకేజీల వేపపిండి చెట్టు పాదిలో వేసుకోవడంతో పాటు నీలిరంగు జిగురు అట్టలను మొక్కకు ఒకటి చొప్పున లేదా ఎకరాకు 40వరకు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో వీఏఏ కొండలరావు, రైతులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఏవో రవికుమార్

'పది' పరీక్ష కేంద్రాల్లో మాస్ కాపీయింగ్ ఆగేనా?

- లింగసముద్రం, పెదపవనిలో కేంద్రం ప్రారంభం నుంచి ఇదే తంతు
- సహకరిస్తున్న చీఫ్‌లు, ఇన్విజిలేటర్లు ● ఆందోళనలో ప్రతిభా విద్యార్థులు

లింగసముద్రం, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): మండలకేంద్రంలోని కేఆర్ జడ్పీ హైస్కూల్‌లో 2007 నుంచి ప్రభుత్వం 10వ తరగతి పరీక్షా కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. కేంద్రం ఏర్పాటు చేసిన మొదట్లోనే 10వ తరగతి విద్యార్థులు వంద శాతం ఉత్తీర్ణత సాధించారు. అప్పుడు మొదలైన ఈ మాస్ కాపీయింగ్ గత ఏడాది వరకు నిరాటంకంగా కొనసాగింది. అప్పటి నుండి ఈ హైస్కూల్‌లో 10వ తరగతి విద్యార్థుల ఉత్తీర్ణత శాతం 95శాతం నుండి 100శా తం వరకు ఉంటోంది. అలాగే పెదపవనిలో కూడా ఏడేళ్ల కిందట పరీక్షా కేంద్రం ఏర్పాటు చేశారు. ఈ హైస్కూళ్లలో విద్యార్థులు ఫెయిల్ అయ్యారంటే ప్రతి ఒక్కరికీ ఆశ్చర్యం కలుగుతుంది. పాసైన విద్యార్థులు ట్రిపుల్ ఐటీ, పాలిటెక్నిక్, ఇంటర్ ఎంపీసీ, బైపీసీ సీట్లు సాధించి నా వారిలో ఎక్కువశాతం సబ్జెక్టులు అర్థంకాక వెనక్కు వచ్చిన సందర్భాలు ఉన్నాయి. మాస్ కాపీయింగ్‌కు ప్రధాన కారణం ఆయా కేంద్రాలకు వచ్చే చీఫ్ సూపరింటెండెంట్లు, డిపార్ట్‌మెంట్ అధికారులు, కొందరు ఇన్విజిలేటర్లు, ఎంఆర్సీలోని ఒకరిద్దరు సిబ్బంది కూడా ప్రధాన కారణం. పరీక్షా కేంద్రాల్లో తెలివైన విద్యార్థుల ఆన్సర్ షీట్లు మిగిలిన విద్యార్థులకు ఇప్పించడం, చివరి అరగంటలో ఇన్విజిలేటర్లు రాసుకోమని వదిలేయడంతో ఇలా జరుగుతోం దని ఆరోపణలున్నాయి. అలాగే విద్యార్థుల తలిదండ్రులు కూడా ఒకరకంగా ఈ విధానానికి కారణంగా చెప్పవచ్చు. దీంతో ఎలాగూ పాసవుతామనే ధీమాతో ఎక్కువ శాతం మంది విద్యార్థులు ఇళ్ల వద్ద పెద్దగా చదవడం మానేశారు.

కేంద్రంలోని పాఠశాలలివే..

● లింగసముద్రం పరీక్షా కేంద్రంలో లింగసముద్రం హైస్కూల్ విద్యార్థులు, స్థానిక ప్రైవేటు స్కూల్, ఏపీ మోడల్ స్కూల్, తిమ్మారెడ్డిపాలెం, మొగిలిచెర్ల హైస్కూల్ విద్యార్థులు పరీక్షలు రాస్తారు. పెదపవని పరీక్షా కేంద్రంలో పెదపవని హైస్కూల్ విద్యార్థులు, స్థానిక గురుకుల పాఠశాల విద్యార్థులు, స్థానిక ప్రైవేటు విద్యార్థులు పరీక్షలు రాస్తారు. ఆయా పాఠశాలల్లో విద్యార్థులు కూడా 90శాతం నుంచి 100శాతం ఫలితాలు సాధిస్తుండడం గమనార్హం. విద్యాశాఖ ఉన్నతాధికారులు స్పందించి మాస్ కాపీ యింగ్ జరగకుండా చర్యలు తీసుకోవాలని ప్రతిభ గల విద్యార్థుల తలిదండ్రులు, ప్రజలు కోరుతున్నారు.

గ్లకోమా.. చూపు కోల్పోవద్దమ్మా!



కంటి లోపల సున్నితమైన భాగాలకు అవసరమైన ఆక్సిజన్, పోషక పదార్థాలను అందించేందుకు ఆక్సిజన్ హ్యూమర్ అనే ద్రవం కంటి లోపలికి ప్రవిస్తుంది. ఇది తిరిగి కంటి వెలుపల రక్తనాళాల ద్వారా గ్రహించబడుతుంది. అయితే ఈ ప్రసరణలో తలెత్తే సమస్యల వల్ల కంటిలో ఒత్తిడి పెరుగు తుంది. ఈ ఒత్తిడిని సరైన సమయంలో గుర్తించి తగ్గించకపోతే కంటి నరాలు దెబ్బతిని చూపు తగ్గిపో తుంది. క్రమేణ పూర్తి అంధత్వం ఏర్పడుతుంది. ఇదే గ్లకోమా వ్యాధి.

నెల్లూరు (వైద్యం), మార్చి 11 (ఆంధ్రజ్యోతి) : గ్లకోమా... కళ్లలో నీటికాసుల వ్యాధి. ఇది జిల్లా ప్రజల మనుగడపై తీవ్ర ప్రభావం చూపుతోంది. ఇంద్రియాల్లో ప్రధానమైన కళ్లకు సంబంధించి నరాలను దెబ్బ తీ అంధులుగా మారుస్తోంది. జిల్లాలో 2.70 లక్షల మంది గ్లకోమా వ్యాధి గ్రస్తులు ఉన్నట్లు అంచనా. సాధారణంగా 40 ఏళ్ల పైబడ్డ వారికి వచ్చే ఈ వ్యాధి, విపరీతమైన ఒత్తిడి కారణంగా చిన్నారులను కూడా కబళిస్తుండటం ఆందోళన కలిగించే అంశం. ఈ నేపథ్యంలో ఏటా మార్చి 12వ తేదీని ప్రపంచ గ్లకోమా నివారణ దినంగా జరుపుకోవాలని ప్రపంచ ఆరోగ్య సంస్థ తీర్మానించింది. గ్లకోమా లేని సమాజం కోసం పాటు పడదాం అంటూ పిలుపునిచ్చింది.



వారోత్సవాల్లో గ్లకోమా వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యురాలు శార్వాణి

100 మందిలో 10 మందికి...

ప్రతీ 100 మందిలో 10 మంది ఈ వ్యాధికి గురయ్యే అవకాశం ఉన్నట్లు వైద్య నిపుణులు చెబుతున్నారు. అవగాహన లోపంతో వ్యాధి ఎక్కువై కంటిచూపు తగ్గినప్పుడు మాత్రమే వైద్యులను ఆశ్రయిస్తుండడంతో పూర్తిస్థాయిలో వ్యాధిని నయం చేయలేని పరిస్థితి ఏర్పడుతోంది. ఈ నేపథ్యంలో గ్లకోమా వ్యాధిపై ప్రజలకు అవగాహన కల్పించే దిశగా జిల్లా వ్యాప్తంగా విస్తృత ప్రచారం జరుగుతోంది. వారోత్సవాలు నిర్వహిస్తూ ప్రజలకు అవగాహన కల్పిస్తున్నారు. జిల్లా అంధత్వ నివారణ సంస్థ ఆధ్వర్యంలో ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు పరీక్షలు చేస్తున్నారు.

వ్యాధి లక్షణాలు

- తరచూ కన్ను ఎర్రబడటం ● చూపు మసకబారడం
- బల్బు చుట్టూ ఇంద్ర ధనస్సు వలే కాంతి వలయాలు కనిపించడం
- చీకటిలో చూపు తగ్గిపోవడం
- తలకు పక్కనున్న వ్యక్తులను, వస్తువులను గమనించలేకపోవడం
- అధిక శాతం వ్యాధిగ్రస్తుల్లో ఎటువంటి లక్షణాలు లేకుండానే కంటి నరాలు తీవ్రస్థాయిలో దెబ్బతినే వరకు చూపు సాధారణంగానే ఉంటుంది.

ఎవరికి రావచ్చు

- పసి పిల్లలు సహా ఏ వయసు వారికైనా రావచ్చు.
- 40 సంవత్సరాలు పైబడిన వారికి వచ్చే అవకాశం ఎక్కువ
- కంటి చూపు వ్యాధులు, కంటి గాయాల వల్ల కూడా రావచ్చు.
- రక్త సంబంధీకుల్లో వ్యాధిగ్రస్తులుంటే మిగిలిన వారికీ వచ్చే అవకాశం.

- జిల్లాలో విస్తరిస్తున్న నీటికాసుల వ్యాధి
- ముదిరేదాకా మేల్కొనని బాధితులు
- ఇప్పటికే 2.70 లక్షల మంది వ్యాధిగ్రస్థులు
- నిర్లక్ష్యం కారణంగా అంధులవుతున్న ఎంతోమంది
- ప్రభుత్వ ఆసుపత్రుల్లో అన్ని రకాల పరీక్షలు
- విస్తృత అవగాహన కల్పిస్తున్న అధికారులు
- నేడు ప్రపంచ గ్లకోమా నివారణ దినం

అందుబాటులో ఆధునిక వైద్యం

ఒకప్పుడు గ్లకోమాను ప్రాథమిక దశలోనే గుర్తించినా నివారించలేని పరిస్థితి. ప్రస్తుతం సెలెక్టివ్ లేజర్ ట్రాబెక్యులో ప్లాస్టీ(ఎస్ఎల్‌టీ), ఆర్గాన్ లేజర్ ట్రాబెక్యులో ప్లాస్టీ (ఏఎల్‌టీ) వంటి ఆధునిక వైద్య విధానాలు అందుబాటులోకి వచ్చాయి. వ్యాధి 70 శాతం ఉంటే 30 శాతం చూపును కాపాడగలుగుతున్నారు. కంటి లోపల నీటి ప్రవాహాన్ని సాధారణ స్థితికి తీసుకు వచ్చే చికిత్సలూ ఉన్నాయి.

విస్తృత అవగాహన కల్పిస్తున్నాం

గ్లకోమా వ్యాధిపై జిల్లా ప్రజలకు విస్తృత అవగాహన కల్పిస్తున్నాము. ఈ నెల 9 నుంచి 15 వరకు ప్రత్యేక గ్లకోమా వారోత్సవాలు జరుగుతున్నాయి. 40 ఏళ్ల పైబడ్డ వారు తప్పనిసరిగా గ్లకోమా పరీక్ష చేయించుకోవాలి. మధు మేహం, రక్తపోటు ఉన్న వారు మరింత జాగ్రత్తలు తీసుకోవాలి. చిన్నారుల్లో ఈ వ్యాధిని గుర్తించేలా ప్రభుత్వ పాఠశాలల్లోనూ ప్రత్యేక పరీక్షలు చేస్తు న్నాం. అన్ని గ్లకోమా పరీక్షలు ప్రభుత్వ ప్రధాన ఆసుపత్రిలోని కంటి విభా గంలో చేస్తున్నాం.

- డాక్టర్ శార్వాణి, జిల్లా అంధత్వ నివారణ సంస్థ ప్రాజెక్టు అధికారి



ప్రాథమిక దశలోనే గుర్తిస్తే చికిత్స

గ్లకోమా వ్యాధిని ప్రాథమిక దశలోనే గుర్తిస్తే నయం చేసే అవకాశం ఉంది. ఎన్నో ఆధునిక వైద్య విధానాలు అందుబాటులోకి వచ్చాయి. అయితే చాలా మంది గ్లకోమా గురించి అవగాహన లేక పరీక్షలు చేయించుకోవటం లేదు. దీంతో కంటి నరాలు పూర్తిగా దెబ్బతిని కంటి చూపుకోల్పోయే అవకాశం ఉంది. కుటుంబంలో ఏవరైనా గ్లకోమా వ్యాధికి గురయితే కుటుంబ సభ్యులకు కూడా ఆ వ్యాధి వచ్చే అవకాశం ఎక్కువ. ఇలాంటి వారు తప్ప నిసరిగా వైద్య పరీక్షలు చేయించుకోవాలి. ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో అన్ని రకాల వైద్య చికిత్సలు అందుబాటులో ఉన్నాయి.

- డాక్టర్ శిరీష, జీజీహెచ్ కంటి వైద్య నిపుణురాలు

ఇంటర్ పరీక్షలకు 28,323 మంది హాజరు

నెల్లూరు (విద్య), మార్చి 11 (ఆంధ్రజ్యోతి) : ఇంటర్మీడియట్ పరీక్షల్లో మంగళవారం ప్రథమ సంవత్సరం విద్యార్థులకు ఫిజిక్స్-1, ఎకనామిక్స్-1, ఒకేషనల్ పరీక్షలు జరిగాయి. జిల్లా వ్యాప్తంగా 28,323 మంది విద్యార్థులు హాజరయ్యారు. జనరల్ విభాగంలో 27,927 మందికి 27,100 మంది హాజరుకాగా 817 మంది గైర్హాజరయ్యారు. ఒకేషనల్ విభాగంలో 1387 మందికి 164 మంది గైర్హాజరు కాగా 1223 మంది హాజరయ్యారు. ఆర్ఐవో డాక్టర్ ఏ శ్రీనివాసులు 5 కేంద్రాలను పరిశీలించగా, డీవీఈవో 2, డీఈసీ 5, ఫ్లైయింగ్, సిట్టింగ్ స్క్వాడ్స్ 30 కేంద్రాలను పరిశీలించాయి.

విద్యార్థులతో వెట్టిచాకిరీపై గండిపాళెం గురుకులంలో విచారణ

ఉదయగిరి, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గండిపాళెం గురుకుల పాఠశాలలో మంగళవారం ఆత్మకూరు బాలికల గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ కామేశ్వరి, తుమ్మలపెంట గురుకుల పాఠశాల ఉపాధ్యాయిని మాధవిలత విచారణ చేపట్టారు. ఇటీవల పాఠశాలలో విద్యార్థులతో చపాతీలు చేయించిన విషయంపై ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు వారు ఈ విచారణ చేపట్టారు. ఈ సందర్భంగా వారు వంట మనుషులు, విద్యార్థులను విచారించారు. విచారణలో గుర్తించిన అంశాలను నివేదిక రూపంలో ఉన్నతాధికారులకు అందజేస్తామన్నారు. అయితే ఈ విచారణ అంతా రహస్యంగా నిర్వహించారు.

అసంపూర్తి గృహ నిర్మాణాలకు అదనపు ఆర్థిక సాయం

● కలెక్టర్ ఆనంద్

నెల్లూరు (జడ్పీ), మార్చి 11(ఆంధ్రజ్యోతి): జిల్లాలో 2019-24 సంవత్సరా ల మధ్య ఎస్సీ, ఎస్టీ, బీసీలకు మంజూరైన గృహాల నిర్మాణం అసంపూర్తిగా ఉంటే పనుల కొనసాగింపునకు ప్రభుత్వం అదనపు ఆర్థిక సాయాన్ని అందజేస్తుందని కలెక్టర్ ఆనంద్ ఓ ప్రకటనలో పేర్కొన్నారు. దీనికి సంబంధించిన జీవోను గృహనిర్మాణ శాఖ చీఫ్ సెక్రటరీ జారీ చేశార న్నారు. బీసీ, ఎస్సీలకు రూ.50వేలు, ఎస్టీలకు రూ.75వేలు అదనపు సాయం అందుతుందని వివరించారు. జిల్లాలో 75,344 మది లబ్ధిదారులు ఉన్నారని, వారికి రూ.1199.85కోట్లు నిధులు మంజూరయ్యాయని తెలిపారు. నియోజ కవర్గాల వారీగా ఆత్మకూరులో 8467 మంది, కందుకూరులో 6159, కావలి లో 10779, కోవూరులో 8696, నెల్లూరు సిటీలో 6690, రూరల్‌లో 8400, సర్వేపల్లిలో 19267, ఉదయగిరిలో 6886 మంది లబ్ధిదారులకు అదనపు సాయం లభిస్తుందని, దీనిని వారు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

రెవెన్యూ వసూళ్లపై దృష్టి పెట్టండి

● విద్యుత్‌శాఖ ఎస్ఈ విజయన్

నెల్లూరు (జడ్పీ), మార్చి 11 (ఆంధ్రజ్యోతి): రెవెన్యూ వసూళ్లను మరింత వేగవంతం చేయాలని అధికారులను విద్యుత్ శాఖ ఎస్ఈ విజయన్ ఆదేశించారు. ఆయన చాంబర్ నుంచి జిల్లాలోని అధికారులతో మంగళవారం టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించారు. 2024-25 ఆర్థిక సంవత్సరం ముగుస్తున్నందున అధికారులంతా రెవెన్యూ వసూళ్లపై దృష్టి పెట్టి వంద శాతం పూర్తిచేయాలని సూచించారు. ఆక్వా రైతులకు ప్రభుత్వం సబ్సిడీ ఇస్తున్నప్పటికీ ఇంకా బకాయిలు ఉంటున్నాయని, వెంటనే వాటిని వసూలు చేయాలన్నారు. ఇందులో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించా రు. గృహ వినియోగదారులు అదనపు లోడ్ ఉంటే 50 శాతం రాయితీతో క్రమబద్ధీకరించుకోవచ్చని, జూన్ 30 వరకు దరఖాస్తులు స్వీకరిస్తామని చెప్పారు. దీనిపై విస్తృతంగా ప్రచారం చేయాలని అధికారులను ఆదేశించా రు. ఈ కార్యక్రమంలో టెక్నికల్ ఈఈ శేషాద్రి బాలచంద్ర, సీనియర్ అకౌంట్స్ అధికారి పీ మురళి తదితరులు పాల్గొన్నారు.

డీఆర్డీఏ ఏపీడీగా శ్రీనివాసరావు

నెల్లూరు (హరనాథపురం), మార్చి 11 (ఆంధ్రజ్యోతి) : జిల్లా గ్రామీణ అభివృద్ధి సంస్థ అసిస్టెంట్ ప్రాజెక్టు డైరెక్టర్‌గా శ్రీనివాసరావును నియమిస్తూ సెర్ప్ సీఈవో వాకాటి కరుణ ఉత్తర్వులు జారీ చేశారు. ఆయనను బాపట్లకు డీఆర్‌డీఏ ఇన్‌చార్జి ఏపీడీగా కూడా నియమించారు. శ్రీనివాసరావు ప్రస్తుతం మైనార్టీ సంక్షేమ కార్పొరేషన్ ఈడీగా విజయవాడ ప్రధాన కార్యాలయంలో పనిచేస్తున్నారు.

వందరోజులు దాటితే.. కూలీలకు బెంగ

జిల్లాలో ఖాళీగా 5,463 కుటుంబాలు

150 రోజులకు పెంపు హామీ ఏమైంది...

ఉపాధి పనిదినాల పెంపేదీ ?



ఉదయగిరిలో ఉపాధి పనులు చేస్తున్న కూలీలు

ఉదయగిరి, మార్చి 11(ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో వలస ల నివారణతోపాటు స్థానికంగా ఉపాధి కల్పించాలనే ఉద్దేశ్యంతో ఉపాధి హామీ పథకాన్ని అమలు చేస్తున్నారు. ప్రధానంగా జిల్లాలోని మెట్టప్రాంతాలైన ఉదయగిరి, కలిగిరి, సీతారామపురం, వరికుంటపాడు, దుత్తలూరు, వింజమూరు, మర్రిపాడు, ఏఎస్‌పేట, అనంతసాగరం, పొదలకూరు, కొండాపురం తదితర మండలాల్లో అధికశాతం కూలీలకు ఈ పనులే జీవనాధారం. ఇదంతా బాగానే ఉన్నా, అమలులో సాంకేతిక కారణాలు కొన్ని కుటుంబాలకు ఉపాధిని దూరం చేస్తున్నాయి. ఎందరి పేర్లున్నా కార్డుకు వందరోజులే పని కల్పిస్తుండటం అందుకు కారణం. ఒక కార్డులో నాలుగైదు పేర్లున్నా అందరికీ కలిసి వంద రోజులే పని కల్పిస్తుండటం, వంద రోజులు త్వరితగతిన పూర్తవుతుండడంతో వారంతా పని లేక ఖాళీగా ఉండాల్సి వస్తుంది. వీరంతా ఆర్థిక సంవత్సరం ముగిసే వరకు ఉపాధి హామీ పనులకు అర్హులు కారు. పనిదినాలను కనీసం 150 రోజులకు పెంచాలని ఎప్పటి నుంచో డిమాండ్ ఉన్నా అమలుకు నోచుకోలేదు.

● 5,463 కుటుంబాలు పనికి దూరం

జిల్లాలో 3.46 లక్షల జాబ్ కార్డులు ఉండగా 5.81 లక్షల మంది కూలీలు ఉన్నారు.2.18లక్షల కుటుంబాల కుగాను 5,463 కుటుంబాలు వంద రోజులు పని పూర్తి చేసుకున్నాయి. వారంతా ఇప్పుడు పనికి దూరంగా ఉన్నారు. ప్రస్తుతం వ్యవసాయ సీజన్ ముగిసినందున గ్రామాల్లోని కూలీలు ఉపాధి పనుల వైపు చూస్తున్నారు. ఏటా వేసవిలో అమలు చేసే 20 నుంచి 30 శాతం భత్యం ఇవ్వడం ద్వారా కూలీలకు అదనపు వేతనం అందేది. అయితే గత వైసీపీ ప్రభుత్వం దాన్ని రద్దు చేసింది. ప్రస్తుతం పగటి ఉష్ణోగ్రతలు ఎక్కువగానే నమోదవుతున్నాయి. ఈ నేపథ్యంలో మండు టెండలో వేసవిభత్యం అందించాలని, నీడ, నీటి సౌకర్యం కల్పించాలని కూలీలు కోరుతున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి కూలీలకు పని దినాలు పెంచడంతోపాటు పనుల వద్ద వసతులు కల్పించాలని పలువురు కోరుతున్నారు.

17న మహా ధర్నా

ఉదయగిరి, మార్చి 11(ఆంధ్రజ్యోతి): పంచాయతీ కార్మికుల డిమాండ్లను పరిష్కరిం చాలని కోరుతూ ఏపీ పంచాయతీ ఎంప్లా యిస్, వర్కర్స్ యూనియన్ (సీఐటీయూ) ఆధ్వర్యంలో ఈ నెల 17న విజయవాడ ధర్నాచౌక్‌లో మహాధర్నా నిర్వ హించనున్నట్లు యూనియన్ జిల్లా అధ్యక్షుడు, గౌరవాధ్యక్షుడు గడ్డం నాగేశ్వరరావు, కేసీ పెంచలయ్య మంగళవారం ఓ ప్రకట నలో పేర్కొన్నారు. తమ సమస్యలు పరిష్కరించా లని 30 ఏళ్లగా పోరాడుతున్నామన్నారు. ప్రభుత్వం పట్టిం చుకోకపోవడంతో మహాధర్నాకు పిలు పునిచ్చామని తెలి పారు. ధర్నాలో పంచాయతీ కార్మికులు అధికసంఖ్యలో పాల్గొనాలని వారు తెలిపారు.

15న జనార్దనస్వామి మండలాభిషేకం

దుత్తలూరు (ఉదయగిరి), ఆంధ్రజ్యోతి): మండలంలోని నర్రవాడలో గల శ్రీజనార్దనస్వామి మండలాభిషేకం ఈనెల 15న నిర్వహించను న్నట్లు ఆలయ చైర్మన్ మాదాల ఎస్.బాబురావు మంగళవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఆ రోజు ఉదయం స్వామివారికి విశ్వక్సేన పూజ, పుణ్యాహవచనం, నవకల ఆరాధన, అభిషేకం, స్వామి, అమ్మవార్ల మూల మంత్ర వేదహవన హోమం, పూర్ణాహుతి నివేదిన కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు.

సోమశిలలో 56.230 టీఎంసీల నీరు

అనంతసాగరం, మార్చి11 (ఆంధ్రజ్యోతి): సోమశిల జలాశయం పూర్తి సామర్థ్యం 97.988 టీఎంసీలు కాగా, మంగళవారం నాటికి 56.230 టీఎంసీల నీరు నిల్వ ఉంది. డెల్టాకు 1,150, ఉత్తర కాలువకు 550, దక్షిణ కాలువకు 350, కండలేరుకు 200 క్యూసెక్కుల నీటిని సరఫరా చేస్తున్నారు.

బీఈడీ పరీక్షలకు 86 మంది గైర్హాజరు

వెంకటాచలం, మార్చి 11(ఆంధ్రజ్యోతి) : విక్రమ సింహపురి యూనివర్సిటీ పరిధిలోని అనుబంధ కళాశాలల్లో మంగళవారం జరిగిన బీఈడీ మొదటి సెమిస్టర్ పరీక్షలకు 86 మంది విద్యార్థులు గైర్హాజరైనట్లు వర్సిటీ పరీక్షల నిర్వాహణాధికారి డాక్టర్ ఆర్ మధుమతి ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం జరిగిన పరీక్షలకు 1212 మంది విద్యార్థులకు గాను 1126 మంది హాజరయ్యారని ఆమె తెలిపారు.

డిగ్రీ పరీక్షల్లో నలుగురి డీబార్

వెంకటాచలం, మార్చి 11(ఆంధ్రజ్యోతి) : విక్రమ సింహపురి యూనివర్సిటీ పరిధిలోని అనుబంధ కళాశాలలో మంగళవారం మధ్యాహ్నం జరిగిన డిగ్రీ 4వ సెమిస్టర్ రెగ్యులర్ పరీక్షల్లో నలుగురు విద్యార్థులు డీబార్ అయినట్లు వర్సిటీ పరీక్షల నిర్వాహణాధికారి డాక్టర్ ఆర్ మధుమతి ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం జరిగిన డిగ్రీ 6వ సెమిస్టర్ సప్లిమెంటరీ పరీక్షలకు 70 మంది విద్యార్థులకు 57 మంది హాజరు కాగా 13 మంది గైర్హాజర య్యారని తెలిపారు. మధ్యాహ్నం జరిగిన డిగ్రీ 4వ సెమిస్టర్ రెగ్యులర్ పరీక్షలకు 7404 మంది విద్యార్థులకు 6972 మంది హాజరు కాగా 432 మంది గైర్హాజరయ్యారు. కాగా మధ్యాహ్నం జరిగిన పరీక్షలలో సూళ్లూరుపేటలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఒకరు, వెంకటగిరిలోని విశ్వోదయ డిగ్రీ కళాశాలలో ఇద్దరు, నెల్లూరులోని జెనెక్స్ విజన్ డిగ్రీ కళాశాలలో ఒకరు మాస్ కాపీయింగ్‌కు పాల్పడుతూ డీబార్ అయినట్లు తెలిపారు.

ఇక 3 రోజులే గడువు..
సర్వే పూర్తయ్యింది 83 శాతం

- మిగిలిన లక్ష్యం పూర్తికి కసరత్తు
- 15తో ముగియనున్న ఎంఎస్ఎంఈల సర్వే
- సర్వే, సపోర్టు యాప్‌లోకి సమాచారం

నెల్లూరు (వెంకటేశ్వరపురం), మార్చి 11 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో ఎంఎస్ఎంఈ (సూక్ష్మ, చిన్న, మధ్య తరహా ఎంటర్‌ప్రైజెస్)ల సర్వే శరవేగంగా సాగుతోంది. కూటమి ప్రభుత్వం సర్వే అండ్ సపోర్ట్ అనే యాప్‌ను ప్రత్యేకంగా రూపొందించి, దాని ద్వారా సర్వే చేపట్టింది. రాష్ట్రవ్యాప్తంగా జరిగే ఈ సర్వే ద్వారా ఎంఎస్ఎంఈల సమాచారాన్ని ఒకే పోర్టల్‌లోకి నిక్షిప్తం చేస్తున్నారు. గతేడాది నవంబరు 29 నుంచి ప్రారంభమైన ఈ సర్వే మార్చి 15కి పూర్తి చేయాలని ప్రభుత్వం గడువు పెట్టింది. ఇప్పటివరకు 83 శాతం సర్వే పూర్తవగా, గడువు నాటికి మిగిలిన 17 శాతం సర్వే పూర్తి చేయనున్నారు. గ్రామ, వార్డు సచివాలయాల ఉద్యోగులంతా ఈ సర్వేలో పాల్గొంటున్నారు. కలెక్టర్ ఆనంద్‌తోపాటు పరిశ్రమల శాఖ అధికారులు, మున్సిపల్ కమిషనర్లు, ఏపీఐఐసీ జోనల్ మేనేజర్లు, ఎంపీడీవోలు ఈ సర్వేను పర్యవేక్షిస్తున్నారు. తొలుత ఫిబ్రవరి ఒకటి వరకు నిర్వహించాలని గడువు నిర్ణయించారు. ఒకటికి పూర్తికాకపోవడంతో మార్చి 15 వరకు గడువును పొడిగించారు.

● విద్యుత్ సర్వీసుల ఆధారంగా...

జిల్లాలో ఉన్న విద్యుత్ సర్వీసుల ఆధారంగా సర్వే చేపట్టారు. జిల్లాలో మొత్తం 82,395 ఎంఎస్ఎంఈల విద్యుత్ సర్వీసులు ఉన్నాయి. ఈ నేపథ్యంలో ఇప్పటి వరకు 68,360లను సర్వే ద్వారా ప్రత్యేక యాప్‌లో నమోదు చేశారు. మిగిలిన 14,035ల సర్వే చేయాల్సి ఉంది. ఐదు రోజుల్లో ఈ సర్వే పూర్తి చేయాలని ఇప్పటికే కలెక్టర్ అధికారులను ఆదేశించారు.

● 'ర్యాంపు'తో పెరగనున్న సంఖ్య

ఇప్పటివరకు తయారీ, సేవారంగాల వరకు ఉన్న ఎంఎస్ఎంఈల పరిధి కేంద్ర ప్రభుత్వం ప్రపంచ బ్యాంకు సహకారంతో కొత్తగా తీసుకొచ్చిన ర్యాంపు (రైజింగ్ అండ్ ఎక్సాలరేటింగ్ ఆఫ్ ఎంఎస్ఎంఈ పార్ఫామెన్స్) పథకం ద్వారా వ్యాపార సంస్థలు, దుకాణాలు ఎంఎస్ఎంఈల కిందకు రానున్నాయి. దీంతో వాటి సంఖ్య జిల్లాలో భారీగా పెరగనున్నది. చిన్న బడ్డీ కొట్టు నుంచి ఉత్పత్తి చేసే పరిశ్రమల వరకు ఎంఎస్ఎంఈ కిందకు రానున్నాయి. జిల్లా పరిశ్రమలశాఖ రికార్డుల్లో ఇప్పటివరకు 18,167 ఎంఎస్ఎంఈలు మాత్రమే ఉన్నాయి. అయితే కేంద్ర ప్రభుత్వం తెచ్చిన ర్యాంపు పథకం ద్వారా వీటి సంఖ్య పెరగనున్నది. విద్యుత్ సర్వీసులు, కార్మికశాఖ ఇచ్చిన వివరాలు, జీఎస్‌టీ సంస్థ ఇచ్చిన వివరాల ద్వారా సర్వే చేశారు. వీటిన్నింటి ఆధారంగా సర్వేలో భారీగా ఎంఎస్ఎంఈల సంఖ్య పెరిగింది.

ఇప్పటి వరకు చేసిన సర్వే వివరాలు

తయారీ రంగం	: 4104
సర్వీసు యూనిట్స్	: 14,648
ట్రేడ్ యూనిట్స్	: 12,666
మూత పడినవి	: 23,352
నాన్ ఎంఎస్ఎంఈ యూనిట్లు	: 13,590
మొత్తం	: 68,360 యూనిట్స్

● ప్రయోజనాలు ఇవీ..

ఈ సర్వే ద్వారా పరిశ్రమల రిజిస్ట్రేషన్‌కు ప్రభుత్వం అనేక విధాలుగా సహాయ, సహకారాలు అందించనున్నది. ప్రధానంగా తక్కువ వడ్డీకి బ్యాంకు రుణాలు, విద్యుత్ బిల్లులో రాయితీ, పెండింగ్ బిల్లులు 45 రోజుల్లో ఇప్పించడం, ప్రభుత్వ టెండర్లలో స్థానిక పరిశ్రమలకు ప్రాధాన్యం, మార్కెట్‌లో డిమాండ్‌ను గుర్తించి, ఉత్పత్తి చేసేలా అవగాహన కల్పించ డంతో పాటు పలు అంతర్జాతీయ, జాతీయ, రాష్ట్ర ఎగ్జిబి షన్లలో పాల్గొనేం దుకు అనుమ తులు మంజూరు చేయడం.. వంటి ప్రయోజనాలు కలగనున్నాయి.



నెల్లూరు రూరల్ మండలంలో దుకాణదారుతో మాట్లాడుతున్న డిప్యూటీ సీఈవో, రూరల్ ఎంపీడీవో తదితరులు

ప్రతి ఒక్కరూ నమోదు చేసుకోవాలి

ఎంఎస్ఎంఈ సర్వేలో ప్రతి ఒక్క రూ వివరాలు నమోదు చేసుకో వాలి. కేంద్రం ర్యాంపు పథకం ద్వారా వ్యాపార దుకాణాలను సైతం ఎంఎస్ఎంఈల కిందకు తీసుకొచ్చింది. వ్యాపారులకు ఈ సర్వే ఎంతగానో ఉపయోగపడుతుంది. మార్చి 15 వరకు గడువు ఉంది. సర్వే సభ్యులకు సహకరించి, పూర్తి వివరాలు అందచేయాలి.

- మారుతీప్రసాద్, పరిశ్రమలశాఖ జీఎం

చికెన్ ధరలు

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్

	కిలో
బాయిలర్ లైవ్	97
లేయర్ లైవ్	90
స్కిన్ చికెన్	180
స్కిన్‌లెస్	200
లేయర్	153

బంగారం, వెండి ధరలు

బంగారం (22 క్యారెట్లు)

ఒక గ్రాము ధర	రూ.8285
వెండి కిలో ధర	రూ. 99,700
వెండి ఒక గ్రాము	రూ.100.70

న్యూస్ బాక్స్

ఇనుప కమ్ముల వాహనం పట్టివేత



పోలీస్‌స్టేషన్ వద్ద ఇనుప కమ్ములు తరలిస్తున్న వాహనం

తోటపల్లిగూడూరు, మార్చి 11(ఆంధ్రజ్యోతి): జగనన్న గృహాలకు సంబంధించిన ఇనుప కమ్ములను తరలిస్తున్న వాహనాన్ని మంగళవారం టీడీపీ మండల అధ్యక్షుడు సన్నారెడ్డి సురేష్‌రెడ్డి, గ్రామ నాయకులు కాకుపల్లి సెంటర్‌లో పట్టుకుని తోటపల్లి గూడూరు పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. గ్రామస్థుల కథనం మేరకు.. మండలంలోని వరకవిపూడిలో గత వైసీపీ ప్రభుత్వంలో కాకుటూరు సుమన్‌రెడ్డి 26 జగనన్న గృహాలను నిర్మించేందుకు కాంట్రాక్ట్ తీసుకున్నారు. అలాగే 17 ఇళ్లు మస్తానయ్య, 9 ఇళ్లు ఉప్పు శీనయ్యలు నిర్మించేందుకు కాంట్రాక్టు తీసుకున్నారు. అయితే బిల్లులు రాలేదన్న కారణంగా ఈ గృహాలను బేస్, లింటల్ లెవల్ వరకు మాత్రమే నిర్మించి నిర్మాణాలు నిలిపివేశారు. ఆ ఇళ్లకు ఉపయోగించాల్సిన ఇనుపకమ్ములను కాంట్రాక్టర్ శీనయ్య మినీ ఐసర్ వాహనంలో తరలిస్తుండగా కాకుపల్లి సెంటర్‌లో తెలుగుదేశం పార్టీ శ్రేణులు అడ్డుకుని పోలీస్‌స్టేషన్‌కు అప్పజెప్పారు. ఈ విషయంపై సమగ్ర విచారణ జరిపి కేసు నమోదు చేస్తామని ఎస్‌ఐ వీరేంద్రబాబు తెలిపారు.

ఆర్థిక సాయం

పొదలకూరు, మార్చి 11(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని నారాయణ స్కూల్ యాజమాన్యం ఆధ్వర్యంలో మంగళవారం స్థానిక నరసారెడ్డి కాలనీలో వెన్నెముక, న్యూరో సమస్యతో ఆరేళ్లుగా మంచానికే పరిమితమైన కూచిపాటి వరప్రసాద్ కుటుంబ సభ్యులకు ఆర్థిక సాయం చేశారు. ప్రిన్సిపాల్ ముని తులసి, ఏవో రామ్‌మోహన్‌రెడ్డి, అకౌంటెంట్ చిన్నా కలిసి విద్యార్థుల నుంచి సేకరించిన మొత్తానికి కొంత కలిపి వరప్రసాద్ భార్య రేవతికి రూ.14,500 అందజేశారు. కార్యక్రమంలో విద్యార్థులు పాల్గొన్నారు.

అంతా ఆన్‌లైన్..!

- పల్లెకు పాకిన సంస్కృతి
- అదే విధానంలో అన్నీ వస్తువుల కొనుగోళ్లు
- యువతకు పెరిగిన ఉపాధి అవకాశాలు

మనుబోలు, మార్చి 11(ఆంధ్రజ్యోతి): పట్టణాలు, పల్లెలు అన్న తేడా లేకుండా జిల్లాలో ఆన్‌లైన్ వ్యాపారం జోరుగా సాగుతోంది. చేతిలో సెల్‌ఫోన్ ఉండాలే కాని క్షణాల్లో నచ్చి, మెచ్చిన వస్తువులైన ఆహారం, కిరాణా ఇతరత్రా సామగ్రిని తెప్పించుకుంటున్నారు. ఒకప్పుడు నగరాలకే పరిమితమైన ఈ తరహా సంస్కృతి క్రమేపీ పట్టణాలకు, ఇప్పుడు గ్రామీణ ప్రాంతాలకు విస్తరించింది. ప్రజలు ఫ్రీ డెలీవరి వస్తువులనే ఇష్టపడుతున్నారు. వాటినే ఆన్‌లైన్‌లో బుక్ చేసుకుని తెప్పించుకుంటున్నారు. ఆన్‌లైన్ వ్యాపారాల పుణ్యమా అని స్థానిక వ్యాపారాలు మూతపడే స్థాయికి చేరుకుంటున్నాయి. గతంలో గ్రామీణ ప్రాంతాల్లో కిరాణా దుకాణాలకు ఎంతో ఆదరణ ఉండేది. అక్కడే అన్ని వస్తువులను విక్రయాలు చేసేవారు. ఆన్‌లైన్ లావాదేవీల పుణ్యమా అని గడిచిన ఏడాదిలో దేశంలో లక్షల కిరాణా దుకాణాలు మూతపడినట్లు ఇటీవల జాతీయ వాణిజ్య సంస్థ స్పష్టం చేసింది. మనిషి దైనందిన జీవితం బిజీగా మారింది. ప్రస్తుతం ప్రభుత్వ ఉద్యోగాలు కంటే ప్రైవేటు ఉద్యోగులే అధికంగా ఉన్నారు. ప్రైవేట్ సెక్టార్ అంటే ఉరుకులు, పరుగులు పెట్టే పరిస్థితి, పైగా ఒక ఇంట్లో భర్తతో పాటు భార్య పనిచేసే పరిస్థితులు నెలకొన్నాయి. అలాంటప్పుడు వారు ఇంటికోసం కేటాయించే సమయం చాలా తక్కువగా ఉంటుంది. ఇలాంటి వారంతా ఎక్కువగా ఆన్‌లైన్ ఆర్డర్ల వైపే మొగ్గుచూపుతున్నారు. కాగా ఆన్‌లైన్ వ్యాపారాల మూలంగానే రిటైల్ రంగంలో కిరాణా దుకాణాలతో పాటు ప్రజలకు అవసరమయ్యే వస్తువులు విక్రయించే దుకాణాల వద్ద రోజు రోజుకి కొనుగోలుదారుల సందడి తగ్గుముఖం పడుతోంది. ఇలాగే కొనసాగితే రాబోయే ఐదేళ్లలో ఆన్‌లైన్ సంస్థలు 1500 శాతం వృద్ధి సాధిస్తాయని జాతీయ వాణిజ్య సంస్థలు వెల్లడిస్తున్నాయి. అంటే దీనిని బట్టి చూస్తే ప్రతి ఏటా ఆన్‌లైన్ వ్యాపారాలు 300 శాతం వృద్ధి పెంచుకుంటూ పోతాయని అర్థమవుతోంది. దీనివలన అటు ప్రభుత్వానికి సైతం పన్నుల రూపంలో ఆదాయం పెరిగే అవకాశం ఉంది. అంతేగాకుండా ఈ రంగంలో ఉద్యోగుల సంఖ్య కూడా పెరిగే అవకాశం ఉంది. గతంలో ఈ రంగంలో పనిచేసే ఉద్యోగికి కమీషన్లు ఉండేవి. ఈ రంగంలో వస్తువులు అందించే డెలీవరీ బాయ్స్‌కు జీతం, కాకుంటే కమీషను రెండు ఆప్షన్లు ఉంటాయి. సగటు ఉద్యోగికి రూ.10వేల నుంచి రూ.15వేల జీతం ఇస్తారు. అదే కమీషన్ అయితే ఒక్కో వస్తువు డెలీవరికి ఒక్కోలా కమీషన్ ఇస్తారు. దీంతో చాలామంది బాయ్స్ కమీషన్లకే పనిచేస్తున్నారు. రాబోయే రోజుల్లో ఇందులో పనిచేసే ఉద్యోగికి నెలకు రూ.25వేలు వరకు జీతాలు పెరిగే అవకాశాలు ఉన్నాయి. భారతీయ రైల్వే కంటే ఈ రంగంలోనే ఉద్యోగాల భర్తీ పెరుగుతుందని తెలుస్తోంది.



ఆన్‌లైన్ ద్వారా వచ్చిన వస్తువును తీసుకుంటున్న యువకుడు

ఈ చిత్రంలో ఆన్‌లైన్ వస్తువు అందిస్తున్న కుర్రాడు మనుబోలు మండలం యాచవరం గ్రామానికి చెందిన డెలీవరి బాయ్ భరత్. పట్టణాల కంటె పల్లెలోనే ఎక్కువగా ఆన్‌లైన్ ఆర్డర్లు చేస్తుంటారని ఆ యువకుడు చెబుతున్నాడు. చదువుకున్నది ఇంటర్ వరకు. ఏడాదిన్నర నుంచి ఇదే రంగంలో పనిచేస్తున్నాడు. సాధారణంగా వీరికి నెలకు రూ.15వేల వేతనం ఇస్తారు. వద్దనుకుంటే డెలివరీ చేసే వస్తువుల పార్శిల్‌ను బట్టి కమీషన్ ఇస్తారు. అదే క్రమంలో కంపెనీ ఇచ్చే కమీషన్లపై మొగ్గు చూపిన ఈ యువకుడు జీతం కంటే అదనంగానే సంపాదిస్తున్నానంటున్నాడు. ఈ రంగం తనకు ఎంతో ఆనందంగా ఉందని తెలిపాడు. భరత్‌లానే మండలంలో పలువురు యువకులు ఆన్‌లైన్ డెలీవరీ బాయ్స్‌గా పనిచేస్తూ ఉపాధి పొందుతున్నారు.

అన్నింటా ఆదా..



ఆన్‌లైన్‌లో వస్తువుల కొనుగోలుతో సమయంతో పాటు డబ్బులు ఆదా అవుతోంది. అందుకు తగ్గట్లు ఆన్‌లైన్ వ్యాపార సంస్థలు కూడా నాణ్యతకు పెద్దపీట వేస్తున్నాయి. వివిధ పనులపై బయటకు వెళ్లిన వారు ఇంటికి చేరేలోపు నిత్యావసర వస్తువులతో పాటు ఆహారం కూడా ఇట్టే చేరిపోతుంది. ఆన్‌లైన్ డెలివరీ సూపర్.. ఇదే బెస్ట్.

- ఆలూరు కోటి, మనుబోలు

పుట్టాలమ్మకు చద్ది నివేదన



చద్ది సమర్పిస్తున్న భక్తులు

బుచ్చిరెడ్డిపాళెం, మార్చి 11(ఆంధ్రజ్యోతి): మండలంలోని రేబాలలో మంగళవారం గ్రామ దేవత పుట్టాలమ్మకు భక్తులు తొలి మంగళవారం చద్ది నివేదన సమర్పించి ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా అమ్మవారికి ప్రత్యేక పుష్పాలంకరణ చేసి భక్తులకు దర్శనం కల్పించారు. గ్రామ పెద్దలు, ప్రజలు, ఆలయ నిర్వాహకులు సమష్టిగా గ్రామ సుభిక్షం కోసం పుట్టాలమ్మకు 3 మంగళవారాలు చద్ది, 3 ఆదివారాలు చలిపిండి, పానకాలు సమర్పించేలా నిర్ణయించిన మేరకు మంగళవారం ఈ కార్యక్రమం చేపట్టారు. భక్తులు పెద్దఎత్తున తరలివచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు.

సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలి



సమస్యలు తెలుసుకుంటున్న సీపీఎం నాయకులు

ముత్తుకూరు, మార్చి 11(ఆంధ్రజ్యోతి): గ్రామాల అభివృద్ధిపై పాలకులు దృష్టి పెట్టకపోవడంతో సమస్యలు పేరుకుపోయాయని సీపీఎం నాయకులు ఎం.మోహన్‌రావు విమర్శించారు. మండలంలోని తాళ్లపూడి అరుంధతివాడలో మంగళవారం ప్రజా చైతన్య యాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తాళ్లపూడి గ్రామ ప్రజలు అనేక సమస్యలు తమ దృష్టికి తెచ్చారన్నారు. వాటి పరిష్కారానికి పోరాడుతామన్నారు. ఇంటి పన్నులు, కరెంటు చార్జీలు తగ్గించాలన్నారు. పరిశ్రమల ద్వారా వెలువడే కాలుష్యాన్ని అరికట్టాలన్నారు. పెన్షన్లు, ఆధార్ కార్డు, రేషన్‌కార్డులు, ఇంటి స్థలాలు మంజూరు చేయాలని కోరారు. పొల్యూటర్స్ పే ప్రకారం కుటుంబానికి 25 కేజీల బియ్యం, రూ.3వేల ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఎం నాయకులు గడ్డం అంకయ్య, షేక్.మస్తాన్‌షా, బ్రహ్మదేవి మోహన్‌రావు, మన్నే పద్మమ్మ, తదితరులు పాల్గొన్నారు.

సుదర్శన హోమం శక్తివంతమైనది



సుదర్శన హోమంలో త్రిదండి అహోబిల రామానుజ జీయర్ స్వామి, భక్తులు

పొదలకూరు, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): హిందూ ఆచారాల్లో సుదర్శన హోమం శక్తివంతమైనది త్రిదండి అహోబిల రామానుజ జీయర్ స్వామి పేర్కొన్నారు. పొదలకూరులోని లక్ష్మీ సమేత వేంకటేశ్వరస్వామి ఆలయంలో భాగవత సప్తాహ వేడుకల్లో భాగంగా మంగళవారం ఆయన పర్యవేక్షణలో సుదర్శన హోమం నిర్వహించారు. పూర్ణాహుతి అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలను అందజేశారు. ముచ్చింతల్‌కు చెందిన చినజీయర్ స్వామి శిష్యుడు హేమంత్ స్వామి, ఆలయ కమిటీ అధ్యక్షుడు పెంద్యాల రమణయ్యనాయుడు, విజయలక్ష్మి, గంగినేని రవీంద్రనాథ్, గీతాంజలి, రాయపనేని శివప్రసాద్, స్వర్ణ, పెండ్యాల సుధీర్‌నాయుడు, లక్ష్మి, గంగినేని సురేష్‌నాయుడు, స్వప్న దంపతులు పాల్గొన్నారు.

కొనుగోలు కేంద్రాలకు ధాన్యం ఇవ్వండి



మాట్లాడుతున్న మండల ప్రత్యేకాధికారి సుబ్బారెడ్డి

మనుబోలు, మార్చి 11(ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో ప్రభుత్వం ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలకు ధాన్యం ఇచ్చి రైతులు మద్దతు ధర పొందాలని మండల ప్రత్యేక అధికారి సుబ్బారెడ్డి కోరారు. మండలంలోని జట్లకొండూరు సచివాలయంలో ఆయన మంగళవారం రైతులతో చర్చించారు. అనంతరం మండలపరిషత్ కార్యాలయానికి చేరుకుని మాట్లాడుతూ మండలంలో 13చోట్ల ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేశారన్నారు. మండలంలో 15వేల ఎకరాల వరిసాగు అయిందన్నారు. దళారులకు ఇచ్చి రైతులు డబ్బులు రాక రోజుల తరబడి ఇబ్బందులు పడడం గతంలో చూశామన్నారు. దీంతో ప్రభుత్వం రెండురోజుల్లోనే రైతులకు డబ్బులు ఇచ్చేలా ఏర్పాటు చేసిందన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో జలజాక్షి, ఏవో జహీర్ తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల్లో రైతులకు అవగాహన

వెంకటాచలం, మార్చి 11 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని కంటేపల్లి, ఈదగాలి గ్రామాల్లో వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో మంగళవారం ధాన్యం కొనుగోలుపై రైతులకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. రైతులు ఆరుగాలం కష్టపడి పండించిన వరి ధాన్యాన్ని గ్రామాల్లో రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన రైతు సేవా కేంద్రాల ద్వారా విక్రయించుకోవాలని, 24 గంటల్లోనే రైతుల ఖాతాల్లో నగదు జమ అవుతుందన్నారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ ఎన్ శ్రీనివాసులు, మండల వ్యవసాయ అధికారి హరి కరుణాకర్‌రెడ్డి, టీడీపీ నేతలు రావూరి రాధాకృష్ణమనాయుడు, చల్లా నాగార్జున్‌రెడ్డి, కట్టంరెడ్డి రాధాకృష్ణారెడ్డి, ఈపూరు సుబ్బారెడ్డి, టంగుటూరు హిమల్‌కుమార్‌రెడ్డి, దువ్వూరు లక్ష్మమ్మ తదితరులు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలు కేంద్రాల తనిఖీ

ఇందుకూరుపేట, మార్చి 11(ఆంధ్రజ్యోతి): మండలంలోని ధాన్యం కొనుగోలు కేంద్రాలను మండల ప్రత్యేక అధికారి, ఏపీఎంఐపీ ప్రాజెక్టు డైరెక్టర్ శ్రీనివాసులు మంగళవారం తనిఖీ చేశారు. ధాన్యం విక్రయించే రైతులు గ్రామ వ్యవసాయ సహాయకులచే వివరాలు నమోదు చేయించుకోవాలన్నారు. ఈ కార్యక్రమం లో మండల వ్యవసాయ అధికారి డి.రఘునాథ రెడ్డి, వీఏఏ, వీహెచ్‌ఏలు దీక్షిత, ఝాన్సీ, తిరుమల మాదయ్య పాల్గొన్నారు.

సౌండ్ సిస్టం ధ్వంసంపై పోలీసులకు ఫిర్యాదు

తోటపల్లిగూడూరు, మార్చి 11(ఆంధ్రజ్యోతి) : మండలంలోని మహాలక్ష్మీపురం జడ్పీ ఉన్నత పాఠశాలలో సోమవారం ఆ స్కూల్ వార్షికోత్సవం జరుగుతున్న సమయంలో వెంకటేశ్వరపట్టపాలెం, ముత్యాలతోపుపట్ట పాలెం గ్రామాలకు చెందిన ఆవుల గణేష్, ముత్యాల హరి, పామంజి వాసు, చందు, మహేష్, విజయ్, వారి అనుచరులు సౌండ్ బాక్సులు, ల్యాప్‌టాప్, ఇతర సామగ్రిని ధ్వంసం చేశారని బాధితులు విక్రమ్, వంశీ మంగళవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీనివల్ల సుమారు రూ.1లక్ష నష్టం వాటిల్లినట్లు అందులో పేర్కొన్నారు. ఈ మేరకు విచారించి చర్యలు తీసుకుంటామని పోలీసులు తెలిపారు. కాగా ఇదేవిషయమై ఇప్పటికే ఆ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు కూడా పోలీసులకు ఫిర్యాదు చేసిన విషయం విదితమే.

డిగ్రీ కళాశాల అనుమతులు రద్దు చేయండి

- వీసీ అల్లం శ్రీనివాసరావుకు విద్యార్థి సంఘం నేతల వినతి



వీఎస్‌యూ వీసీ అల్లం శ్రీనివాసరావుకు వినతిపత్రం ఇస్తున్న విద్యార్థి సంఘం నేతలు

వెంకటాచలం, మార్చి 11(ఆంధ్రజ్యోతి): జగన్స్ డిగ్రీ కళాశాల అనుమతులు రద్దు చేయాలని విద్యార్థి సంఘం నేతలు బాబీ భగత్, అమృత్‌లు కోరారు. ఈ మేరకు మండలంలోని కాకుటూరు వద్ద ఉన్న వీఎస్‌యూలో మంగళవారం వర్సిటీ వీసీ ప్రొఫెసర్ అల్లం శ్రీనివాసరావును కలిసి వినతిపత్రం అందజేశారు. వారు మాట్లాడుతూ అడ్మిషన్ సమయంలో వెరిఫికేషన్ పేరుతో విద్యార్థుల నుంచి ఒరిజినల్ సర్టిఫికెట్లు తీసుకొని తిరిగి ఇవ్వడం లేదని ఆరోపించారు. ఈ విషయంపై కళాశాల యాజమాన్యం వర్సిటీ రిజిస్ట్రార్ మాట కూడా లెక్క చేయడం లేదన్నారు. విద్యార్థుల సర్టిఫికెట్లు తీసుకొని ఇబ్బంది పెడుతుంటే వీఎస్‌యూ అధికారులు చోద్యం చూస్తున్నారే తప్ప జగన్స్ కళాశాలపై ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదన్నారు. చర్యలు తీసుకోని పక్షంలో యూనివర్సిటీని ముట్టడించి విద్యార్థులకు న్యాయం జరిగే వరకు పోరాడతామని హెచ్చరించారు.

న్యాయవాదులపై అనుచిత ప్రవర్తన తగదు

కోవూరు, మార్చి 11(ఆంధ్రజ్యోతి): చట్టం ప్రకారం కక్షిదారుల కోసం పోలీసు స్టేషన్లకు వెళ్లే న్యాయవాదులపై పోలీసులు అనుచితంగా ప్రవర్తించడం తగదని కోవూరు న్యాయవాద సంఘ అధ్యక్ష, కార్యదర్శులు ఎస్కే.సలీమ్, పి.బాబు అన్నారు. బార్‌అసోసియేషన్ హాలులో మంగళవారం జరిగిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. కొడవలూరు పోలీసు స్టేషన్‌కు వెళ్లిన ఏ.చెన్నయ్యపై ఎస్‌ఐ కోటిరెడ్డి అసభ్యంగా మాట్లాడారన్నారు. పోలీస్‌స్టేషన్‌లోకి న్యాయవాదులను అనుమతించమని, స్టేషన్‌లోకి వస్తే కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారన్నారు. సీనియర్ న్యాయవాదులు పి.సునీల్, సీహెచ్ చంద్రమోహన్, పి.వీరేంద్ర మాట్లాడారు.

● కోర్టు విధుల బహిష్కరణ

కొడవలూరు పోలీసుస్టేషన్‌లో సీనియర్ న్యాయవాది ఏ చెన్నయ్యతో ఎస్‌ఐ కోటిరెడ్డి అనుచితంగా ప్రవర్తించడాన్ని నిరసిస్తూ న్యాయవాదులు మంగళవారం కోర్టు విధుల్ని బహిష్కరించారు. న్యాయవాదులపై ఇటీవల కాలంలో కొడవలూరు ఎస్‌ఐ అనుచితంగా ప్రవర్తిస్తున్నారని న్యాయాధికారులకు వినతిపత్రాలు సమర్పించారు. ఎస్‌ఐపై చర్యలు తీసుకోవాల్సిందిగా కోరుతూ జిల్లా పోలీసు ఉన్నతాధికారులకు వినతిపత్రాలు సమర్పించారు.

ఈ-పంట నమోదు తప్పనిసరి

ముత్తుకూరు, మార్చి 11(ఆంధ్రజ్యోతి) : రైతులు ఈ పంట నమోదు తప్పనిసరిగా చేయించుకోవాలని ఏడీఏ రాజ్‌కుమార్ తెలిపారు. ముసునూరువారిపాలెంలో మంగళవారం ఈ పంట సామాజిక తనిఖీ విషయమై గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ పంటలో నమోదైన రైతులు మాత్రమే ధాన్యం కొనుగోలుకు అర్హత కలిగి ఉంటారన్నారు. ప్రభుత్వం ధాన్యం కొనుగోలు కేంద్రాలపై రైతులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో సర్పంచు మునుకూరు జనార్దన్ రెడ్డి, వ్యవసాయాధికారి జోత్స్నరాణి, గోవర్ధన్ పాల్గొన్నారు.

వేణుగోపాలుడికి హనుమంత సేవ



పంచేడులో హనుమంతు వాహనంపై ఊరేగుతున్న వేణుగోపాలుడు

బుచ్చిరెడ్డిపాళెం, మార్చి 11(ఆంధ్రజ్యోతి): మండలంలోని పంచేడులో జరుగుతున్న వేణుగోపాలస్వామి ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా మంగళవారం రుక్మిణి, సత్యభామ సమేత వేణుగోపాలుడుకి హనుమంతు సేవలో గ్రామోత్సవం నిర్వహించారు. భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు. ఈ కార్యక్రమానికి పెనాక అమరనాథరెడ్డి, అనిత దంపతులు ఉభయకర్తలుగా వ్యవహరించారు.




జగన్ పాలనలో చట్టాలు నిర్వీర్యం



పొదలకూరు, మార్చి 11(ఆంధ్రజ్యోతి): జగన్మోహన్‌రెడ్డి పాలనలో వైసీపీ నేతల కాళ్ల కింద పోలీస్ చట్టాలు నలిగి పోయాయని సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్ర మోహన్ రెడ్డి అన్నారు. ఐఏఎస్, ఐపీఎస్‌ల హక్కులు, అధికారులు నిర్వీర్యమైపోయాయన్నారు. మంగళవారం అసెంబ్లీలో ఆయన మాట్లాడుతూ సర్వేపల్లి నియోజకవర్గంలో అక్రమ మైనింగ్ దందాను రెడ్‌హ్యాండెడ్‌గా పట్టించినా చర్యలు లేవన్నారు. ప్రమాదకరమైన పేలుడు పదార్థాలు వెలుగుజూసినా పట్టించుకోలేదన్నారు. అప్పటి మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి ప్రోద్బలంతో పోలీసులే తనపైకి హిజ్రాలు, రౌడీలను ఉసిగొల్పారన్నారు. గ్రావెల్ అక్రమ దందా కోసం ఒంగోలు ఎంపీ మాగుంట శ్రీనివాసులురెడ్డి సంతకం ఫోర్జరీ చేశారన్నారు. ముగ్గురు అమాయకులను బలి తీసుకున్న ఎస్‌ఐ కరిముల్లాపై సీఐడీతో విచారణ జరిపించాలన్నారు. తనపై 18 అక్రమ కేసులు బనాయించారన్నారు. పొదలకూరు మండలంలోని రుస్తుం మైన్‌లో బ్లాస్టింగ్‌లతో గిరిజనుల ఇళ్లన్నీ కదిలిపోయాయన్నారు. అమరావతి రైతులు తిరుపతికి పాదయాత్రగా వెళ్లే సమయంలో పొదలకూరులో రోడ్డు పక్కన ఓ ఖాళీ స్థలంలో భోజనాలు ఏర్పాటు చేశామన్నారు. పోలీసులు వచ్చి అక్కడ వేసిన పందిర్లను తొలిగిస్తే నడిరోడ్డుపై అక్కచెల్లెళ్లు భోజనం చేయాల్సి వచ్చిందన్నారు. ఇలాంటి దుర్మార్గాలెన్నో ఆ ఐదేళ్లు చూశామన్నారు.

ఉపాధ్యాయులకు ఆధునిక సాంకేతికతపై శిక్షణ



నెల్లూరు(హరనాథపురం), మార్చి 11(ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయులకు ఆధునిక సాంకేతికతపై శిక్షణ ఇవ్వాలని కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి కోరారు. మంగళవారం ఆమె అసెంబ్లీలో మాట్లాడుతూ మనబడి మన భవిష్యత్తు పథకంలో చేపడుతున్న స్కూళ్ల నిర్మాణ పనులు వేగవంతం చేయాలని కోరారు. విద్యార్థుల తల్లిదండ్రులు, ఉపాధ్యాయులను ఒకే వేదికపై తీసుకొచ్చే కార్యక్రమానికి శ్రీకారం చుట్టి ప్రభుత్వ విద్యా రంగాన్ని మంత్రి లోకేష్ బలోపేతం చేస్తున్నారని కొనియాడారు. పాఠశాల స్థాయిలో నాణ్యమైన విద్య అందించడానికి మహారాష్ట్రలో మజిశిక్షాన్, ఢిల్లీలో శిక్షా జాగృత అభియాన్ అనే కార్యక్రమాల ద్వారా ఉపాధ్యాయులకు ప్రత్యేక శిక్షణ ఇస్తున్నారని, అదే తరహాలో ఆంధ్రప్రదేశ్‌లో కూడా ఉపాధ్యాయులకు అధునాతన టెక్నాలజీపై శిక్షణ ఇచ్చేందుకు కార్యాచరణ రూపొందించాలని సూచించారు. 2027 నాటికి కోవూరు నియోజకవర్గంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలలో విద్యుత్ సౌకర్యం, సురక్షిత తాగునీరు అందించడంతోపాటు ఇతర మౌలిక సదుపాయాలు కల్పించేలా చర్యలు తీసుకోవాలని కోరారు.

C.R.I.M.E N.E.W.S

కౌలు రైతు ఆత్మహత్యాయత్నం



పొలంలో పురుగు మందు తాగిన ప్రసాద్‌రెడ్డిని వైద్యశాలకు తరలిస్తున్న స్థానికులు, రైతులు

కావలి రూరల్, మార్చి 11(ఆంధ్రజ్యోతి): పొలం విషయమై తలెత్తిన వివాదంతో తీవ్ర మనస్తాపానికి గురైన ఓ కౌలు రైతు పురుగు మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. కావలి మండలం తాళ్లపాళెంలో మంగళవారం ఈ ఘటన చోటు చేసుకుంది. స్థానికుల వివరాల మేరకు... తాళ్లపాళెంకు చెందిన ప్రసాద్‌రెడ్డి తన బావ చలంచర్ల విజయ్‌కుమార్ రెడ్డికి చెందిన 10 ఎకరాల పొలాన్ని కౌలుకు తీసుకుని వరి సాగు చేశాడు. అదే పొలం విషయమై గత 15 సంవత్సరాలుగా గ్రామానికి చెందిన వైసీపీ నాయకుడు పుచ్చలపల్లి సుధీర్‌రెడ్డి కుటుంబ సభ్యులకు, విజయ్‌కుమార్ రెడ్డికి మధ్య వివాదం జరుగుతోంది. ఇరువర్గాలు న్యాయస్థానాన్ని కూడా ఆశ్రయించి ఉన్నారు. ఈ క్రమంలో కౌలు రైతు ప్రసాద్ రెడ్డి యంత్రం ద్వారా వరి పైరు కోయిస్తుండగా సుధీర్ రెడ్డి కుమారుడు అభిషేక్ రెడ్డి, వారి కుటుంబ సభ్యులు అడ్డుకుని వివాదానికి దిగారు. దీంతో మనస్తాపానికి గురైన ప్రసాద్ రెడ్డి పురుగులమందుతాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. అక్కడే ఉన్న సహచర రైతులు, కుటుంబ సభ్యులు 108కు సమాచారం అందించడంతో అంబులెన్స్‌లో ఆయన్ను కావలి ఏరియా వైద్యశాలకు తరలించారు. ఆ తర్వాత మెరుగైన వైద్యం కోసం పట్టణంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తీసుకెళ్లారు. ఈ ఘటనపై విచారిస్తున్నట్లు కావలి రూరల్ పోలీసులు తెలిపారు.

వృద్ధుడి అదృశ్యం

నెల్లూరు(క్రైం), మార్చి 11 (ఆంధ్రజ్యోతి): ఓ వృద్ధుడి అదృశ్యంపై చిన్నబజారు పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసుల సమాచారం మేరకు.. నెల్లూరులోని తిప్పరాజువారి వీధిలో అశోక్ కుటుంబం నివసిస్తోంది. ఆయన తండ్రి జయంత్‌లాల్ తరచూ ఇంటి నుంచి వెళ్లిపోయి కొద్ది రోజుల తర్వాత తిరిగి వచ్చేవారు. అలాగే ఈ నెల 8న బయటకు వెళ్లి తిరిగి రాలేదు. దీంతో అశోక్ సోమవారం రాత్రి చిన్నబజారు పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు వృద్ధుడి ఆచూకీ కోసం గాలిస్తున్నారు.

భార్యను వేధిస్తున్న భర్తపై కేసు

నెల్లూరు(క్రైం), మార్చి 11 (ఆంధ్రజ్యోతి): వివాహితను వేధింపులకు గురిచేస్తున్న భర్త, అత్తింటి వారిపై చిన్నబజారు పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసుల సమాచారం మేరకు.. నెల్లూరులోని గాంధీనగర్‌కు చెందిన సుమయకు ఖుద్దూస్‌నగర్‌కు చెందిన రసూల్‌తో రెండున్నరేళ్ల కిందట వివాహం జరిగింది. వారికి ఒక కుమారుడున్నాడు. కొద్దిరోజులు వారి కాపురం సంతోషంగా సాగింది. రసూల్ పని చేయడం మానేసి భార్యను పుట్టింటి నుంచి డబ్బు తీసుకురావాలని వేధించడం ప్రారంభించాడు. ఆ వేధింపులు తాళలేక సుమయ ఆత్మహత్యకు యత్నించింది. దిశా పోలీసులకు ఫిర్యాదు చేయగా వారు కౌన్సెలింగ్ నిర్వహించినా భర్తలో మార్పు రాలేదు. ఈ నేపథ్యంలో ఆమె ఈ నెల 6న పుట్టింటికి వెళ్లిపోయింది. మంగళవారం పోలీసులకు ఫిర్యాదు చేయగా వారు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

పామూరుపల్లి ఆలయంలో చోరీ



ధ్వంసం చేసిన హుండీ

వరికుంటపాడు (ఉదయగిరి రూరల్), మార్చి 11(ఆంధ్రజ్యోతి): మండలంలోని పామూరుపల్లిలో ఉన్న సుబ్బరాయుడు ఆలయంలో చోరీ జరిగినట్లు మంగళవారం గ్రామస్థులు గుర్తించారు. ఆలయ అర్చకులు సోమవారం సాయంత్రం రోజులాగే పూజలు నిర్వహించి తాళాలు వేసుకొని వెళ్లారు. మంగళవారం ఉదయం అటుగా వెళ్లిన స్థానికులు ప్రధానగేటు తాళాలు పగలగొట్టి ఉండడాన్ని గమనించి లోపలికి వెళ్లారు. వరండాలోని హుండీని పగలగొట్టి నగదు దోచుకెళ్లినట్లు గుర్తించారు. ఈ విషయమై పోలీసులకు ఎలాంటి ఫిర్యాదు అందలేదు.

వీవోఏ అక్రమ వసూళ్లపై విచారణ

- ప్రక్రియ కొనసాగుతుండగా రాజీనామా



ఏపీఎంను అడిగి వివరాలు తెలుసుకుంటున్న డీపీఎం కామాక్షి

సంగం, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): స్థానిక వెలుగు కార్యాలయంలో వీవో ఏగా పనిచేస్తున్న మహిళ పట్టణంలోని పొదుపు సంఘాల నుంచి అక్రమ వసూళ్లకు పాల్పడ్డారని వచ్చిన ఆరోపణలపై డీఆర్‌డీఏ డీపీఎం కామాక్షి మంగళవారం బహిరంగం విచారణ చేపట్టారు. ఇటీవల సంగం చెక్‌పోస్టు కాలనీకి చెందిన ఓ పొదుపు సంఘం సభ్యులు వీవోఏ అక్రమ వసూలు చేస్తున్నారని, ఇవ్వకపోతే సంఘానికి బ్యాంకు రుణం ఇప్పించనని బెదిరిస్తున్నారని కలెక్టరేట్ గ్రీవెన్స్‌లో ఫిర్యాదు చేశారు. దీంతో కలెక్టర్ విచారణకు ఆదేశించారు. విచారణ అధికారి డీఆర్‌డీఏ డీపీఎం తొలుత వెలుగు ఏపీఎంను, సిబ్బందిని అడిగి వివరాలు సేకరించారు. అనంతరం పొదుపు సంఘాల లీడర్లతో సమావేశం నిర్వహించి బహిరంగం విచారణ జరిపారు. ఈ క్రమంలో ఫిర్యాదుదారులు లీడర్లను కాదు.. గ్రూపు సభ్యుల వద్దకు వెళ్లి విచారించాలని కోరారు. విచారణాధికారి అందుకు సిద్ధం కాగా, ఈలోపు అక్కడే ఉన్న వీవోఏ రాజీనామా చేశారు. దీంతో విచారణ ముగించారు. ఏపీఎం రవిశంకర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.


సీఎంఆర్ అయినా.. పుట్టికి 950 కేజీలు ఇవ్వాల్సిందే!

- రైతులకు తెగేసి చెబుతున్న మిల్లర్లు
- గట్టిగా మాట్లాడితే బీజీ అయిపోయిందని బుకాయింపు
- ధాన్యం విక్రయాల కోసం అన్నదాతల అవస్థలు

బుచ్చిరెడ్డిపాళెం, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): 'సీఎంఆర్ అయినా సరే పుట్టికి 950 కేజీల ధాన్యం ఇస్తేనే మద్దతు ధర రూ.19,720తో కొనుగోలు చేస్తాం. లేకుంటే లేదు.' ఇలా మిల్లర్లు రైతులకు తెగేసి చెబుతున్నారు. ట్రక్కు షీట్లు, హమాలీ, రవాణా చార్జీలు ఇన్ని ఇచ్చి కూడా అదనంగా ధాన్యం ఎందుకివ్వాలని రైతులు ప్రశ్నిస్తే తమకు బ్యాంకు గ్యారెంటీ అయిపోయిందనీ, వచ్చిన తరువాత రండి చూస్తామంటూ నిర్లక్ష్యంగా సమాధానం ఇస్తున్నారు. దీంతో దిక్కుతోచని రైతులు తహసీల్దారు, కోఆపరేటివ్ సొసైటీ, సివిల్ సప్లయిస్ అధికారులను ఆశ్రయిస్తున్నారు. అధికారులు అడిగినా మిల్లర్లు అలాంటి సమాధానాలే ఇస్తున్నారు. ఈ పరిస్థితి బుచ్చి మండలంలోని మినగల్లుకు చెందిన కే.సురేష్‌రెడ్డి అనే రైతుకు ఎదురైంది. అప్పటికే ఆయనకు చెందిన 30 ఎకరాల భూమిలో వరికోతకు ధాన్యం కొనుగోలు కేంద్రం నుంచి షెడ్యూలు కూడా ఇచ్చి వుంది. చివరకు తన సమస్యను తహీల్దారు వెంకటేశ్వర్లుకు తెలియడంతో ఆయన నెల్లూరులోని ఓ మిల్లరుకు సిఫారసు చేశారు. దీంతో మంగళవారం మధ్యాహ్నం నుంచి రైతు సురేష్‌రెడ్డి వరికోత ప్రారంభించాడు.

సర్వేలతో సతాయింపు

ఈ నెలాఖరులోపు సిటిజన్ ఈకేవైసీ సర్వే పూర్తి కావాలి, నేటితో మిస్సింగ్ సిటిజన్స్, జియో కోఆర్డినేట్స్, చర్మకారులు, డప్పుకారుల సర్వేలు పూర్తి అవ్వాలి, ఇక ఈ నెల 15లోపు వర్క్‌ఫ్రంహోం సర్వేని పూర్తి చేయాలి. ఇవి కాక పీ-4, నాన్ ఏపీ రెసిడెంట్, ఆధార్ ఆల్, పాఠశాలల పారిశుధ్యం, స్వర్ణాంధ్ర, స్వచ్ఛాంధ్ర, డీనోటిఫైడ్ క్యాస్ట్, ఎస్సీ, ఎస్టీ, బీసీ రుణాలు, ఎంఎస్ఎంఈ, ఆధార్ వితౌట్ చిల్డ్రన్స్ వంటి సర్వేలను నిర్ణీత కాలవ్యవధిలోపు పూర్తి చేయాలి... ఇలా నెల్లూరు లోని సచివాలయాల ఉద్యోగులను సర్వేల్లో భాగస్వాములను చేస్తూ కార్పొరేషన్ అధికారులు ప్రతీ రోజూ టార్గెట్లు విధిస్తున్నారు. లక్ష్యాన్ని చేరుకోలేని ఉద్యోగులకు షోకాజు నోటీసులు జారీ చేస్తున్నారు. కొందరిని సస్పెండ్ చేస్తామని కూడా హెచ్చరించారు. నగరంలో 166 సచివాలయాలు ఉండగా వాటిలో పని చేసే సెక్రటరీల్లో ఇప్పటి వరకు షోకాజు నోటీసు తీసుకోని ఉద్యోగి ఒక్కరు కూడా లేకపోవడం గమనార్హం.



- ● సచివాలయ ఉద్యోగులకు టార్గెట్లు
- ● సాధారణ విధులకు అన్యాయం
- ● వ్యక్తిగత అవసరాలకే అడ్మిన్ అసిస్టెంట్లు
- ● షోకాజు నోటీసుల్లో కనరాని పర్యవేక్షణ అధికారుల ప్రస్తావన
- ● కార్పొరేషన్‌లో ముదురుతున్న వేధింపుల వివాదం

నెల్లూరు(సిటీ), మార్చి 11 (ఆంధ్రజ్యోతి) : ఒకటి కాదు రెండు కాదు... పదుల సంఖ్యలో సర్వేలు. వీటన్నింటినీ పూర్తి చేయాల్సింది సచివాలయ ఉద్యోగులే!. ఇవిచేస్తున్నప్పటికీ సాధారణ విధుల్లో ఏ మాత్రం తేడా రాకూడదు. అనుకున్న సమయానికి సర్వేలు పూర్తికావాలి. సెక్రటరీలందరూ ప్రజలకు సచివాలయాల్లో అందుబాటులో ఉండాలి... అంటూ కార్పొరేషన్ అధికారులు సచివాలయాలకు విధిస్తున్న టార్గెట్లు వివాదానికి దారితీస్తున్నాయి. అడ్మిన్ సహాయకులేమో కొందరు అధికారుల సేవలోనే గడిపేస్తున్నారు. ఇక షోకాజుల పేరిట ఇస్తున్న నోటీసులలో సచివాలయ సెక్రటరీలే తప్ప ప్రత్యేకాధికారులు, ఆర్ఐ, ఏఈల పేర్లు చేర్చకపోవడం వివాదస్పదంగా మారుతోంది. రాష్ట్రంలో ఎక్కడా లేని సతాయింపులు నెల్లూరులోనే జరుగుతున్నాయంటూ మండిపడుతున్న సెక్రటరీలు ఉద్యమానికి సిద్ధమవుతున్నట్లు ప్రచారం జరుగుతోంది.

● అసలు సమస్య ఇక్కడే...!

ఊపిరి తిప్పుకోలేని సర్వేలను నెత్తిన పెట్టిన కార్పొరేషన్ అధికారులు అదే సమయంలో సాధారణ విధులకు ఆటకం కలగకూడదని స్పష్టం చేస్తు న్నారు. పైగా సచివాలయాల్లో సెక్రటరీలందరూ సకాలంలో అందుబాటులో ఉండాలని ఆదేశిస్తున్నారు. ఇదేలా సాధ్యమని సెక్రటరీలు ప్రశ్నిస్తున్నారు. సర్వేల కోసం బయటకు వెళ్తున్న తమను, ప్రజలకు కార్యాలయంలో అందుబాటులో ఉండటం లేదనటం తగదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అన్నీ సర్వేలకు ఒకేసారి వేలిముద్ర వేయించుకునే అవకాశాన్ని ప్రభుత్వం ఇవ్వకపోవడంతో ఒక్కొక్క సర్వేకి ఒక్కోసారి వేలిముద్ర వేయించాల్సి రావడంతో ప్రజలు విముఖత చూపుతున్నారని వాపోతున్నారు. సాధారణ విధులు తక్కువగా ఉండే మహిళ పోలీసు, వెల్ఫేర్ సెక్రటరీ, వీఆర్వో, అమినిటీస్ సెక్రటరీలతో నిర్వహించాల్సిన సర్వే అందరితో చేయించడం సరికాదని సూచిస్తున్నారు.

● షోకాజుల్లో పర్యవేక్షకుల ప్రస్తావనేది...?

సర్వే చేయడంలో వెనుకబడ్డారని, సరైన ప్రగతి చూపలేదనే కారణాలతో సచివాలయ ఉద్యోగులకు అధికారులు షోకాజు నోటీసులు జారీ చేస్తున్నారు. అయితే సచివాలయాలపై పర్యవేక్షణకు నియమించిన ప్రత్యేక అధికారుల ప్రస్తావన మాత్రం షోకాజు నోటీసుల్లో ఎందుకు తీసుకురావడం లేదని కొందరు సెక్రటరీలు ప్రశ్నిస్తున్నారు. పన్ను వసూళ్లలో వెనుకబడి ఉన్నారంటూ అడ్మిన్ల కు నోటీసులు జారీ చేసిన అధికారులు రెవెన్యూలో పన్ను వసూళ్లకు పూర్తి బాధ్యులైన ఆర్ఐలకు ఎందుకు నోటీసులు ఇవ్వ లేదని నిలదీస్తున్నారు. సచివాలయాలకు ప్రత్యేక అధికారులుగా పెత్తనం చెలాయిస్తున్న ఆర్ఐ, ఇంజనీర్లు ఇతర అధికారుల పేర్లను షోకాజు నోటీసుల్లో కనీసం ప్రస్తావించకపోవడాన్ని ఆక్షేపిస్తున్నారు.

అధికారుల సేవలో అడ్మిన్ సహాయకులు

సచివాలయాల్లో అడ్మిన్లకు సహాయకులుగా కొందరు ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులను నియమించారు. వీరు పన్ను వసూళ్లు, ఇతర సచివాలయ విధుల్లో పాల్గొనాల్సి ఉంది. కానీ వీరంతా కార్పొరేషన్‌లోని కొందరు అధికారుల వ్యక్తిగత సేవల్లో నిమగ్నమయ్యారనే ఆరోపణలున్నాయి. ఆర్ఐ, ఇంజనీర్లు వీరిని వ్యక్తిగత అవసరాలకు వాడుకుంటున్నారని, దీంతో వీరంతా పేరుకు అడ్మిన్ సహాయకులుగా ఉంటూ అధికారులకు సేవలు చేసుకుంటూ జీతాలు తీసుకుంటున్నట్లు సమాచారం. కాగా, రాష్ట్రంలో ఎక్కడా లేని విధంగా ప్రత్యేకించి నెల్లూరులోనే సర్వేలకు సంబంధించి టార్గెట్ విధించి వేధింపులకు పాల్పడుతున్నారంటూ సచివాలయ ఉద్యోగు లు వాపోతున్నారు. ఈ క్రమంలో వివిధ ఉద్యోగ సంఘాలతో సంప్రదిం పులు జరుపుతూ ఉద్యమ కార్యాచరణ వైపు అడుగులు వేస్తున్నట్లు తెలిసింది.

రాష్ట్రంలో పారిశ్రామికాభివృద్ధికి కేంద్ర సహకారం ఏమిటి?

● లోక్‌సభలో ఎంపీ వేమిరెడ్డి

నెల్లూరు (హరనాథపురం), మార్చి 11 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రంలో పారిశ్రామిక అభివృద్ధిని ప్రోత్సహించేందుకు కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న సహకారం ఏమిటని నెల్లూరు పార్లమెంటు సభ్యుడు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి మంగళవారం లోక్‌సభలో ప్రశ్నించారు. కేంద్ర వాణిజ్య పరిశ్రమల మంత్రి త్వ శాఖ సహాయ మంత్రి జితిన్ ప్రసాద్ లిఖితపూర్వకంగా సమాధానం ఇచ్చారు. పరిశ్రమ అనేది రాష్ట్ర అంశమని, ఆయా రాష్ట్రాలు వాటి అవసరాలకు అనుగుణంగా రూపొందించుకుంటాయన్నారు. అయినప్పటికీ దేశంలో ని వివిధ ప్రాంతాల్లో పారిశ్రామికీకరణను ప్రోత్సహించేందుకు కేంద్రం ఎప్పటికప్పుడు అనేక కార్యక్రమాలు అమలు చే స్తోందని చెప్పారు. నేషనల్ ఇండస్ట్రియల్ కారిడార్ డెవలప్మెంట్ ప్రోగ్రామ్ (ఎన్‌డీఐపీటీ) వంటి వాటి ద్వారా రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల్లో పారిశ్రామిక అభివృద్ధిని ప్రోత్సహించడానికి, దేశీయ, విదేశీ పెట్టుబడులను పెంచడానికి కేంద్రం అనేక చర్యలు తీసుకుంటోందని వివరించారు. మేక్ ఇన్ ఇండియా, స్టార్టప్ ఇండియా, ఇండియన్ ఫుట్వేర్ అండ్ లెదర్ డెవలప్‌మెంట్ ప్రో గ్రామ్, ఈశాన్య పారిశ్రామిక, పెట్టుబడి ప్రోత్సాహక విధానం, నేషనల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ పైప్‌లైన్ (ఎన్ఐపీ), పీఎం గతి శక్తి, ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ వంటివి ఆ కోవలోకే వస్తాయని చెప్పారు. దేశ వ్యాప్తంగా పరిశ్రమల స్థాపనను సులభతరం చేసేలా విదేశీ ప్రత్యక్ష పెట్టుబ డుల (ఎఫ్‌డీఐ) విధానంలో సంస్కరణలు తీసుకొచ్చామని మంత్రి తెలిపారు.





వావ్... వేస్ట్ లయన్!

ఈ ఫొటోలతో కనిపిస్తున్న సింహం బొమ్మ వ్యర్థాలతో చేసినది. వాడిపడే సిన రబ్బరు ముక్కలతో మృగరాజు ఆకృతిని సృజనాత్మకంగా తయారు చేశారు. నెల్లూరు మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయంలో కమాండ్ కంట్రోల్ సెంటర్ వద్ద నూతనంగా నిర్మించిన ఈ సింహం ఆకృతిని నగర కమిషనర్ మల్లవరపు సూర్యతేజ మంగళవారం ఆవిష్కరించారు. పర్యావరణ పరిరక్షణలో భాగంగా వ్యర్థాలను ఉపయోగించి కళాకృతులను రూపొందించడాన్ని ప్రశంసించారు. ప్రజలలో చైతన్యం కల్పించటమే ధ్యేయంగా సుందరీకరణ పనులు చేపట్టామని పేర్కొన్నారు.

- నెల్లూరు (వైద్యం,ఆంధ్రజ్యోతి)

నీటి వృథా వేసవి వ్యథ

అరికట్టకపోతే



నగరంలోని జెండావీధి వాటర్ ట్యాంకు పగుళ్లతో నిరంతరం నీరు లీక్ అవుతోంది. దీనివల్ల చుట్టుపక్కల ప్రాంత్రమంతా తడిసి పాచిపడుతోంది. ఈ కారణంగా దోమల బెడద, దుర్వాసన ఎక్కువవుతోంది. కార్పొరేషన్ అధికారులు తక్షణం స్పందించి లీకేజీని అరికట్టకపోతే ట్యాంకులోని నీరంతా వృథా అయి ప్రస్తుత వేసవిలో నీటి ఎద్దడి ఏర్పడే అవకాశం ఉందని స్థానికులు అంటున్నారు. అధికారులు చొరవచూపి ట్యాంకునకు మరమ్మతులు చేపట్టాలని కోరుతున్నారు.

ఫొటోలు : స్టాఫ్ ఫొటోగ్రాఫర్





బీదకు నుడా చైర్మన్ అభినందన

నెల్లూరు (జడ్పీ), మార్చి 11(ఆంధ్రజ్యోతి): కష్టపడిన వారికి టీడీపీ గుర్తింపు ఇస్తుందనడానికి బీద రవిచంద్రను ఎమ్మెల్సీ పదవి ఎంపిక చేయడమే నిదర్శనమని నుడా చైర్మన్ కోటంరెడ్డి శ్రీనువాసులు రెడ్డి పేర్కొన్నారు. రవిచంద్ర నామినేషన్ వేస్తుండడంతో అమరావతికి వెళ్ళిన శ్రీనివాసులు రెడ్డి బీదకు అభినందనలు తెలిపారు. పార్టీ అధినేత ఎలాంటి బాధ్యత అప్ప గించినా సమర్ధంగా నిర్వహించడంలో బీద సిద్ధహస్తుడని కొనియాడారు.



బీద రవిచంద్రతో కోటంరెడ్డి శ్రీనివాసులు రెడ్డి



శంకుస్థాపన ప్రదేశంలో పూలు వేస్తున్న స్థానికులు, నాయకులు, చిత్రంలో గిరిధర్‌రెడ్డి

రూరల్‌లో రూ.191కోట్లతో అభివృద్ధి పనులు

● టీడీపీ నేత కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డి

నెల్లూరు(వ్యవసాయం), మార్చి 10(ఆంధ్రజ్యోతి): నెల్లూరు రూరల్ నియోజకవర్గంలో రూ.191కోట్లతో అభివృద్ధి పనులు చేపట్టామని తెలుగు దేశం పార్టీ నాయకుడు కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డి తెలిపారు. నగరంలోని 19, 22, 31, 35 డివిజన్లలో మంగళవారం ఆయన వివిధ అభివృద్ధి పనులకు స్థానికులతో కలిసి శంకుస్థాపన చేశారు. నియోజకవర్గాన్ని రాష్ట్రంలోనే ఆదర్శవంతంగా నిలపడమే లక్ష్యంగా ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి నిరంతరం కృషి చేస్తున్నారని చెప్పారు. శంఖుస్థాపనలు చేసిన పనులన్నీ 60 రోజుల్లో పూర్తిచేసి మే 20న ప్రజలకు అంకితం చేస్తామని తెలిపారు.

మోదీ ఆశీస్సులతోనే జగన్‌కు 3వేల సార్లు బెయిల్


● కేంద్ర మాజీ మంత్రి చింతా మోహన్

నెల్లూరు (సాంస్కృతికం)/కావలి, మార్చి 11 (ఆంధ్రజ్యోతి) : సీబీఐ కేసుల్లో మాజీ ముఖ్యమంత్రి వైఎస్.జగన్మోహన్‌రెడ్డి ప్రధాని నరేంద్ర మోదీతోనే 3వేలసార్లు బెయిల్ వచ్చిందని కేంద్ర మాజీ మంత్రి, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత చింతా మోహన్ విమర్శించారు. మంగళవారం నెల్లూరు, కావలిలో ఆయన విలేకరులతో మాట్లాడారు. చంద్రబాబును జగన్‌లను సైకిల్‌కి రెండు చక్రాలు చేసుకుని ప్రధాని మోదీ సవారీ చేస్తున్నారంటూ వ్యాఖ్యానించారు. పార్లమెంటులో నియోజకవర్గాల పునర్విభజన చర్చలో తమిళనాడు ఆత్మగౌరవం దెబ్బతీసేలా, ఒడిశాకు చెందిన బీజేపీ మంత్రి ధర్మేంద్రప్రసాద్ మాట్లాడిన మాటలను తాను ఖండిస్తున్నట్లు చెప్పారు. దేశంలోని నిరుద్యోగ యువతను పట్టించుకోకుండా ప్రధాని మోదీ నోరు తెరిస్తే ట్రంప్ టైగర్‌ల గురించి మాట్లాడుతున్నారని తెలిపారు. బీజేపీ ప్రభుత్వంలో ధరలు ఆకాశానికి ఎగబాకాయని, రోజురోజుకు పన్నులు పెంచుతున్నారని అన్నినరు. రాష్ట్రానికి 15 ఏళ్లుగా సీఎంగా ఉన్న చంద్రబాబు నాయుడు నెల్లూరు, కావలి అభివృద్ధికి రూ.500 కోట్లు ఇవ్వాలని కోరారు. మద్యం, పెట్రోలు, డీజిల్ అమ్మకాలపై వచ్చే పన్నులతో చంద్రబాబు పరిపాలన సాగిస్తున్నారని తెలిపారు. కూటమి ప్రభుత్వం ఏర్పాటై 10 నెలలు కావస్తున్నా ఎన్నికల్లో ప్రకటించిన హామీలు నెరవేర్చలేదని అన్నారు. 2027లో జమిలీ ఎన్నికలు రావటం తథ్యమని, అప్పుడు తమ నాయకులు బయటకు వచ్చి కాంగ్రెస్‌పై ఉన్న సానుభూతిని అనుకూలంగా మలచుకుని ఇటు కేంద్ర, అటు రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి తీసుకురావటం ఖాయమన్నారు.



మహిళలను ఆకట్టుకుంటున్న చేనేత వస్త్రాలు

నెల్లూరు (సాంస్కృతికం), మార్చి 11 (ఆంధ్రజ్యోతి) : నగరంలోని టౌనుహాలు ఏసీ హాలులో తిరుమల క్రియేషన్స్ చేనేత వస్త్రాల ఎగ్జిబిషన్ కమ్ సేల్స్ నగర మహిళలను విశేషంగా ఆకట్టుకుంటోంది. ఈ ప్రదర్శనలో పల్లవి కాటన్, వసుంధర కాటన్, జార్జెట్ కాటన్, కోటా, సూపర్ నెట్ శారీస్, డ్రెస్ మెటీరియల్స్ వేసవిలో ధరించేందుకు మహిళల కోసం ఏర్పాటు చేశారు. బుధవారం రాత్రి 8 గంటల వరకు ప్రదర్శన ఉంటుందని, సింహపురి మహిళలు సద్వినియోగం చేసుకోవాలని ఎగ్జిబిషన్ నిర్వాహకురాలు ఏ మల్లేశ్వరి విజ్ఞప్తి చేశారు.



జాతీయ రహదారిపై ఫ్లైఓవర్ నిర్మించాలి

● సీపీఎం జిల్లా కార్యదర్శి మూలం రమేష్

నెల్లూరు (వైద్యం), మార్చి 11 (ఆంధ్రజ్యోతి) : నగరంలోని చిల్డ్రన్స్ పార్కు రోడ్డులో వాహనాల రద్దీ ఎక్కువగా ఉన్నందున, చింతారెడ్డి పాళెం జంక్షన్‌లో జాతీయ రహదారిపై ఫ్లైఓవర్ వంతెన నిర్మించాలని సీపీఎం జిల్లా కార్యాదర్శి మూలం రమేష్ డిమాండ్ చేశారు. 16వ డివిజన్‌లో పార్టీ నాయకుడు కాయం శ్రీనివాసులు ఆధ్వర్యంలో మంగళవారం ప్రజాచైతన్య యాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా రమేష్ మాట్లాడుతూ ప్రజాచైతన్య యాత్రలో ఇంటింటికి వెళ్లినప్పుడు స్థానికులు అనేక సమస్యలు వెల్లడి స్తున్నారన్నారు. వాటిని అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తున్నామని చెప్పారు. ఈ కార్యక్రమంలో నాయకులు సుధాకర్, కుమార్, బాబు తదితరులు పాల్గొన్నారు.



ప్రజాచైతన్య యాత్రలో సీపీఎం నాయకులు

డీటీసీతో టూరిస్టు బస్సు ఓనర్స్ అసోసియేషన్ భేటీ



డీటీసీకి పుష్పగుచ్ఛం అందిస్తున్న అసోసియేషన్ సభ్యులు

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట), మార్చి 11 (ఆంధ్రజ్యోతి): జిల్లా టూరిస్టు బస్సు ఓనర్స్ అసోసియేషన్ సభ్యులు మంగళవారం నగరంలోని రవాణా శాఖ కార్యాలయంలో డీటీసీ చందర్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. అసోసియేషన్ అధ్యక్షుడు శ్రీధర్‌రెడ్డి మాట్లాడుతూ నూతనంగా అసోసియే షన్‌ను ఏర్పాటు చేసి, కమిటీని ఎన్నుకున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో సంఘం కార్యదర్శిగా జీ శివరామ్, ఉపాధ్యక్షుడు ఎంఏ ఆఫీరోజ్ తదితరులు పాల్గొన్నారు.

ఈవో వైఖరిపై అసంతృప్తి

బిట్రగుంట, మార్చి 11 (ఆంధ్రజ్యోతి) : కొండబిట్రగుంటలోని ప్రసన్న వేంకటేశ్వర స్వామి ఆలయ ఈవో రాధాకృష్ణతీరుపై ఉ భయకర్తలు అసంతృప్తి వ్యక్తం చేశారు. సో మవారం రాత్రి జరిగిన ధ్వజారోహణం, శేష వాహన సేవ ఉభయకర్తలకు ఎటువంటి సమాచారం ఇవ్వకుండా తమ ఉభయంలో మరొకరిని చేర్చడంపై ఆవేదన చెందారు.

ప్రభుత్వ న్యాయవాది సుందరయ్యకు సన్మానం

నెల్లూరు (వైద్యం), మార్చి 11 (ఆంధ్రజ్యోతి) : జిల్లా లాయర్స్ అసోసియేషన్ కార్యదర్శిగా ఉన్న న్యాయవాది సుందరయ్య ప్రభుత్వ న్యాయవాదిగా బాధ్యతలు చేపట్టిన సందర్భంగా విజయ కేర్ ఆసుపత్రి వైద్యులు మంగళవారం ఘనంగా సన్మానించారు. సుందరయ్య కార్యాలయంలో ఈ కార్యక్రమం జరిగింది. ఆయన మాట్లాడుతూ తనపై బాధ్యత పెరిగిందన్నారు. ప్రజలకు న్యాయం చేసేలా, ప్రభుత్వానికి మంచి పేరు తెచ్చేలా వ్యవహరిస్తామని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో విజయ కేర్ ఆసుపత్రి వైద్యులు విజయకుమార్, ఉదయ భాస్కర్, ఉదయభాను, నరేష్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.



సుందరయ్యను సన్మానిస్తున్న వైద్యులు


'జెనెక్స్ విజన్'లో పూల్ క్యాంపస్ డ్రైవ్

నెల్లూరు(విద్య), మార్చి 11 (ఆంధ్రజ్యోతి) : నగరంలోని జెనెక్స్ విజన్ కళాశాలలో మంగళవారం పూల్ క్యాంపస్ డ్రైవ్ నిర్వహించారు. కళాశాల చైర్మన్ వెంగల్‌రెడ్డి మాట్లాడుతూ బెంగళూరుకు చెందిన సాఫ్ట్‌వేర్ కంపెనీ ఆధ్వర్యంలో డ్రైవ్ నిర్వహించామన్నారు. డిగ్రీ, పీజీ విద్యార్థులకు రాతపరీక్ష, గ్రూప్ డిస్కషన్, ఇంటర్వ్యూలు నిర్వహించగా 30 మంది పలు ఉద్యోగాలకు ఎంపికయ్యారు. వారిని చైర్మన్, డైరెక్టర్ కొండలరావు అభినందించారు. ఈ కార్యక్రమంలో పీజీ కళాశాల ప్రిన్సిపాల్ తేజ, డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ అనిల్ కుమార్, ప్లేస్‌మెంట్ హెడ్ చరణ్, అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు.



ఉద్యోగాలకు ఎంపికైన విద్యార్థులతో కళాశాల యాజమాన్యం, అధ్యాపకులు

ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5
తిరుపతి
జిల్లా వార్తలు
బుధవారం 12 మార్చి 2025



తుడాలో కొలిక్కి వచ్చిన విజిలెన్స్ విచారణ

ఈ నెలాఖరుకు ప్రభుత్వానికి నివేదిక

తిరుపతి(నేరవిభాగం), మార్చి 11(ఆంధ్రజ్యోతి): తిరుపతి పట్టణాభివృద్ధి సంస్థ (తుడా)లో అవినీతి అక్రమాలపై సాగుతున్న విజిలెన్సు విచారణ ఒక కొలిక్కి వచ్చింది. ఈ నెలాఖరులోగా విచారణను ముగించి.. ప్రభుత్వానికి నివేదిక అందించే పనిలో అధికారులు ఉన్నట్లు తెలిసింది. గత పాలకుల హయాంలో తుడాలో భారీ ఎత్తున అక్రమాలు జరిగాయంటూ రాష్ట్ర ప్రభుత్వానికి ఫిర్యాదులు వెళ్లాయి. ప్రధానంగా 16 నుంచి 18 అంశాలకు సంబంధించి నిధులు దుర్వినియోగమైనట్లు ఫిర్యాదుల్లో పేర్కొనడంతో.. ప్రభుత్వం విజిలెన్సు విచారణకు ఆదేశించింది. ఐదు నెలలుగా విచారణ జరుపుతున్న అధికారులు.. ఎక్కడెక్కడ పనులు జరిగాయి? ఎంతమేరకు నిధులు పక్కదారి పట్టాయనే దానిపై దృష్టి పెట్టినట్లు తెలుస్తోంది. విశ్వసనీయ వర్గాల సమాచారం మేరకు.. వైసీపీ హయాంలో తుడా పరిధిలో జరిగిన పనుల వివరాలు అధికారులు తెప్పించుకుని పరిశీలించారు. వాటి ఆధారంగా క్షేత్ర స్థాయిలో విచారిస్తున్నారు. చంద్రగిరి నియోజకవర్గంతో పాటు తిరుపతి అర్బన్ పరిధిలోనూ లెక్కకు మించి అంచనాలతో బెంచ్‌లు ఏర్పాటు చేశారు. వీటిని అంచనాల కంటే ఎక్కువగా ధరలు కోట్ చేసినట్లు విజిలెన్సు విచారణలో వెల్లడైనట్లు తెలిసింది. ఇక కుండీలు ఏర్పాటు చేసి మొక్కలు నాటడంలో నిధుల దుర్వినియోగమైనట్లు విచారణ అధికారులు గుర్తించినట్లు సమాచారం. ఇక, ఎన్నికల ముందు తుడా నిధులను కొన్ని ప్రాంతాల ఎంపీడీవోలకు కేటాయించడంపైనా దర్యాప్తు సాగుతోంది. ఇందులో వివిధ అభివృద్ధి పనుల పేరిట పాత పనులు కొత్తగా చేసినట్లు చూపించి నిధులు స్వాహా చేశారనే ఆరోపణలున్నాయి. ఇదిలా వుండగా 2020-21వ సంవత్సరంలో దాదాపు 55 పనులకు సంబంధించి రూ.23 కోట్లతో టెండర్లు పిలిచినట్లు సమాచారం. 2021-22లో 407 పనులకు సంబంధించి 145 కోట్లు, 2022-23లో రూ.470 కోట్లకు సంబంధించి 157 పనులకు టెండర్లు పిలిచారు. మరికొన్ని పనులను నామినేషన్ ప్రాతిపదికన కేటాయించారు. వీటిలోనూ అక్రమాలు జరిగినట్లు ప్రభుత్వానికి ఫిర్యాదులు వెళ్లిన క్రమంలో... ఈ కోణంలోనూ విజిలెన్సు విచారణ సాగుతోంది. ఇప్పటి వరకు అందిన సమాచారం మేరకు రూ.200 కోట్లకుపైగా తుడా నిధులు పక్కదారి పట్టినట్లు విచారణలో తేలిందని సమాచారం. గత ఐదేళ్ళ కాలంలో జరిగిన పనులు, నిధుల వినియోగంపై విచారణకు సంబంధించి నివేదికను ఈ నెలాఖరులోగా ప్రభుత్వానికి పంపనున్నట్లు తెలిసింది.

నేటి నుంచి విరించి-2కె25

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), మార్చి 11(ఆంధ్రజ్యోతి): పద్మావతి మహిళా యూనివర్సిటీలో బుధవారం నుంచి విరించి-2కె25 కార్యక్రమం నిర్వహించనున్నారు. ఉదయం 10 గంటలకు ఇంజనీరింగ్ కాలేజీ ఆడిటోరియంలో ఈ కార్యక్రమం ప్రారంభం కానుంది. ఇందులో వీసీ ప్రొఫెసర్ ఉమ, రిజిస్ట్రార్ రజని, ఇతర అధికారులు పాల్గొంటారు. రెండు రోజుల పాటు విద్యార్థులు సాంస్కృతిక పోటీలు నిర్వహిస్తారు.

అన్నమయ్య సంకీర్తనల నడుమ 'గరిమెళ్ల' అంతిమయాత్ర

- పాటలతో శిష్యులు, అభిమానుల నివాళి
- ప్రభుత్వ లాంఛనాలతో బాలకృష్ణప్రసాద్ అంత్యక్రియలు



గరిమెళ్ల పార్థివదేహంపై పుష్పగుచ్ఛం ఉంచుతున్న కలెక్టర్ వెంకటేశ్వర్

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), మార్చి 11 (ఆంధ్రజ్యోతి): అన్నమయ్య సంకీర్తనలను ఆలపిస్తూ శిష్యులు, అభిమానులు ముందు నడుస్తుండగా.. ప్రముఖ సంగీత విద్వాంసుడు గరిమెళ్ల బాలకృష్ణ ప్రసాద్ అంతిమ యాత్ర సాగింది. ఇలా పాటలతో నివాళులర్పిస్తూ.. కన్నీటి వీడ్కోలు పలికారు. అనారోగ్యంతో ఆదివారం గరిమెళ్ల బాలకృష్ణ ప్రసాద్ కన్నుమూయగా, మంగళవారం అధికార లాంఛనాలతో అంత్యక్రియలు నిర్వహించారు. తిరుపతి నగరం భవానినగర్‌లోని గరిమెళ్ల ఇంటికి ఉదయం నుంచీ ఆయన అభిమానులు, శిష్యులు, ప్రముఖులు చేరుకున్నారు. పార్థివ దేహం వద్ద నివాళులర్పించారు. ఆయనతో తమకున్న అనుబంధాన్ని గుర్తుచేసుకున్నారు. అధికార లాంఛనాలతో అంత్యక్రియలు నిర్వహించాలని ప్రభుత్వం నిర్ణయించింది. దీంతో కలెక్టర్ వెంకటేశ్వర్, జిల్లా యంత్రాంగం అక్కడికి చేరుకుని నివాళులర్పించారు. జాతీయ పతాకాన్ని కప్పారు. అనంతరం అంతిమయాత్ర మొదలై.. హరిశ్చంద్ర శ్మశాన వాటిక వరకూ సాగింది. ఈ యాత్రలో ఆయన శిష్యులు అన్నమయ్య సంకీర్తనలను ఆలపిస్తూ ముందుకు కదిలారు. శ్మశాన వాటికలో గరిమెళ్ల బాలకృష్ణప్రసాద్ గౌరవార్థం పోలీసులు గాలిలోకి మూడు రౌండ్లు కాల్పులు జరిపి గౌరవ వందనం పలికారు. ఆయన చిన్న కుమారుడు అనిల్‌కుమార్ చితికి నిప్పు అంటించారు. అంత్యక్రియల్లో గరిమెళ్ల బాలకృష్ణ సతీమణి రాధమ్మ, తనయుడు, కుటుంబీకులు తదితరులు పాల్గొన్నారు. టీటీడీ పాలకమండలి సభ్యురాలు, కేంద్ర మాజీ మంత్రి పనబాక లక్ష్మి,కాంగ్రెస్ నాయకురాలు ప్రమీలమ్మ, సీపీఎం నాయకుడు కందారపు మురళి, గాయని కర్రి విజయలక్ష్మి, తిరుపతి ఆర్డీవో రామ్మోహన్, ప్రముఖ ఆధ్యాత్మికవేత్త, గాయని కొండవీటి జ్యోతిర్మయి, గాయకుడు కారుణ్య, టీటీడీ సీపీఆర్వో డాక్టర్ తలారి రవి తదితరులు నివాళులర్పించారు.



విలపిస్తున్న సహ గాయని బుల్లెమ్మ



అంతిమయాత్రలో పాల్గొన్న టీటీడీ సభ్యురాలు పనబాక లక్ష్మి, గాయని కొండవీటి జ్యోతిర్మయి తదితరులు





గరిమెళ్ల గౌరవార్థం గాల్లోకి కాల్పులు జరుపుతున్న పోలీసులు - రోదిస్తున్న రాధమ్మకు సముదాయింపు

గరిమెళ్ల విగ్రహ ఏర్పాటుకు కృషి

ప్రపంచానికి అన్నమయ్య సంకీర్తనలను అందించిన గొప్ప వ్యక్తి గరిమెళ్ల బాలకృష్ణ ప్రసాద్. అలాంటాయన మృతి తీరని లోటు. అనేక మంది గరిమెళ్ల అభిమానులు ఆయనకు పద్మశ్రీ పురస్కారం ప్రకటించాలనీ, తిరుపతిలో గరిమెళ్ల విగ్రహాన్ని ఏర్పాటు చేయాలని కోరారు. ఈ అంశాలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళతాం. అన్నమయ్య కీర్తనలతో కూడిన పుస్తక ప్రసాదాన్ని భక్తులకు అందించేలా టీటీడీ కృషి చేయాలనీ పలువురు కోరారు. ఈ విషయాన్ని టీటీడీ దృష్టికి తీసుకెళతాం. ముఖ్యంగా తిరుపతిలో గరిమెళ్ల బాలకృష్ణప్రసాద్ విగ్రహాన్ని ఏర్పాటు చేయడానికి కృషి చేస్తాం.

- కలెక్టర్ వెంకటేశ్వర్

పద్మశ్రీ పురస్కారానికి ప్రతిపాదన చేస్తా

టీటీడీ ద్వారా గరిమెళ్ల కుటుంబానికి అవసరమైన సహకారం అందించేందుకు తోడ్పడతాను. అనేక మంది గాయకులు గరిమెళ్ల బాలకృష్ణప్రసాద్‌కు పాట రూపంలో నివాళులర్పించడం గర్వంగా ఉంది. ఇంత కాలం పద్మశ్రీ అవార్డు గరిమెళ్లకు ఎందుకు రాలేదో అర్థం కావడం లేదు. వెయ్యి అన్నమయ్య కీర్తనలను స్వరపరచిన గొప్ప విద్వాంసుడు గరిమెళ్ల బాలకృష్ణప్రసాద్. ఈ నెల 25వ తేదీన జరిగే టీటీడీ పాలకమండలి సమావేశంలో గరిమెళ్లకు పద్మశ్రీ పురస్కారం కోసం సిఫార్సు చేయాలనే ప్రతిపాదన చేస్తా. గరిమెళ్లను కోల్పోవడం సంగీత ప్రపంచానికి తీరని లోటు. టీటీడీకి, అన్నమాచార్య సంకీర్తనలు ఇష్టపడే ప్రతి ఒక్కరికీ తీరని బాధ.

- పనబాక లక్ష్మి, టీటీడీ ధర్మకర్తల మండలి సభ్యురాలు

ఆర్థిక దృష్టి లేని విద్వాంసులు.. గరిమెళ్ల

బాలకృష్ణప్రసాద్, రాధ ఇద్దరూ మాకు చాలా సన్నిహితులు. మా పిల్లలకు సంగీత విద్యను నేర్పారు. అన్నమయ్య పాటలకు స్వరకల్పన చేసిన గరిమెళ్ల ఏనాడు ఆర్థికాభివృద్ధిని కోరుకోలేదు. గరిమెళ్ల కుమారులిద్దరూ చాలా మంచి వారు. వైష్ణవ సంప్రదాయం ప్రకారం ఏకాదశి మరణం, ద్వాదశి దహనం చాలా మంచివని అంటారు. గరిమెళ్ల కృషికి శ్రీవారే ఈ అవకాశం కల్పించారు. రాధమ్మకు మనశ్శాంతి కలగాలని కోరుకుంటున్నా.

- ప్రమీలమ్మ, కాంగ్రెస్ నాయకురాలు

అన్నమయ్య పాటలు పాడటంలో అగ్రగణ్యులు

గరిమెళ్ల బాలకృష్ణ ప్రసాద్ అంటే తెలియని సంగీతాభిమానులు ఉండరు. టీటీడీతో ఉన్న అనుబంధం, అన్నమయ్య సంకీర్తనలను వెలుగులోకి తీసుకురావడం చాలా గొప్ప విషయాలు. తిరుపతితో ఆయనకు ఎంతో అనుబంధం ఉంది. ఒకే వేదిక మీద అనేక కార్యక్రమాల్లో పాల్గొన్నాం. గరిమెళ్ల మృతి సంగీత ప్రపంచాన్ని శోకసంద్రంలోకి నెట్టింది. వ్యక్తిగతంగా నాకు బాగా పరిచయం. ప్రజానుకూలంగా, అభ్యుదయంగా ఆలోచించే వారు. గరిమెళ్ల మృతి తీరని లోటు.

- కందారపు మురళి, సీపీఎం నాయకుడు

గరిమెళ్ల పాడిన పాటలను మరింత ప్రాచుర్యంలోకి తెస్తాం

అన్నమయ్య పాటలంటే గరిమెళ్లకు ప్రాణం. గరిమెళ్ల గొంతులో అన్నమయ్య పాటలు జీవం పోసుకున్నాయి. ఇంత గొప్ప సంగీతాన్ని గరిమెళ్ల పాడిన పాటలను మరింత ప్రాచుర్యంలోకి తెచ్చేందుకు ప్రయత్నం చేస్తాం.

- డాక్టర్ కర్రి విజయలక్ష్మి, గాయని

అధ్యక్షా..



ఇలాగైతే అవినీతి ఎలా వెలుగు చూస్తుంది?

పుత్తూరు మున్సిపాలిటీలో అప్పటి పాలకులు ప్రతి పనిలో దోపిడీకి పాల్పడ్డారు. కౌన్సిల్ సమ్మతి లేకుండా, టెండర్లు పిలవకుండా చాలా పనులు చేశారు. నిబంధనలను పాటించలేదు. ఇలా మున్సిపాలిటీలో జరిగిన అవినీతిపై కమిషన్ వేసినందుకు మంత్రికి ధన్యవాదాలు. అయితే, అక్రమాలు జరిగాయని చెబుతున్న కాలంలో పనిచేసిన వారే ఈ కమిషన్‌లో సభ్యులుగా ఉన్నారు. ఇలాగైతే అక్రమాలు ఎలా వెలుగు చూస్తాయి? చిత్తశుద్ధి కలిగిన వారిని విచారణాధికారులుగా నియమించాలి.

- గాలి భానుప్రకాష్, నగరి ఎమ్మెల్యే

ప్రాథమిక విచారణ పూర్తయింది

పుత్తూరు మున్సిపాలిటీలో ఎస్ఎస్ ట్యాంక్ రిపేర్ పనులకు టెండర్లు పిలవకుండా రూ.45.82 లక్షలకు శ్రీహర్ష ఎర్త్ మూవర్స్‌కు నామినేషన్ పద్ధతిన అప్పగించారు. ఇది నిబంధనలకు విరుద్ధం. రూ.5.9 లక్షలకు కాలువలు శుభ్రపరిచే పనులను 32 వర్క్‌లుగా విభజించి.. ఒకేరోజు పేమెంట్ చేశారు. రూ.2.5 లక్షల స్వచ్ఛభారత్ పెయింటింగ్ పనిని 15 వర్క్‌లుగా విభజించారు. మొదటి సారి స్క్రాప్‌ను రూ.3.8 లక్షలకు అమ్మారు. ఆర్డీ విచారణలో ఎస్టిమేషన్ తయారీ, టెక్నికల్ ఆమోదం, టెండర్ ఈ-ప్రొక్యూర్‌మెంట్, వర్క్ ఆర్డర్ ఇష్యూ, ఎంబుక్ నమోదు, థర్డ్‌పార్టీ కంట్రోల్ వంటివి లేవని తేలింది. ఇప్పటి వరకు ప్రాథమిక విచారణ పూర్తయింది. మున్సిపల్ కార్యాలయం, డంపింగ్ యార్డ్, 14వ ఆర్థిక సంఘం తదితర అంశాలపై ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్ కోరిన విధంగా విచారణ చేయిస్తాం. 2019-24 కాలంలో పనిచేసిన అధికారులకు విచారణ విధులు కేటాయించం.

- మంత్రి నారాయణ స్పందన

జగనన్న కాలనీ అక్రమాలపై విచారణ జరిపించండి



వెంకటగిరిలోని జగనన్న కాలనీలో వైసీపీ ప్రభుత్వంలో అడ్డగోలుగా ప్లాట్లు కేటాయించి అక్రమాలకు పాల్పడ్డారు. అలాగే, టీడీపీ అధికారంలో ఉన్నప్పుడు ఏపి టిడ్కో ద్వారా 2400 పేద కుటుంబాలకు ఇళ్లు మంజూరు చేశారు. సామాజిక అవసరాల కోసం కొంత స్థలాన్ని వదిలి పెట్టారు. ఆ తర్వాత వైసీపీ అధికారంలోకి రాగానే ఆ స్థలంలో 111 మంది అనర్హులకు ప్లాట్లు కేటాయించారు. వీటన్నిటిపై ఉన్నత స్థాయి విచారణ జరిపించండి.

- కురుగొండ్ల రామకృష్ణ, వెంకటగిరి

స్వర్ణముఖి నదికి 'గంగ'ను వదలండి



ఎండాకాలం స్వర్ణముఖినది ఎండి పోతుంది. దీనివల్ల పెళ్లకూరు, నాయుడుపేట, ఓజిలి, దొరవారిసత్రం.. గూడూరు నియోజకవర్గంలోని చిట్టమూరు, వాకాడు మండలాల్లో సుమారు 65 గ్రామాలకు తాగు, సాగునీటి ఇబ్బందులు ఎదురవుతాయి. ఏటా తెలుగు గంగ కాలువ నుంచి రెండు టీఎంసీల నీటిని విడుదల చేస్తే ఈ సమస్య పరిష్కారం అవుతుంది.

- నెలవల విజయశ్రీ, సూళ్లూరుపేట ఎమ్మెల్యే

రైల్వేస్టేషన్ నుంచి తిరుమల బస్సులు నడపాలి



గూడూరు రైల్వే జంక్షన్. ఉత్తరాది రాష్ట్రాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు పలు రైళ్లలో గూడూరుకు వచ్చి.. బస్సులలో తిరుమలకు వెళ్తుంటారు. వీరికోసం గతంలో గూడూరు రైల్వేస్టేషన్ నుంచీ తిరుమలకు బస్సులు నడిపేవారు. గత వైసీపీ ప్రభుత్వం వీటిని నిలిపేసింది. వీటిని పునరుద్ధరించాలి.

- పాశిం సునీల్ కుమార్, గూడూరు ఎమ్మెల్యే

వైసీపీ పాలనలో మైనార్టీల అభివృద్ధి శూన్యం



గత పాలకులు మైనార్టీలపై తీవ్ర వివక్ష చూపారు. కనీస సౌకర్యాలు లేకుండా శ్రీకాళహస్తి నియోజకవర్గంలోని మైనార్టీ ప్రార్థనా మందిరాలు దారుణ పరిస్థితుల్లో ఉన్నాయి. మైనార్టీల ప్రార్థనా మందిరాల నిర్వహణ కోసం కూటమి ప్రభుత్వం వార్షిక నిధులు మంజూరు చేయడం ద్వారా వారికి ఎంతో మేలు జరుగుతుంది. మైనార్టీ ప్రజలకు ముందస్తు రంజాన్ శుభాకాంక్షలు.

- బొజ్జల సుధీర్ రెడ్డి, శ్రీకాళహస్తి ఎమ్మెల్యే

మంజూరైన సబ్‌స్టేషన్లకు టెండర్లు పిలవాలి



పిచ్చాటూరు మండలం ముడియూరు, సత్యవేడు మండలం చమర్తికండ్రిగలకు కొత్తగా సబ్‌స్టేషన్లు మంజూరయ్యాయి. వీటి నిర్మాణానికి టెండర్లు పిలిచి, పనులు పూర్తి చేయాలి. పిచ్చాటూరు, బుచ్చినాయుడుకండ్రిగ మండలాల్లో బాలికోన్నత పాఠశాలలను ఏర్పాటు చేయాలి. నాగలాపురం, నారాయణవనం, పిచ్చాటూరు మండలాల్లోని పలు ప్రభుత్వ పాఠశాలల్లో అర్ధంతరంగా ఆగిన అదనపు తరగతి గదుల పనులను పూర్తి చేయాలి.

- కోనేటి ఆదిమూలం, సత్యవేడు ఎమ్మెల్యే

జిల్లా ఇన్‌చార్జి అధికారిగా శశిధర్

- జోనల్ ఇన్‌చార్జిగా ఎంటీ కృష్ణబాబు




కోన శశిధర్



కృష్ణబాబు

తిరుపతి, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ప్రభుత్వ సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాల పర్యవేక్షణకు రాష్ట్ర ప్రభుత్వం జిల్లా, జోనల్ స్థాయిల్లో సీనియర్ ఐఏఎస్‌లను ఇన్‌చార్జి అధికారులుగా నియమించింది. జిల్లా ఇన్‌చార్జిగా పాఠశాల విద్యా శాఖ ముఖ్య కార్యదర్శి కోన శశిధర్.. తిరుపతితో పాటు ప్రకాశం, నెల్లూరు, చిత్తూరు, అన్నమయ్య జిల్లాలతో కూడిన జోన్‌కు ఇన్‌చార్జిగా వైద్యారోగ్య శాఖ ముఖ్య కార్యదర్శి ఎం.టి.కృష్ణబాబు నియమితులయ్యారు. వీరిలో జిల్లా ఇన్‌చార్జి అధికారి.. తరచూ పర్యటిస్తూ ప్రభుత్వ కార్యక్రమాల అమలును పర్యవేక్షించాలి. ప్రతి పదిహేను రోజులకూ ఓసారి జిల్లా అధికారులతో సమావేశమై సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాల అమలు తీరును సమీక్షించాలి. గ్రామాల్లో పర్యటించడంతో పాటు నెలకు కనీసం రెండు సార్లు పల్లె బస చేయాలి. ప్రజల నుంచీ వచ్చిన ఫిర్యాదుల పరిష్కారాలపై సమీక్షించి అవసరమైన చర్యలు తీసుకోవాలి. నెలవారీ పురోగతికి సంబంధించిన నివేదికలను జోనల్ ఇన్‌చార్జికి, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శికి అందజేయాలి.

- ఇక, ప్రభుత్వ ప్రాధాన్య కార్యక్రమాలు, పథకాల అమలు విజయవంతానికి జోనల్ ఇన్‌చార్జి వ్యూహాత్మక మార్గదర్శకత్వం అందించాలి. జిల్లా స్థాయిలో నెలవారీ సమీక్షా సమావేశాలు నిర్వహించాలి. ప్రభుత్వ ప్రాధాన్యతా కార్యక్రమాల్లో పాల్గొనాలి. నెలకోసారి గ్రామాలను సందర్శించి రాత్రి బస చేయాలి. పారిశ్రామికవేత్తలు, రైతులు, లబ్ధిదారులు, ప్రజాప్రతినిధులు, పన్ను చెల్లింపుదారులతో సమావేశం కావాలి. కలెక్టర్ సహా జిల్లా అధికారులకు అవసరమైన శిక్షణ ఇవ్వాలి. ప్రజా ఫిర్యాదుల పరిష్కార స్థితిని సమీక్షించాలి. ప్రభుత్వ కార్యక్రమాల అమలులో అవాంతరాలను గుర్తించి, వాటికి కారణాలేమిటన్నది విశ్లేషించాలి. ముఖ్యమైన ప్రాజెక్టులకు నిధుల కేటాయింపు, నిధుల వ్యయం వంటి అంశాలను సమీక్షించాలి. జిల్లా పురోగతితో పాటు సమస్యలు, సిఫారసులతో కూడిన నివేదికలను ప్రభుత్వ ప్రధాన కార్యదర్శికి అందజేయాలి.





తెప్పపై శ్రీనివాసుడి విహారం

శ్రీవారి తెప్పోత్సవాల్లో భాగంగా మూడోరోజు మంగళవారం రాత్రి శ్రీదేవి, భూదేవి సమేత మలయప్పస్వామి పుష్కరిణిలో తెప్పపై విహరించారు. సాయంత్రం ఆలయ మాడవీధుల్లో ఊరేగిన ఉత్సవమూర్తులు తర్వాత పుష్కరిణికి చేరుకుని తెప్పలో కొలువుదీరారు. రాత్రి 7 నుంచి 8 గంటల వరకు తెప్పపై పుష్కరిణిలో మూడుసార్లు విహరిస్తూ భక్తులకు దర్శనమిచ్చారు. మంగళవాయిద్యాలు, వేదపారాయణం, అన్నమయ్య సంకీర్తనల మధ్య తెప్పోత్సవం కన్నులపండువగా జరిగింది.

- తిరుమల, ఆంధ్రజ్యోతి

డీ టైప్ క్వార్టర్స్‌లో నాగుపాము



తిరుమల డీటైప్ క్వార్టర్స్‌లోని ఒక గదిలోకి చొరబడిన నాగుపామును మంగళవారం భాస్కరనాయుడు పట్టుకున్నారు. దాదాపు ఐదున్నర అడుగుల పొడవైన ఈపామును అడవిలో విడిచిపెట్టారు. - తిరుమల, ఆంధ్రజ్యోతి

రంజాన్ వేళలు

ఇఫ్తార్ (బుధవారం) : 6.26
సహరి (గురువారం) : 5.03

భక్తుల హడావుడిలో పాప మిస్

● పోలీసుల అప్రమత్తతతో క్షేమంగా తల్లిదండ్రుల చెంతకు
● తిరుమలలో సంఘటన



దివ్యను రవికి అప్పగిస్తున్న పోలీసులు

తిరుమల నుంచి తిరిగి వెళ్లే హడావుడిలో ఐదేళ్ల చిన్నారిని ఒక కుటుంబం వదిలేసి వెళ్లిపోయింది. పోలీసుల అప్రమత్తతో ఆ పాప క్షేమంగా తల్లిదండ్రుల వద్దకు చేరింది. మంగళవారం ఈ సంఘటన జరిగింది. మహబూబ్‌నగర్ జిల్లాలోని హన్వాడకు చెందిన రవి, వెంకటేశ్వరి దంపతులు పదిమంది కుటుంబ సభ్యులతో సోమవారం తిరుమలకు వచ్చారు. దర్శనం చేసుకుని మంగళవారం ఉదయం తిరుపతికి బయలుదేరారు. ఈ హడావుడిలో తమ చిన్నారి దివ్య తమతో లేదనే విషయం గుర్తించకుండానే తిరుపతికి చేరుకున్నారు. తిరుపతి ఆర్టీసీ బస్టాండులో పాప లేదని గుర్తించి ఆందోళనపడ్డారు. వెంటనే అక్కడ ఉన్న పోలీసు ఔట్‌పోస్టులో ఫిర్యాదు చేశారు. వారు వెంటనే తిరుమలకు సమాచారం ఇచ్చారు. తిరుమలలోని యాత్రికుల వసతి సముదాయం 3 వద్ద తనిఖీలు నిర్వహిస్తుండగా చిన్నారి కనిపించింది. సమాచారం తెలిసి తిరుమలకు వెళ్లిన దివ్య తండ్రి రవికి పాపను అప్పగించారు. సీఐ శ్రీరాముడు, సిబ్బందికి భక్తుడు ధన్యవాదాలు తెలిపారు. - తిరుమల, ఆంధ్రజ్యోతి

త్వరలో నా రెండో సినిమా

● 'బలగం' వేణు

'బలగం' చిత్రంతో మంచి హిట్ కొట్టిన నటుడు, దర్శకుడు వేణు మంగళవారం ఉదయం వీఐపీ బ్రేక్ సమయంలో తిరుమల శ్రీవారిని దర్శించుకున్నారు. అనంతరం ఆలయం ముందు మీడియాతో మాట్లాడుతూ.. త్వరలో తన రెండవ సినిమా దిల్‌రాజ్ బ్యానర్‌లో ప్రారంభం కానుందని చెప్పారు. ఈక్రమంలో స్వామి ఆశీస్సుల కోసం తిరుమలకు వచ్చానని తెలిపారు. కాగా, అంతకుముందు తెలంగాణ బీసీ కమిషన్ మాజీ చైర్మన్ వకుళాభరణం కృష్ణమోహన్ రావు కూడా శ్రీవారిని దర్శించుకున్నారు. - తిరుమల, ఆంధ్రజ్యోతి



వకుళాభరణం కృష్ణమోహన్ రావు

సర్వదర్శనానికి 14 గంటలు



తిరుమల వేంకటేశ్వరస్వామి దర్శనానికి 14 గంటల సమయం పడుతోంది. మంగళవారం సాయంత్రం 6 గంటల వరకు ఉన్న సమాచారం మేరకు వైకుంఠం క్యూకాంప్లెక్స్2లో 28 కంపార్టుమెంట్లలో సర్వదర్శన భక్తులు, వైకుంఠం క్యూకాంప్లెక్స్1లో 5 కంపార్టుమెంట్లలో టైంస్లాట్ భక్తులు వేచిఉన్నారు.

ఆదివారం హుండీ ఆదాయం: రూ.4.27 కోట్లు

సోమవారం శ్రీవారిని దర్శించుకున్న భక్తులు: 69,746

తలనీలాలు సమర్పించినవారు: 23,649

క్రీడల్లో రాణించి.. ఉద్యోగం సాధించి..

నెరవేరిన పేదింటి క్రీడాకారుడి కల





డీఆర్ఎం చేతులు మీదుగా మెడల్, సర్టిఫికెట్ అందుకుంటున్న కార్తీక్

బాల్‌బాడ్మింటన్‌లో విశేష ప్రతిభతో ఓ యువకుడు తన కలను సాకారం చేసుకున్నాడు. రైల్వేలో ఉద్యోగం సాధించి కుటుంబానికి చేదోడు వాదోడుగా నిలిచాడు. ఉద్యోగంలో చేరినా క్రీడాపరంపర కొనసాగిస్తున్నాడు. తిరుపతి రూరల్ మండలం కూపుచంద్రపేటకు చెందిన పొన్న కార్తీక్ రెక్కాడితే డొక్కాడని కుటుంబంలో పుట్టాడు. తండ్రి లోకనాథం రేణిగుంటలో టింబర్‌డిపోలో పనిచేస్తాడు. తల్లి లత గృహిణి. గ్రామానికి సమీపంలోనే దుర్గసముంద్రం హైస్కూల్లో కార్తీక్ చదువుకున్నాడు. అక్కడి మైదానంలోనే రోజూ స్నేహితులతో ఆడేవాడు. ముఖ్యంగా బాల్‌బాడ్మింటన్ మక్కువ చూపేవాడు. తొలినాళ్ల నుంచి ప్రభుత్వ ఉద్యోగం పొంది తల్లిదండ్రుల కష్టాలను తీర్చాలనేది కార్తీక్ బలమైన సంకల్పం. క్రీడల్లో బాగా రాణిస్తే స్పోర్ట్స్ కోటా కింద ఉద్యోగం వస్తుందని తెలుసుకున్నాడు. పట్టుదలతో కష్టపడ్డాడు. పీలేరులో జిల్లా సెలక్షన్స్‌లో ఎంపికై క్రీడా ప్రస్థానానికి శ్రీకారం చుట్టాడు. తరువాత వెనుతిరిగి చూడలేదు. విజయ పరంపర కొనసాగించాడు. రాష్ట్ర, జాతీయస్థాయిలో పలు పతకాలను కైవసం చేసుకున్నాడు. 2018లో స్పోర్ట్స్ కోటా ఆధారంగా రైల్వేలో ఉద్యోగం పొందాడు. ప్రస్తుతం విశాఖపట్నంలోని సీనియర్ కమర్షియల్ కమ్ టికెట్ కలెక్టర్‌గా పనిచేస్తున్నాడు. ఉమ్మడి జిల్లాలో ఇప్పటివరకు స్పోర్ట్స్ కోటాకింద రైల్వేలో ఉద్యోగం పొందిన ముగ్గురిలో కార్తీక్ కూడా ఒకడు. - తిరుపతి(క్రీడలు), ఆంధ్రజ్యోతి



గతేడాది రైల్వే టోర్నీలో విన్నర్ ట్రోఫీ అందుకుంటున్న కార్తీక్

ఇప్పటికీ ఆడుతున్నాను

ఉద్యోగం వచ్చినా తనకు ఉపాధి చూపిన క్రీడను మర్చిపోలేదు. ఎక్కడ పోటీలు జరిగినా పాల్గొంటున్నాను. అమ్మానాన్నల శ్రమ, అన్న రంజిత్, పీఈటీ టీచర్, బాల్‌బ్యాడ్మింటన్ అసోసియేషన్ ప్రతినిధుల ప్రోత్సాహం నాకు తోడైంది. యువకులు కష్టపడి ఆడితే ఉద్యోగంతో పాటు క్రీడాకారుడిగా గుర్తింపు కూడా వస్తుందని గుర్తించాలి.

- పొన్న కార్తీక్

భార్యపై భర్త హత్యాయత్నం

● నిందితుడి అరెస్ట్

పెళ్లకూరు, మార్చి 11 (ఆంధ్రజోతి): ప్రేమించి పెళ్లి చేసుకున్న దంపతుల మధ్య అనుమానం పెనుభూతమై మనస్పర్థలు రేపింది. చివరకు భార్యపై భర్త హత్యయత్నానికి పాల్పడిన ఘటన పెళ్లకూరు మండలంలో జరిగింది. శ్రీకాళహస్తి మండలం ఊరందూరు సమీపంలోని గుంటకింద పల్లె గ్రామానికి చెందిన హేమకుమార్, అన్నమయ్య జిల్లా రైల్వే కోడూరుకు చెందిన పంతగాని లక్ష్మీప్రియ ఒకరినొకరు ప్రేమించుకున్నారు. పెద్దల అంగీకారంతో నాలుగేళ్ల క్రితం పెళ్లి చేసుకున్నారు. వివాహమైన కొద్ది నెలల నుంచే హేమకుమార్ భార్యపై అనుమానంతో తరచూ గొడవపడేవాడు. ఇలా ఉండగానే వీరికి ఓ బిడ్డ జన్మించింది. తరువాత కూడా భర్త ప్రవర్తనలో మార్పు రాకపోయేసరికి లక్ష్మీప్రియ తల్లిదండ్రుల వద్దకు వెళ్లిపోయింది. కొన్నాళ్ల తరువాత మళ్లీ కలుసుకున్న వీరు శ్రీకాళహస్తిలో కాపురం పెట్టారు. ఆదివారం మధ్యాహ్నం లక్ష్మీప్రియను బైక్‌పై ఎక్కించుకున్న హేమకుమార్ పెళ్లకూరు మండలంలో టెంకాయతోపు సమీపంలోని పంటకాలువ వద్దకు తీసుకెళ్లాడు. అక్కడ ఇద్దరి మధ్య తీవ్ర స్థాయిలో గొడవ జరిగింది. ఈ క్రమంలో తన వెంట తెచ్చుకున్న కత్తి, స్క్రూడ్రైవర్‌తో లక్ష్మీప్రియపై హేమకుమార్ దాడి చేశాడు. ఆమె పెద్దగా కేకలు వేయడంతో అటుగా వెళ్తున్న యువకులు గమనించి హేమకుమార్‌ను అడ్డుకుని పోలీసులకు సమాచారం అందించారు. తొటంబేడు పోలీసులు ఘటనాస్థలానికి చేరుకుని లక్ష్మీప్రియను శ్రీకాళహస్తి ప్రభుత్వాస్పత్రికి తరలించారు. పారిపోయేందుకు ప్రయత్నించిన హేమకుమార్‌ను అదుపులోకి తీసుకున్నారు. ఘటన జరిగిన ప్రదేశం పెళ్లకూరు మండల పరిధిలోకి రావడంతో కేసును మంగళవారం ఆ పోలీస్‌స్టేషన్‌కు బదిలీ చేశారు. నిందితుడిపై కేసు చేసి కోర్టుకు హాజరుపరచగా న్యాయమూర్తి 14 రోజుల రిమాండ్ విధించారు.



నిందితుడు హేమకుమార్



గాయపడిన లక్ష్మీప్రియ

స్విమ్స్‌లో 12 ఏళ్ల బాలికకు అతి క్లిష్టమైన సర్జరీ

తిరుపతి(వైద్యం), మార్చి 11(ఆంధ్రజ్యోతి): ఊపిరి తిత్తుల సమస్యతో స్విమ్స్‌కు వచ్చిన 12 ఏళ్ల బాలికకు అతి క్లిష్టమైన సర్జరీ చేసి ప్రాణాలు నిలబెట్టామని మెడికల్ సూపరింటెండెంట్ రామ్ మంగళవారం తెలిపారు. గుంటూరు జిల్లా మాచర్ల నగరానికి చెందిన సైదాబీ(12) అనే బాలిక ఊపిరి తిత్తుల సమస్యతో బాధపడుతుంటే కుటుంబ సభ్యులు స్విమ్స్‌కు తీసుకువచ్చారు. ఇక్కడ వైద్యులు పరీక్షించగా బాలిక ఊపిరి తిత్తులు, గుండెకు మధ్యలో పెద్ద గడ్డ ఉన్నట్లు గుర్తించారు. వెంటనే సీటీ సర్జరీ విభాగం ఆధ్వర్యంలో గత నెల 25న బాలికకు అతి క్లిష్టమైన సర్జరీ చేసి ఆ గడ్డను తొలగించారు. ప్రస్తుతం బాలిక పూర్తి ఆరోగ్యంగా కోలుకోవడంతో ఆస్పత్రి నుంచి డిశ్చార్జి చేశారు. సాధారణంగా ఆ సర్జరీకి దాదాపు రూ.5 లక్షల వరకు ఖర్చవుతుందని, స్విమ్స్‌లోని టీటీడీ ప్రాణదాన పథకంలో పూర్తి ఉచితంగా బాలికకు శస్త్ర చికిత్స అందించినట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో వైద్య విభాగాధిపతులు అలోక్ సమంత్రే, సత్యవతి తదితరులు పాల్గొన్నారు.



చికిత్స అనంతరం కోలుకున్న బాలికతో వైద్యులు



కారు దహనం.. ప్రయాణికులు సురక్షితం

పాకాల, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పదిపుట్లబైలు సమీపంలో మంగళవారం తెల్లవారుజామున కారులో మంటలు చెలరేగాయి. కారులో ప్రయాణిస్తున్న ముగ్గురు సురక్షితంగా బయటపడ్డారు. తిరుపతి వైపు నుంచి కొమ్మిరెడ్డిగారిపల్లె మీదుగా మదనపల్లెకు వెళ్తున్న కారులో అకస్మాత్తుగా మంటలు వచ్చాయి. కారులోని వారు దిగి అగ్నిమాపక కేంద్రానికి సమాచారం ఇచ్చారు. పాకాల అగ్నిమాపక కేంద్రం సిబ్బంది మంటలు ఆర్పారు. అగ్నిమాపక సిబ్బంది మనోహర్‌రెడ్డి, సురేంద్రబాబు, బాలాజీ, నాగార్జున తదితరులు పాల్గొన్నారు.

18వరకు ఈకేవైసీ నమోదు

తిరుపతి(ఎంఆర్‌పల్లె), మార్చి 11(ఆంధ్రజ్యోతి): తిరుపతి జిల్లాలో రబీ సీజనుకు సంబంధించి ఈ-పంట నమోదు కోసం ఈకేవైసీని రైతులు ఈ నెల 18వ తేదీలోపు చేసుకోవాలని జిల్లా వ్యవసాయాధికారి ప్రసాద్‌రావు తెలిపారు. ఈ మేరకు మంగళవారం ఓ ప్రకటన విడుదల చేశారు. జిల్లాలో రబీ 2024-25కు గాను 2,03,860 ఎకరాలకు సంబంధించి 72,966మంది రైతులు ఈ-పంట యాప్‌లో నమోదు చేయాల్సి ఉండగా 1,94,805 ఎకరాలకు గాను 69,228మంది రైతులు ఈకేవైసీ చేసుకున్నారని వివరించారు. ఇంకా చేసుకోని రైతులు రైతు సేవా కేంద్రాల్లో ఈ నెల 18వ తేదీలోపు చేసుకోవాలని తెలిపారు. నమోదు చేసుకున్న రైతుల జాబితాను రైతు సేవా కేంద్రాల్లో 14వ తేదీ వరకు ప్రదర్శించి గ్రామసభల ద్వారా రైతుల వివరాలను చదివి వినిపిస్తారని తెలియజేశారు. ఏవైనా అభ్యంతరాలు ఉంటే 19వ తేదీలోపు రాతపూర్వకంగా తెలియజేస్తే సరిచేసి 22వ తేదీ తుది జాబితాను తయారుచేస్తారని వివరించారు.

ఎర్రచందనం స్వాధీనం: ఇద్దరు స్మగ్లర్ల అరెస్ట్

తిరుపతి, మంగళం, మార్చి 11: భాకరాపేట అటవీ ప్రాంతంలో టాస్క్‌ఫోర్స్ పోలీసులు రూ.40 లక్షల విలువచేసే 32 ఎర్రచందనం దుంగలను స్వాధీనం చేసుకున్నారు. ఇద్దరు స్మగ్లర్లను అరెస్టు చేశారు. వారి నుంచి ఓలగేజ్ వాహనాన్ని, మోటార్ సైకిల్‌ను స్వాధీనం చేసుకున్నారు. టాస్క్‌ఫోర్స్ హెడ్ ఎల్.సుబ్బారాయుడు కథనం మేరకు.. ఆర్ఐ సాయిగిరిధర్‌కు చెందిన బృందంలోని ఆర్ఎస్ఐ కేఎస్ కే.లింగాధర్ స్థానిక ఎఫ్‌బీవో రాజేశ్‌కుమార్‌తో కలసి మంగళవారం తెల్లవారుజామున దేవరకొండ అటవీ ప్రాంతంలో కూంబింగ్ నిర్వహించారు. తుమ్మచేనుపల్లి మట్టి రోడ్డు వద్ద మోటార్ సైకిల్‌పై ఒక వ్యక్తి అనుమానాస్పదంగా కనిపించాడు. అతడి వాహనాన్ని వెంబడించగా ఒక లగేజి వాహనం కనిపించింది. ఆ వాహనాన్ని చుట్టుముట్టగా అందులోని స్మగ్లర్లు పారిపోయే ప్రయత్నం చేశారు. పోలీసులు వారిని వెంబడించి ఇద్దరు స్మగ్లర్లను పట్టుకోగలిగారు. లగేజి వాహనంలో ఉన్న 32 ఎర్రచందనం దుంగలను స్వాధీనం చేసుకున్నారు. పట్టుబడిన వారు ఉమ్మడి చిత్తూరు జిల్లాకు చెందిన వారుగా గుర్తించారు. ఎర్రచందనం దుంగలతో సహా వారిని తిరుపతి టాస్క్‌ఫోర్స్ పోలీస్ స్టేషన్‌కు తరలించారు. సీఐ సురేష్ కుమార్ కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.



పట్టుబడ్డ ఎర్రచందనంతో సహా స్మగ్లర్లను అరెస్టు చూపుతున్న టాస్క్‌ఫోర్స్ పోలీసులు

హోటల్ గదిలో కూలిన పీవోపీ

● అర్ధరాత్రి పరుగులు తీసిన భక్తులు



మినర్వా గ్రాండ్ హోటల్‌లో పెచ్చులూడిన వైనం

తిరుపతి(నేరవిభాగం), మార్చి 11(ఆంధ్రజ్యోతి): తిరుపతి నగరంలోని మినర్వా గ్రాండ్ హోటల్‌లో సోమవారం అర్ధరాత్రి తర్వాత స్లాబుకున్న పీవోపీ ఊడి పడింది. దీంతో గదిలో ఉన్న భక్తులు భయాందోళనతో కేకలు వేస్తూ బయటకు పరుగులు తీశారు. ఈస్ట్ సీఐ రామకృష్ణ తెలిపిన ప్రకారం.. తిరుమల శ్రీవారిని దర్శించుకుని తిరుగు ప్రయాణంలో ఉన్న ఐదుగురు భక్తులు మినర్వా గ్రాండ్ హోటల్‌లోని ఓ గదిని తీసుకున్నారు. వీరంతా గాఢనిద్రలో ఉండగా రూములోని పైకప్పునకు ఉన్న పీవోపీ ఊడి కింద పడింది. దీంతో పెద్ద శబ్దం రావడంతో భయంతో పరుగులు తీశారు. వెంటనే సీఐ రామకృష్ణ, ఎస్ఐలు, అగ్నిమాపక సిబ్బంది హుటాహుటిన ఘటనా స్థలానికి చేరుకున్నారు. ముందు జాగ్రత్తగా అన్ని గదుల్లోని వారిని బయటకు పంపి వివిధ హోటళ్లలో అకామడేషన్ ఏర్పాటు చేశారు. హోటల్‌కు తాళం వేసి అన్ని శాఖల నుంచి అనుమతులు తీసుకుని.. హోటల్‌ను తెరిచేలా పోలీసులు ఆదేశాలు జారీ చేశారు. అన్ని హోటళ్లలో భద్రతా ప్రమాణాలపై తనిఖీలు చేయడానికి మున్సిపల్, పోలీసు, అగ్నిమాపక అధికారులు సిద్ధమయ్యారు.

హోటల్ యాజమాన్యంపై కేసు

'హోటల్ గదిలో పీవోపీ పెచ్చులూడిన ఘటనలో మా అక్క చిన్ని చిల్లకుర్తి (66), తల్లి ప్రేమలత రామయ్య (85)కు గాయాలయ్యాయి. అమెరికాలోని చికాగోలో ఉంటున్న వీరు శ్రీవారి దర్శనానికి వచ్చారు. గాయపడిన ఇద్దరూ ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు' అంటూ అమెరికాలో నివాసం ఉంటున్న రాణి ఈస్ట్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు హోటల్ యాజమాన్యంపై ఈస్ట్ సీఐ కేసు నమోదు చేశారు.

పారదర్శకంగా ఉచిత ఇసుక

● అందుబాటులో 1,37,686 టన్నులు ● అక్రమ రవాణా చేస్తే చర్యలు తప్పవు



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ వెంకటేశ్వర్

తిరుపతి(కలెక్టరేట్), మార్చి 11(ఆంధ్రజ్యోతి): ప్రజలకు పారదర్శకంగా ఇసుక ఉచితంగా అందేలా ప్రభుత్వం చర్యలు చేపట్టిందని కలెక్టర్ వెంకటేశ్వర్ అన్నారు. మంగళవారం కలెక్టరేట్‌లో జరిగిన జిల్లాస్థాయి ఇసుక కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు.జిల్లాలో మూడు డిసిల్టేషన్ పాయింట్ల నుంచి సుమారు 1,37,686 టన్నుల ఇసుక ప్రజలకు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. తిరుపతి ప్రజలకు మూడు స్టాక్ పాయింట్లను ఉచిత విధానంలో ఇసుక సరఫరా చేస్తున్నట్లు చెప్పారు.ఈ స్టాక్ పాయింట్లకు అన్నమయ్య జిల్లాలోని రీచ్‌ల నుంచి ఇసుక తీసుకొస్తున్నట్లు వివరించారు. జిల్లాలో గుర్తించిన మూడు డిసిల్టేషన్ పాయింట్లలో రెండు పెళ్లకూరు మండలం, మరొకటి కోట మండలం గూడలిలో ఏర్పాటుకు ప్రభుత్వం నుంచి అనుమతులు వచ్చాయన్నారు. ఈ నెల 15వ తేదీ లోపు ఇసుక సరఫరాను అందుబాటులోకి తీసుకురానున్నట్లు తెలిపారు. ఈ పాయింట్ల వద్ద ఇసుక తవ్వడానికి, రవాణాకు ఏజెన్సీని నియమించామని, వినియోగదారులు ఆన్‌లైన్ ద్వారా బుకింగ్ లేదా నేరుగా వెళ్లి ఇసుక కమిటీ నిర్ధారించిన నామమాత్రపు రుసుం చెల్లించి తీసుకెళ్లవచ్చన్నారు. ఇసుక డిసిల్టేషన్ పాయింట్లను సంబంధిత ఆర్డీవోలు తనిఖీ చేయాలన్నారు. ఎస్పీ హర్షవర్ధనరాజు మాట్లాడుతూ.. అక్రమ రవాణాను ఎట్టి పరిస్థితిలో ఉపేక్షించేది లేదన్నారు. ఉదయం 6 నుంచి సాయంత్రం 6వరకు ఇసుక తవ్వకాలు చేపట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో గుడూరు సబ్‌కలెక్టర్ రాఘవేంద్రమీనా, అడిషనల్ ఎస్పీ రవి మనోహరాచారి, జిల్లా గనులశాఖ అధికారి బాలాజీ నాయక్, ఆర్డీవోలు తదితరులు పాల్గొన్నారు.

యూనిఫాం ఎంతో బాగుంది

శ్రీకాళహస్తి, మార్చి 11(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల విద్యార్థుల కోసం కొత్తగా రూపొందించిన యూనిఫాం ఎంతో బాగుందని ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డి అన్నారు. ప్రభుత్వ పాఠశాలల విద్యార్థుల కోసం వచ్చే విద్యాసంవత్సరం నుంచి ఈ కొత్త యూనిఫాం అమల్లోకి రానుందన్నారు. అమరావతిలోని విద్యాశాఖ మంత్రి లోకేశ్ కార్యాలయంలో ఈ యూనిఫాంను బొజ్జల మంగళవారం పరిశీలించారు.ఎలాంటి రాజకీయ గుర్తులు లేకుండా యూనిఫాం ఉండటం కూటమి పారదర్శక పాలనకు నిదర్శనమన్నారు.



విద్యార్థుల యూనిఫాంను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి

సెలవుపై జాయింట్ కలెక్టర్

తిరుపతి(కలెక్టరేట్), మార్చి 11(ఆంధ్రజ్యోతి): జాయింట్ కలెక్టర్ శుభం బన్సల్ వ్యక్తిగత పనుల నిమిత్తం ఈ నెల 16వ తేదీ వరకు సెలవుపై వెళ్లారు. ఆయన స్వగ్రామమైన ఉత్తరాఖాండ్ నైనిటాల్‌కు వెళ్లారు. తిరిగి 17నుంచి విధులకు హాజరు కానున్నట్లు అధికారులు తెలిపారు.

పీ4 సర్వేపై గ్రామసభలు నిర్వహించండి

● కలెక్టర్ వెంకటేశ్వర్

తిరుపతి(కలెక్టరేట్), మార్చి 11(ఆంధ్రజ్యోతి): పేదరిక నిర్మూలన కోసం రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న పీ4 సర్వేపై ప్రజలకు అవగాహన కల్పించేందుకు గ్రామసభలు నిర్వహించాలని అధికారులకు కలెక్టర్ వెంకటేశ్వర్ ఆదేశించారు. కలెక్టరేట్‌లో మంగళవారం రాత్రి వివిధ అంశాలపై డీఆర్వో నరసింహులుతో కలిసి అధికారులతో సమీక్షించారు. ఆయన మాట్లాడుతూ సున్నా పేదరికం లక్ష్యంగా నిర్వహిస్తున్న పీ4సర్వేలో భాగంగా ఎంపీడీవోలు, మున్సిపల్ కమిషనర్లు వెనుకబడిన ప్రాంతాల్లో గ్రామ, వార్డు సభలు నిర్వహించి అవగాహన కల్పించాలన్నారు. పీజీఆర్ఎస్‌లో వచ్చిన అర్జీలను పెండింగ్ లేకుండా పరిష్కరించాలన్నారు. సింగిల్ యూజ్ ప్లాస్టిక్‌ను శనివారంలోపు పూర్తిగా నిలిపివేయాలని, ఎవరూ వినియోగించరాదని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఎంఎస్ఎంఈ సర్వే, వర్క్‌ఫ్రం హోమ్ సర్వేను 15వ తేదీలోపు పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో డీపీవో సుశీలాదేవి, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ రోష్మాండ్, డీఆర్‌డీఏ పీడీ శోభన్‌బాబు, డ్వామా పీడీ శ్రీనివాస్‌ప్రసాద్, డీఎంహెచ్‌వో బాలకృష్ణ నాయక్, పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.

హైవేలో రాంగ్ రూట్ ప్రయాణం

● 107 వాహనాలు స్వాధీనం



తిరుపతి(నేరవిభాగం), మార్చి 11(ఆంధ్రజ్యోతి): పూతలపట్టు- నాయుడుపేట జాతీయ రహదారిలో గత కొంత కాలంగా హైవేపై రాంగ్ రూట్‌లో వాహనాలు నడుపుతూ రోడ్డు ప్రమాదాలకు కారణమవుతున్నట్లు గుర్తించిన పోలీసులు మంగళవారం సాయంత్రం తనిఖీలు చేపట్టారు. ట్రాఫిక్ డీఎస్పీ రామకృష్ణమాచ్చారి, సీఐ చిన్నగోవిందు, ఎస్ఐలు షేక్ షావలి, రామకృష్ణ, సిబ్బంది కలిసి తనిఖీల్లో పాల్గొన్నారు. రాంగ్ రూట్‌లో, ఆపోజిట్ డైరెక్షన్‌లో వాహనాలు నడిపిన దాదాపు 107 వాహనాలను తనిఖీ చేసి కేసులు నమోదు చేసి స్వాధీనం చేసుకున్నారు. ఇందులో ద్విచక్ర వాహనాలు, కార్లు, ఎక్స్‌కవేటర్లు, ట్రాక్టర్లు ఉన్నాయి. ఇప్పటి వరకు 27 మందిపై క్రిమినల్ కేసులు నమోదు చేసి కోర్టుకు హాజరు పరచగా న్యాయమూర్తి వారికి రూ 1.85 లక్షలు జరిమానా విధించినట్లు సీఐ చెప్పారు.

సీపీఐ నారాయణ హెచ్చరికతో మద్యం షాపు తరలింపు

స్పందించి ఆరా తీసిన కలెక్టర్... షాపు తరలించాలని ఆదేశం

తిరుపతి/తిరుపతి(నేరవిభాగం), మార్చి 11 (ఆంధ్రజ్యోతి): తిరుపతి రూరల్ మండలం అవిలాల సాయినగర్ పంచాయతీలో ఇళ్ల మధ్య మద్యం షాపు ఏర్పాటుకు అనుమతి ఇవ్వడంపై సిపిఐ జాతీయ కార్యదర్శి కె.నారాయణ చేసిన హెచ్చరికతో మద్యం షాపును అధికారులు మరోచోటకు తరలించేలా చర్యలు తీసుకున్నారు. నారాయణ ప్రకటన నేపథ్యంలో స్పందించిన కలెక్టర్ వెంకటేశ్వర్ ఆరా తీసి సమస్య పరిష్కారానికి ఆదేశాలిచ్చారు. దీనికి సంబంధించిన వివరాలిలా వున్నాయి. జిల్లావ్యాప్తంగా కల్లుగీత కార్మికులకు ప్రభుత్వం 23 మద్యం షాపులు కేటాయించిన సంగతి తెలిసిందే. అందులో భాగంగా తిరుపతి రూరల్ మండలంలో సీరియల్ నంబరు 20వ షాపును దక్కించుకున్న వ్యక్తులు అవిలాల సాయినగర్ పంచాయతీలో ఫ్రెండ్లీ వైన్స్ పేరిట ఏర్పాటు చేశారు. అయితే షాపు జనావాసాల నడుమ వున్నందున అక్కడి నుంచీ తొలగించాలని కొద్ది రోజులుగా స్థానిక మహిళలు ఆందోళన చేస్తున్నారు. వారికి సీపీఐ నేతలు మద్దతుగా రంగంలోకి దిగారు. ఇటీవల షాపు బ్యానర్లను సైతం తగలబెట్టారు. ఈ నేపథ్యంలో సిపిఐ జాతీయ కార్యదర్శి కె.నారాయణ మంగళవారం తిరుపతి వచ్చారు. మద్యం షాపు వివాదం గురించి తెలుసుకుని బుధవారం నుంచీ అక్కడే బైఠాయిస్తామని, తొలగించే వరకూ ఆందోళన విరమించేది లేదంటూ హెచ్చరించారు. ఆ సందర్భంగా ఎక్సైజ్ అధికారులు కలెక్టర్‌కు తప్పుడు సమాచారం ఇచ్చి తప్పుదోవ పట్టిస్తున్నారంటూ ఆరోపించారు. దీనిపై స్పందించిన కలెక్టర్ వెంకటేశ్వర్ విషయం ఏమిటని ఆరా తీశారు. ఇళ్ల మధ్య వైన్ షాపు వద్దని, స్థానికులు అభ్యంతరం వ్యక్తం చేస్తున్నపుడు షాపును అక్కడ నుంచీ మరో చోటకు తరలించాలని ఎక్సైజ్ అధికారులను ఆదేశించారు. కాగా, సాయినగర్‌లో ఏర్పాటు చేయదలచిన గీత కార్మికుడి ఫ్రెండ్లీ వైన్స్ మద్యం షాపు స్థానిక ప్రజలు, వామపక్ష పార్టీల ఆందోళన నేపథ్యంలో అక్కడ ఏర్పాటు చేయదలచిన దుకాణాన్ని వేరొక చోట ఏర్పాటు చేసుకోవాలని ఆదేశాలు జారీ చేసినట్లు ఎక్సైజ్ సూపరింటెండెంట్ నాగమల్లేశ్వరరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలో గీత కార్మికుల కోసం దాదాపు 23 దుకాణాలు కేటాయించామన్నారు. అయితే ఎక్కడా ఎలాంటి ఇబ్బందులు రాలేదని సాయినగర్‌లో ప్రజల విజ్ఞప్తి మేరకు అక్కడ నుంచి వేరొక చోట ఏర్పాటు చేసుకునేలా దుకాణం నిర్వాహకుడికి నోటీసులు జారీ చేశామన్నారు. ఈ విషయాన్ని స్థానిక ప్రజలు గమనించాలని కోరారు.

షార్ట్ సర్క్యూట్‌తో అగ్నిప్రమాదం



మంటలను అదుపు చేస్తున్న అగ్నిమాపకశాఖ సిబ్బంది

గూడూరు, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): స్థానిక బనిగీ సాహెబ్‌పేటలోని ఓ దుకాణంలో మంగళవారం వేకువన అగ్నిప్రమాదం చోటు చేసుకుంది. అగ్నిమాపకశాఖ అధికారి విజయ్‌కుమార్ వివరాల మేరకు... బనిగీ సాహెబ్ పేటలో అదే ప్రాంతానికి చెందిన రిజ్వాన్ ఫ్రెండ్స్ కేఫ్ పేరుతో దుకాణాన్ని నిర్వహిస్తున్నాడన్నారు. మంగళవారం వేకువజామున షార్ట్ సర్క్యూట్ కారణంగా అగ్నిప్రమాదం సంభవించింది. స్థానికుల ద్వారా సమాచారం అందుకున్న అగ్నిమాపకశాఖ సిబ్బంది వెళ్లి మంటలను అదుపు చేశారు. ఈ ప్రమాదంలో సుమారు రూ.2లక్షల వరకు ఆస్తి నష్టం జరిగినట్లు అగ్నిమాపకశాఖ అధికారి తెలిపారు.

నిబంధనలు పాటించని పాఠశాలలపై చర్యలు తీసుకోండి



డీవైఈవో కార్యాలయ సిబ్బందికి వినతిపత్రం ఇస్తున్న ఏబీవీపీ నేతలు

గూడూరు అర్బన్, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): నిబంధనలు పాటించని ప్రైవేటు పాఠశాలలపై అధికారులు చర్యలు తీసుకోవాలని ఏబీవీపీ నాయకులు అన్నారు. మంగళవారం స్థానిక డీవైఈవో కార్యాలయ సిబ్బందికి ఏబీవీపీ ఆధ్వర్యంలో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కొన్ని ప్రైవేటు పాఠశాలలు అనుమతులు లేకుండా తరగతులు నిర్వహించడమే కాకుండా సరైన అర్హతలు లేని వారితో బోధన చేయిస్తున్నారన్నారు. ప్రభుత్వ నిబంధనలు పాటించకుండా అధిక మొత్తంలో ఫీజులు వసూలు చేస్తున్నారని ఆరోపించారు. కార్యక్రమంలో చిన్నా, నజీర్, నవీన్, కృష్ణ, ప్రదీప్ తదితరులు పాల్గొన్నారు.

భూములకు హద్దులు చూపండి



తహసీల్దారు చంద్రశేఖర్‌కు వినతిపత్రం ఇస్తున్న వెందోడు గ్రామస్తులు

గూడూరు, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): తమ భూములకు హద్దులు చూపాలని మండలంలోని వెందోడు గ్రామస్తులు మంగళవారం తహసీల్దారు చంద్రశేఖర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గతంలో ప్రభుత్వం గ్రామానికి చెందిన నిరుపేద ఎస్సీలకు భూములను కేటాయించిందని, అయితే ఇప్పటి వరకు వాటికి హద్దులు చూపలేదన్నారు. కొందరు ఆ భూములను ఆక్రమించుకుని సాగు చేపడుతున్నారని తెలిపారు. అధికారులు న్యాయం చేయాలని విన్నవించారు. కార్యక్రమంలో అట్రాసిటీ కమిటీ సభ్యుడు పెంచలయ్య, రాజయ్య, రాజేష్ పాల్గొన్నారు.

విశ్రాంత ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించండి

కోట, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): కోట మండలం నెల్లూరుపల్లి కొత్తపాళెం గ్రామానికి చెందిన విశ్రాంత ఉపాధ్యాయ సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు సీవీఎస్ నారాయణరావు మంగళవారం ఉత్తరాంధ్ర శాసనమండలి సభ్యుడు గాదె శ్రీనివాసులును కలిసి విశ్రాంత ఉపాధ్యాయుల సమస్యలపై వినతి పత్రం అందజేశారు. 2020-21 మధ్య పదవీ విరమణ చేసిన కేంద్ర ఉద్యోగులకు ప్రభుత్వం ప్రకటించిన డీఏలను విడుదల చేయాలని, గత పీఆర్సీలో పెంచిన రూ.16 లక్షల గ్రాడ్యూటీని అందరికీ వర్తింపజేయాలని కోరారు. అలాగే రిటైర్డ్ ఉద్యోగులకు ఇన్సూరెన్స్ కంపెనీల సహకారంతో మెరుగైన వైద్యసేవలు అందించాలన్నారు.

నెల్లూరుపల్లి కొత్తపాళెంలో క్యాన్సర్ పరీక్షలు



రోగులకు పరీక్షలు చేస్తున్న వైద్యాధికారులు

కోట, మార్చి 11(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని నెల్లూరుపల్లి కొత్తపాళెంలో మంగళవారం తిరుపతిలోని శ్రీవెంకటేశ్వర వైద్య విజ్ఞాన సంస్థ (స్విమ్స్) ఆధ్వర్యంలో ఉచితంగా క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహించారు. వలిపేడు వైద్యాధికారి డాక్టర్ దినేష్, స్విమ్స్ మెడికల్ ఆఫీసర్లు డాక్టర్ హరిత, డాక్టర్ చైతన్యభాను మహిళలకు రొమ్ము, పురుషులకు నోటి క్యాన్సర్ పరీక్షలు నిర్వహించారు. మామోగ్రామ్ పరీక్షలపై అవగాహన కల్పించారు.

క్వాలిటీ కంట్రోల్ అధికారుల తనిఖీలు



నెల్లూరుపల్లి కొత్తపాళెంలో సిమెంట్ రోడ్డును తనిఖీ చేస్తున్న క్వాలిటీ కంట్రోల్ అధికారులు

కోట, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని నెల్లూరుపల్లి, కొక్కుపాడు, ఉత్తమనెల్లూరు, కర్లపూడి గ్రామాల్లో జరుగుతున్న సిమెంట్ రోడ్డు నిర్మాణ పనులను మంగళవారం క్వాలిటీ కంట్రోల్ అధికారులు తనిఖీలు చేశారు. క్వాలిటీ కంట్రోల్ డీఈ చైతన్య, జేఈ వెంకటకృష్ణయ్య, ఏఈ కిరణ్‌కుమార్ తనిఖీలు నిర్వహించి పనుల నాణ్యతను పరిశీలించారు.

కార్పొరేషన్ రుణాలకు రేపు ఇంటర్వ్యూలు

తడ, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): కార్పొరేషన్ రుణాలకు దరఖాస్తు చేసుకున్న వారికి 13వ తేదీ గురువారం తడ మండల పరిషత్ కార్యాలయంలో ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్లు ఎంపీడీవో విజయ కుమార్ తెలిపారు. దరఖాస్తుదారులు తమ అర్హతల ఒరిజినల్ ధృవపత్రాలతో హాజరుకావాలని సూచించారు.

టీడీపీ సీనియర్ నేత మృతి



మునికృష్ణయ్య (ఫైల్‌ఫొటో)

డక్కిలి, మార్చి 11(ఆంధ్రజ్యోతి): డక్కిలి మండలం చాకలపల్లి గ్రామానికి చెందిన టీడీపీ పార్టీ సీనియర్ నాయకుడు మునికృష్ణయ్య(62) అనారోగ్యంతో మంగళవారం మృతి చెందాడు. ఆయన మృతదేహానికి మాజీ జడ్పీటీసీ ఏలేశ్వరం రామచంద్రయ్య నాయుడు, టీడీపీ మండల అధ్యక్షుడు పోలంరెడ్డి కోటేశ్వరరెడ్డి, పులి జనార్దనరెడ్డి, వేముల నాగభూషణం నాయుడు, గడ్డం సుధీర్‌రెడ్డి తదితరులు నివాళులర్పించారు. ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ విజయవాడ నుంచి ఫోన్‌లో మునికృష్ణయ్య కుటుంబ సభ్యులను పరామర్శించారు.

తవ్వి... వదిలేశారు!

- వారం రోజులుగా మంచినీళ్లు లేవు
- క్యాన్ వాటర్ తెచ్చుకునేందుకు దారీ లేదు



పైప్‌లైన్ మరమ్మతుల కోసం తవ్వి వీధిలో పోసిన మట్టి

వెంకటగిరి టౌన్, మార్చి 11(ఆంధ్రజ్యోతి): వెంకటగిరి పట్టణంలోని తోలిమిట్ట అంకమ్మ చెట్టు వీధిలో ఏడాదిగా మంచినీళ్లు రావడంలేదని మున్సిపాలిటీ అధికారులకు స్థానికులు ఫిర్యాదు చేశారు. మున్సిపాలిటీ సిబ్బంది రెండుసార్లు నామమాత్రంగా మరమ్మతులు చేసి చేతులు దులుపుకున్నారు. ఇటీవల నీటి సరఫరా పూర్తిగా ఆగిపోయింది. దీంతో వీధిలో చాలా దూరం తవ్వి పైపును బయటకు తీశారు. కానీ మరమ్మతులు చేయకుండా వారం రోజులుగా కాలయాపన చేస్తున్నారు. ఇలా తవ్వి పోసిన మట్టి వీధి మొత్తం నిండిపోవడంతో ద్విచక్ర వాహనాలు కూడా వెళ్లడానికి వీలులేకుండా పోయింది. ఇళ్ల ముందు గాడి తవ్వడంతో ఇంట్లో నుంచి బయటకు రావాలన్నా ఇబ్బందులు తప్పడంలేదని స్థానికులు వాపోతున్నారు. వృద్ధులు, పిల్లలు కాలువ దాటి వెళ్లడానికి అవస్థలు పడుతున్నారు. వారం రోజులుగా మంచి నీళ్లు రావడం లేదని, బయటకు వెళ్లి క్యాన్ వాటర్ తెచ్చుకుందామన్నా దారి సరిగా లేక ఇబ్బందులు పడుతున్నామని, అధికారులు వెంటనే సమస్య పరిష్కరించాలని స్థానికులు కోరుతున్నారు.

షార్‌లో ముగిసిన జాతీయ భద్రతా వారోత్సవాలు



ఐఓసీఎల్ డైరెక్టర్ సెంథిల్‌కుమార్‌కు రాకెట్ జ్ఞాపికను అందజేస్తున్న షార్ డైరెక్టర్ రాజారాజన్, కంట్రోలర్ శ్రీనివాసులు రెడ్డి, అధికారులు

సూళ్లూరుపేట, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): శ్రీహరికోటలోని సతీష్ ధావన్ అంతరిక్ష కేంద్రం షార్‌లో జాతీయ భద్రత వారోత్సవాల ముగింపు కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. షార్‌లోని బ్రహ్మప్రకాష్ హాలులో జరిగిన కార్యక్రమంలో షార్ డైరెక్టర్ ఆర్ముగం రాజరాజన్ మాట్లాడుతూ జీవిత ప్రయాణంలో ప్రతి ఒక్కరికి భద్రత ఎంతో అవసరమన్నారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన ఐఓసీఎల్ డైరెక్టర్ సెంథిల్ కుమార్ కార్యాలయ పరిసరాల్లో భద్రత, గ్యాస్ పైప్‌లైన్లలో భద్రత గురించి ఉద్యోగులు, విద్యార్థులకు క్షుణ్ణంగా వివరించారు. ఉద్యోగులు, విద్యార్థులకు వివిధ పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో షార్ కంట్రోలర్ శ్రీనివాసులురెడ్డి, సీజీఎం పి.వెంకటరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

జాతీయస్థాయి కబడ్డీ పోటీలకు విద్యార్థుల ఎంపిక



విద్యార్థులను అభినందిస్తున్న హెచ్‌ఎం భారతి

గూడూరు, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): జాతీయస్థాయి కబడ్డీ పోటీలకు స్థానిక జడ్పీబాలుర ఉన్నత పాఠశాల విద్యార్థులు ఎంపికయ్యారని ప్రధానోపాధ్యాయురాలు భారతి తెలిపారు. మంగళవారం ఆమె మాట్లాడుతూ మాండ్లేస్ కంపెనీ సహకారంతో మ్యాజిక్ బస్ ఇండియా ఫౌండేషన్ సంస్థ ఆధ్వర్యంలో నెల్లూరు జిల్లా వెంకటాచలంలో నిర్వహించిన కబడ్డీ పోటీల్లో అండర్-14 విభాగంలో జాషువా, అండర్-17 విభాగంలో లోకేష్ ప్రతిభ చూపి జాతీయస్థాయి పోటీలకు ఎంపికయ్యారన్నారు. ఈనెల 20, 21 తేదీల్లో హిమాచల్‌ప్రదేశ్‌లో జరగనున్న జాతీయస్థాయి శుబ్ ఆరంబ్ ట్రోఫీ టోర్నమెంట్‌లో వీరు పాల్గొంటారని తెలిపారు. కార్యక్రమంలో వ్యాయమ ఉపాధ్యాయుడు శివకుమార్, హరికృష్ణ తదిత రులు పాల్గొన్నారు.

వివాదాస్పద భూముల పరిశీలన



అష్టకావేరి గ్రామంలో వివాదాస్పద భూమిని పరిశీలిస్తున్న సబ్ కలెక్టర్ రాఘవేంద్ర మీనా

బాలయపల్లి, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని అష్టకావేరి గ్రామంలో పల్లిపాటి రమణయ్య, వున్నం మస్తాన్ నాయుడు మధ్య వివాదాస్పదంగా ఉన్న భూమిని మంగళవారం గూడూరు సబ్‌కలెక్టర్ రాఘవేంద్ర మీనా పరిశీలించారు. భూమికి సంబంధించిన వివరాలను ఇరువర్గాల నుంచి సేకరించారు. సమస్య పరిష్కారానికి తగు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఆయన వెంట తహసీల్దారుతో పాటు రెవెన్యూ అధికారులు ఉన్నారు.

చెంగాళమ్మ ఆలయంలో నిత్యాన్నదానానికి రూ.లక్ష విరాళం

సూళ్లూరుపేట, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): సూళ్లూరుపేటలోని చెంగాళమ్మ ఆలయంలో జరుగుతున్న నిత్యాన్నదాన కార్యక్రమానికి మంగళవారం గూడూరుకు చెందిన విజయకుమార్, వసుంధర దంపతులు రూ.1,00,116 అందజేశారు. ముందుగా అమ్మవారిని దర్శించుకున్న అనంతరం ఆలయ సిబ్బందికి చెక్కు అందజేశారు.

ఆర్థిక సాయం



ఆర్థికసాయం అందజేస్తున్న రాజనేని రామానాయుడు చారిటబుల్ ట్రస్ట్ సభ్యులు

గూడూరు అర్బన్, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): స్థానిక గాంధీనగర్‌కు చెందిన హరిబాబు కిడ్నీ వ్యాధితో బాధపడుతూ ఇటీవల మృతి చెందాడు. మంగళవారం రాజనేని రామానాయుడు చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో మృతుడి కుటుంబ సభ్యులకు రూ.20వేలు ఆర్థిక సాయం అందజేశారు. ట్రస్ట్ సభ్యుడు బాబు పాల్గొన్నారు.

దళిత స్త్రీ వేదనను చిత్రించిన కవిత్వం

డాక్టర్ భీమన్న

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), మార్చి 11 (ఆంధ్రజ్యోతి): సమాజం ఎంతో అభివృద్ధి సాధించినప్పటికీ దళిత మహిళ నేటికీ వివక్షను అనుభవిస్తూ ఉందని ఎస్వీ ఆర్ట్స్ కాలేజీ తెలుగు అధ్యాపకులు డాక్టర్ భీమన్న తెలిపారు. పద్మావతి మహిళా యూనివర్సిటీ తెలుగు విభాగంలో మంగళవారం నిర్వహించిన కటాక్షమ్మ పాల్‌రాజ్ ధర్మనిధి ఉపన్యాసంలో భాగంగా 'దళిత కవిత్వంలో స్త్రీ' అనే అంశంపై ఆయన ప్రసంగించారు. సాహిత్యరంగంలో సామాన్యుల జీవితాన్ని ప్రతిబింబించేలా బసవేశ్వరుడి నుంచీ వేమన, వీరబ్రహ్మం వంటి సంస్కర్తలు కృషి చేశారన్నారు. గద్దర్, కలేకూరి ప్రసాద్ వంటి వారు దళిత స్త్రీ జీవిత వేదనను కవిత్వంగా మలిచారని తెలిపారు. తద్వారా దళిత స్త్రీ జీవిత మార్పునకు ప్రయత్నించారన్నారు. కార్యక్రమంలో డీన్ విజయలక్ష్మి, తెలుగు విభాగాధిపతి కొలకలూరి మధుజ్యోతి, అధ్యాపకులు వై.సుభాషిణి, డి.యువశ్రీ, విద్యార్థులు పాల్గొన్నారు.



భీమన్నను సన్మానిస్తున్న తెలుగు అధ్యాపకులు

సకాలంలో పన్నులు చెల్లించండి

గూడూరు, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): పట్టణ ప్రజలు సకాలంలో ఆస్తి, కొళాయి పన్నులను చెల్లించి మున్సిపాలిటి అభివృద్ధికి సహకరించాలని కమిషనర్ వెంకటేశ్వర్లు కోరారు. మంగళవారం మున్సిపల్ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రజలు పన్నులను సకాలంలో చెల్లిస్తే అభివృద్ధి పనులను చేపట్టవచ్చన్నారు. అదేవిధంగా చెత్తను రోడ్లపై వేయకుండా పారిశుధ్య సిబ్బందికి అందజేయాలని సూచించారు. ఇక పర్యావరణానికి హాని కలిగించే ప్లాస్టిక్ వస్తువుల వాడకాన్ని ఆపేయాలని, ఎవరైనా ప్లాస్టిక్ వస్తువులను విక్రయిస్తే కఠిన చర్యలు చేపడుతామన్నారు.

సంగమేశ్వరుడి హుండీ లెక్కింపు



హుండీ ఆదాయాన్ని లెక్కిస్తున్న అధికారులు

కోట, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): కోట మండలం గూడలిలో వెలసిన కామాక్షీదేవి సమేత సంగమేశ్వరస్వామి హుండీని మంగళవారం దేవదాయశాఖ అధికారులు లెక్కించారు. ఆ శాఖ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసులు, ఈవో శశ్యాంక్, ఆలయ ప్రధానార్చకుడు కార్తీక్‌స్వామి సమక్షంలో స్వామివారి హుండీని లెక్కించగా రూ.63,548 ఆదాయం వచ్చింది. కార్యక్రమంలో టీడీపీ మండల ఉపాధ్యక్షుడు పల్లెమల్లు వెంకటకృష్ణారెడ్డి, మాజీ సర్పంచ్ వీరరాఘవరెడ్డి పాల్గొన్నారు.

విద్యా సామగ్రి అందజేత

తడ, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): వాటంబేడు జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులకు సూళ్లూరుపేట రోటరీక్లబ్ ఆధ్వర్యంలో విద్యా సామగ్రి అందజేశారు. మంగళవారం పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో రోటరీక్లబ్ మాజీ అసిస్టెంట్ గవర్నర్ వేనాటి విజయలక్ష్మి చేతుల మీదుగా విద్యాసామగ్రి అందజేశారు. కార్యక్రమంలో ఎంఈవో మల్లికార్జునరావు, రోటరీక్లబ్ కార్యదర్శి రామకృష్ణ, సభ్యులు చక్రవర్తి, ప్రధానోపాధ్యాయులు కుసుమకుమారి, ఉస్మాన్ భాషా పాల్గొన్నారు.

వీధికుక్క దాడిలో బాలికకు గాయాలు



గాయపడిన చాందిని

చిట్టమూరు, మార్చి 11 మండల పరిధిలోని దరఖాస్తు గ్రామంలో మంగళ వారం వీధికుక్క దాడి చేయడంతో నాలుగేళ్ల చిన్నారికి తీవ్ర గాయా లయ్యాయి. చిన్నారి చాందిని ఇంటి ముందు వీధిలో ఆడుకుంటుండగా వీధికుక్క దాడిచేసి గాయ పరిచింది. తల్లిదండ్రులు గమనించి వెంటనే గూడూరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

ఎన్నికల ప్రక్రియలో అపరిష్కృత అంశాలపై ఫిర్యాదు చేయండి

రాజకీయ పార్టీల నేతలకు ఎన్నికల కమిషన్ సూచన

తిరుపతి(కలెక్టరేట్), మార్చి 11(ఆంధ్రజ్యోతి): సార్వత్రిక, ఉప ఎన్నికల్లో అపరిష్కృతంగా ఉన్న అంశాలపై రాజకీయ పార్టీ నాయకులు ఏప్రిల్ 30వ తేదీ లోపు ఫిర్యాదుచేయవచ్చని భారత ఎన్నికల సంఘం మంగళవారం ఓ ప్రకటనలో తెలిపింది. ఎన్నికల ప్రక్రియ నిర్వహణను బలోపేతం చేసి పారదర్శకంగా నిర్వహించేందుకు అపరిష్కృతంగా ఉన్న పలు అంశాలను గుర్తింపు పొందిన రాష్ట్ర, జాతీయ పార్టీ ప్రతినిధులకు సూచించారు. ఈఆర్వో, జిల్లా ఎన్నికల అధికారి వద్ద ఫిర్యాదు చేసినా పరిష్కారం కాని అంశాలపై ఏప్రిల్ 30లోపు ఫిర్యాదుచేయాలని ఎన్నికల సంఘం సూచించింది.

నేటి నుంచి వర్క్‌షాప్

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), మార్చి 11(ఆంధ్రజ్యోతి): శ్రీవేంకటేశ్వర వేద వర్సిటీలో బుధవారం నుంచి 21 రోజుల పాటు ఆగమ సిద్ధాంతంపై అంతర్జాతీయ వర్క్‌షాప్ నిర్వహించనున్నారు. ప్రారంభ సభ బుధవారం ఉదయం 10 గంటలకు పరిపాలనా భవనంలో నిర్వహిస్తారు. ఇందులో వీసీ రాణీసదాశివమూర్తి, శ్రీవారి ఆలయ ప్రధానార్చకులు అర్చకం వేణుగోపాల దీక్షితులు, ప్రముఖ వైఖానస ఆగమ పండితులు వేదాంతం సత్యశ్రీనివాస అయ్యంగార్ పాల్గొంటారని ప్రోగ్రామ్ కోఆర్డినేటర్ రాజేష్‌కుమార్ తెలిపారు.

అపరిచితుల పట్ల అప్రమత్తంగా ఉండాలి



కంపెనీలకు వెళ్లే యువతులతో మాట్లాడున్న సీఐ మురళీకృష్ణ

సూళ్లూరుపేట, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): అపరిచితుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సీఐ మురళీకృష్ణ అన్నారు. మంగళవారం తెల్లవారుజామున సూళ్లూరుపేట పట్టణంలోని పలు ప్రధాన కూడలి ప్రాంతాల్లో పోలీసుల తనిఖీలు చేపట్టారు. "శ్లమిట్ట, షార్ బైపాస్ కూడలి వై జంక్షన్ వద్ద పరిశ్రమలకు వెళ్తున్న యువతుల వివరాలడిగి తెలుసుకొన్నారు. విధులకు వెళ్లేటప్పుడు, తిరిగి వచ్చే సమయంలో అపరిచితుల పట్ల జాగ్రత్తగా ఉండాలని సూచించారు. ముఖ్యంగా ఒంటరిగా వెళ్లే వారిని చైన్ స్నాచర్లు టార్గెట్ చేస్తున్నారని తెలిపారు. రాత్రి, తెల్లజాము సమయాల్లో కొత్త వ్యక్తులు వెంబడించినా, అనుమానాస్పదంగా సంచరిస్తున్నా అప్రమత్తంగా ఉండాలని సూచించారు. కంపెనీల్లో విధులకు వెళ్లే యువతులు రాత్రి సమయాల్లో జనసంచారం ఉన్నచోటే బస్సులు దిగి ఇళ్లకు వెళ్లాలన్నారు.

ఎన్‌బీకేఆర్‌లో ప్రాంగణ ఎంపికలు



ఎంపికైన విద్యార్థులను అభినందిస్తున్న ప్రాంగణ ఎంపికల అధికారి, కంపెనీ ప్రతినిధులు

కోట, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని విద్యానగర్ ఎన్‌బీకేఆర్ ఇంజనీరింగ్ కళాశాలలో మంగళవారం బీటెక్ ఆఖరి సంవత్సరం చదువుతున్న మెకానికల్, ఎలక్ట్రికల్ విద్యార్థులకు ప్రాంగణ ఎంపికలు జరిగాయి. గుజరాత్‌కు చెందిన ఆటాహి మోడీ మెటీరియల్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ ఇంటర్వ్యూలు నిర్వహించింది. వర్చువల్ రౌండ్‌కు 37మంది విద్యార్థులు హాజరుకాగా 10 మంది టెక్నికల్ రౌండ్‌కు ఎంపికయ్యారు. చివరగా హెచ్‌ఆర్ రౌండ్‌లో నలుగురు ఉద్యోగాలకు ఎంపికయ్యారు. ఆయా విద్యార్థులను కళాశాల డైరెక్టర్ డాక్టర్ విజయకుమార్‌రెడ్డి, ప్రాంగణ ఎంపికల అధికారి డాక్టర్ కిషందర్ అభినందించారు.

వేనాడులో వైద్యశిబిరం



ప్రజలకు వైద్య పరీక్షలు చేస్తున్న వైద్యాధికారి జయశ్రీదేవి, సిబ్బంది

సూళ్లూరుపేట, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): వేనాడు గ్రామంలో రామాపురం ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వైద్యాధికారి జయశ్రీదేవి ఆధ్వర్యంలో మంగళవారం వైద్య శిబిరం నిర్వహించారు. వేనాడు దళితవాడవాసులు రెండు రోజుల నుంచి జ్వరంతో బాధపడుతున్నారు. ఈ నేపథ్యంలో వైద్యశిబిరం ఏర్పాటు చేసి స్థానికులకు వైద్య పరీక్షలు చేసి మందులు అందజేశారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ రాజకుమారి, వైద్య సిబ్బంది శివరంజని, సుశీల, సరస్సు, కల్యాణి, కిషోర్ కుమార్ పాల్గొన్నారు.

తీరప్రాంత గ్రామాల అభివృద్ధికి నిధులివ్వండి



నిర్మలా సీతారామన్‌తో మాట్లాడుతున్న కొమారి కోటేశ్వరరావు

కోట, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): గూడూరు నియోజకవర్గంలోని చిల్లకూరు మండలం మొదలుకొని సూళ్లూరుపేట నియోజకవర్గంలోని తడ మండలం వరకు సముద్రం వెంబడి ఉన్న తీర ప్రాంత గ్రామాల అభివృద్ధికి నిధులు కేటాయించాలని బీజేపీ రాష్ట్ర మాజీ ఉపాధ్యక్షుడు కొమారి కోటేశ్వరరావు కేంద్ర ఆర్థిక శాఖామంత్రి నిర్మలా సీతారామన్‌కు విజ్ఞప్తి చేశారు. మంగళవారం ఢిల్లీలోని మంత్రిని ఆమె నివాసంలో కలిసి వినతిపత్రం అందజేశారు. అదేవిధంగా నాలుగు మండలాలకు కూడలిగా ఉన్న కోట సామాజిక ఆరోగ్య కేంద్రం సామర్థ్యాన్ని 50 పడకలకు పెంచి అభివృద్ధి చేయాలని కోరారు.

ఏసీసీఎల్ లీగ్‌లో జాతీయ సంస్కృత విశ్వవిద్యాలయం జట్టు సత్తా

తిరుపతి(క్రీడలు), మార్చి 11(ఆంధ్రజ్యోతి): స్థానిక ఎన్టీఆర్ క్రికెట్ స్టేడియంలో మంగళవారం జరిగిన మెగా కార్పొరేటర్ క్రికెట్‌లీగ్‌లో జాతీయ సంస్కృత విశ్వవిద్యాలయం(ఎన్ఎస్‌యూ), ఎస్పీడీసీఎల్ జట్లు తలపడ్డాయి. ఆద్యంతం ఉత్కంఠంగా సాగినా చివరికి ఎన్ఎస్‌యూ జట్టునే విజయం వరించింది. తొలుత ఎస్పీడీసీఎల్ జట్టు నిర్ణీత 20 ఓవర్లలో ఆరు వికెట్లు కోల్పోయి 177 పరుగులు చేసింది. అనంతరం బరిలోకి దిగిన ఎన్ఎస్‌యూ జట్టు అనూహ్యంగా విజయాన్ని అందుకుంది. కెప్టెన్ ఊకా సేతురామ్ చివరి ఓవర్లో అసాధారణ ఆటతీరును కనబరచి జట్టుకు విజయం చేకూర్చాడు. దీంతో సహచరులు, ప్రేక్షకులు అభినందించారు.



విజేతగా ఎన్ఎస్‌యూ జట్టు